


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-8-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 187 పేజీలు: 8+4 వెల: 6.50


పార్లమెంటుకు గైర్హాజరు కావొద్దు: ఎంపీలతో ప్రధాని

ప్రెషర్ గ్రూప్‌గా మాత్రమే పనిచేస్తాం: కాక్రోచ్ పార్టీ

5లో

# రాష్ట్రమంతా సమతుల్య అభివృద్ధి

## ● నిర్దిష్ట ప్రణాళికతో కార్యాచరణ ● ప్రజల ఆకాంక్షల మేరకు విఇఆర్ అభివృద్ధి ● విశాఖ ఎకనమిక్ రీజియన్ సమగ్ర అభివృద్ధికి మైక్రోప్లానింగ్ సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ.ఆగస్టు 5.ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాల్లో సమాంతర అభివృద్ధిని సాధించేందుకు ప్రభుత్వం నిర్దిష్ట ప్రణాళికతో కార్యచరణ చేపట్టిందని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. అమరావతితో పాటుగా ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలను అభివృద్ధి చేస్తుందన్నారు. పారిశ్రామికంగాను, విద్యా, వైద్య, రవాణా రంగాల్లో అభివృద్ధి జరుగుతుంది. ఇందుకోసం రూ.వేలకోట్లు పెట్టుబడులను ఆహ్వానించడమే కాకుండా, వాటన్నింటి గ్రౌండ్ చేయించే దిశలో కృషి జరుగుతుంది.ఈ క్రమంలోనే అభివృద్ధిలో అత్యంత కీలకమైన విశాఖ ఎకనామిక్ రీజియన్ (విఇఆర్) అభివృద్ధి ప్రణాళికలపై అమలు చేయనున్నా మన్నారు. ఈ ప్రణాళికలపై సిఎం చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ బృహత్ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.9.50 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ సమీక్షా సమావేశంలో విఇఆర్ ప్రాజెక్టు ఆర్థిక స్వరూపాన్ని, కార్యాచరణను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం పెట్టుబడులలో భాగంగా ప్రభుత్వం రూ.3.50 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు



బుధవారం అమరావతిలో జరిగిన ఎకనమిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికల సమీక్షలో సిఎం చంద్రబాబు

సమకూర్చాలని, మిగిలిన రూ.5.30 లక్షల కోట్లను ప్రైవేట్ రంగం నుంచి రాబట్టేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించారు. విఇఆర్ ప్రాజెక్టు ఆర్థిక స్వరూపాన్ని, కార్యాచరణను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం పెట్టుబడులలో భాగంగా ప్రభుత్వం రూ.3.50 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల వరకు సమకూర్చాలని, మిగిలిన రూ.5.30 లక్షల కోట్లను ప్రైవేట్ రంగం నుంచి రాబట్టేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఎఐ డేటా సెంటర్ల ఎకో సిస్టం, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పర్యాటకం, హైడ్రోజన్, క్లీన్‌టెక్ ఎనర్జీ వంటి కీలక రంగాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సిఎం ఆదేశించారు. వివిధ ప్రాజెక్టులను పరస్పరం అనుసంధానించడం ద్వారానే విశాఖ ఎకనామిక్ రీజియన్ వేగంగా ప్రగతి సాధిస్తుందని ఆయన పేర్కొన్నారు.

నిధుల కన్వర్జెన్స్ పద్ధతిని అనుసరించాలని, అవసరమైన చోట వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (విజిఎఫ్) స్కీంను కూడా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు, విఇఆర్ ప్లానింగ్ కోసం ఆంధ్రా యూనివర్శిటీ సేవలు తీసుకుంటున్నట్లు వివరించారు.మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్ర వరం అఖండ గోదావరి ప్రాజెక్టు వరకూ విఇఆర్ అభివృద్ధిలో భాగంగా ఉండాలని సిఎం సూచన చేసారు. వివిధ ప్రాజెక్టులను అనుసంధానించటం ద్వారా విశాఖ ఎకనామిక్ రీజియన్ ప్రగతి సాధించాలని స్పష్టం చేసారు. నిధుల కన్వర్జెన్స్ ద్వారా విఇఆర్ పరిధిలో అభివృద్ధి చేపట్టాలని నిర్దేశించారు. అవసరమైన మేరకు విజిఎఫ్ స్కీంను అమలు చేయాలని సూచించారు. వివిధ ప్రాజెక్టులను అనుసంధానించటం ద్వారా విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ ప్రగతి సాధించాలని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. నిధుల కన్వర్జెన్స్ >>2

# క్షమించండి

## భారత్‌కు క్షమాపణ చెప్పిన జుకర్‌బర్గ్

తమ ప్లాట్‌ఫాంలపై అభ్యంతరకర, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తిపై విచారం ప్రకటించిన 'మెటా' సిఇఒ

ప్రధాని మోడీ ఫేస్‌బుక్ పోస్టును మెటా కొద్దిసేపు తొలగించడంపై కేంద్రం ఆగ్రహం



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ భారత ప్రభుత్వానికి క్షమాపణలు తెలిపారు. ప్రధాని మోడీ విడియో తొలగింపు, తమ ప్లాట్‌ఫామ్‌లపై చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తి చెందడంపై ఆయన చింతిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు, తమ ప్లాట్‌ఫామ్‌ల నిర్వహణలో జరిగిన లోపాలను కూడా అంగీకరిస్తూ ఆయన విచారం వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు బుధవారం వెల్లడించాయి. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీకి చెందిన ఓ ఫేస్‌బుక్ పోస్ట్‌ను కొద్దిసేపు తొలగించడంపై పార్లమెంటరీ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ వివాదంపై చర్చించేందుకు మెటా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఢిల్లీలో ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా, అభ్యంతరకర, తప్పుడు కంటెంట్ వ్యాప్తిపై భారత ప్రభుత్వం లేవనెత్తిన ఆందోళనలను మెటా ప్రతినిధులు అంగీకరించారని, ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లపై >>2



బుధవారం విశాఖలో స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి లోకేష్

# క్రీడా రాజధానిగా విశాఖకు కొత్త రూపు

## పివి సింధు స్పోర్ట్స్ అకాడెమీకి శంకుస్థాపన చేసిన మంత్రి లోకేష్

## క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తాం

**విశాఖపట్నం, జులై 5, ప్రభాతవార్త:** విశాఖలో నిర్మించనున్న పివి సింధు స్పోర్ట్స్ అకాడమీ వేలాది మంది భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దే వేదికగా నిలుస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖలమంత్రి నారా లోకేష్ అన్నారు. బుధవారం అకాడమీ నిర్మాణ పనులకు భూమిపూజ అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పివి సింధు సాధించిన విజయాల వెనుక ఆమె తల్లిదండ్రులు, కోచ్‌ల త్యాగం, క్రమశిక్షణ, అచంచల పట్టుదల ఉన్నాయని లోకేష్ పేర్కొన్నారు. సింధు తన వ్యక్తిగత విజయాలను భవిష్యత్ తరాలకు అందించాలనే సంకల్పంతో అకాడమీ ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయ మన్నారు. కేవలం బ్యాడ్మింటన్‌కే పరిమితం కాకుండా స్విమ్మింగ్, జిమ్నా >>2

# చంపినా సరే.. ప్రజలమధ్యే ఉంటా

## అది విద్యార్థి ఉద్యమం కాదు.. ప్రభుత్వ మార్పుకోసం కుట్ర

ఉద్యమం మొదటి నుంచి హింసాత్మకమే

మహ్మద్ యూనస్‌పై తీవ్ర ఆరోపణలు చేసిన షేక్ హసీనా

రెండేళ్ల తర్వాత బహిరంగంగా బంగ్లా మాజీ ప్రధాని ప్రసంగం



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** బంగ్లాదేశ్‌లో జరిగిందిన విద్యార్థుల స్వచ్ఛంద ఉద్యమం కాదని, ముందే రూపొందించిన ప్రభుత్వ మార్పు కుట్ర అని ఆరోపించారు. రిజర్వేషన్ కోటా ఉద్యమాన్ని ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా మార్చి తనను అధికారంలో నుంచి తొలగించే ఉద్యమంగా మార్చారని ఆరోపించారు. ఉద్యమం మొదటి నుంచే శాంతియుతంగా లేదని హసీనా పేర్కొన్నారు. ప్రభుత్వం హైకోర్టు కోటా తీర్పుపై అప్పీల్ చేసిందని, విద్యార్థి నాయకులతో చర్చలకు సిద్ధమైందని కూడా ఆమె చెప్పారు. కొన్ని గుంపులు ఈ >>2

# రాయలసీమ దాహానికి శ్రీశైలం జలాలు

**- మంత్రి నిమ్మల రామానాయుడు**



**విజయవాడ, ఆగస్టు 5, ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమ మంచినీటి అవసరాల కోసం శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు.రాయలసీమ తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం నుంచి నీటి విడుదల. ఎల్‌నినో నేపథ్యంలో మంచినీటి కోసం భద్రపరచుకోవాలన్నారు. 2027 జూన్ వరకు శ్రీశైలం జలాలను తాగునీటి కోసం భద్రపరచుకోవాలి అన్నారు. రాబోయే 10 రోజుల్లో శ్రీశైలానికి మరో 100 టిఎంసిలు రావచ్చని అంచనా అన్నారు.అమరావతి సచివాలయంలో జలవనరుల నిర్వహణ, నీటి విడుదలపై అధికారులతో మంత్రి రామానాయుడు సమీక్ష నిర్వహించారు. కృష్ణా జలాల్లో ఎపి 63 శాతం వాటాను ప్రథమంగా తాగునీటికే ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. హంద్రీనీవా పరిధిలోని రిజర్వాయర్ల తాగునీటి అవసరాలకు 13 టిఎంసిలు అవసరం. పోతిరెడ్డిపాడు పరిధిలోని రిజర్వాయర్లకు మంచినీటి కోసం 10 టిఎంసిలు రేపటినుంచి విడుదల చేస్తున్నామన్నారు.

తెలుగుగంగ ద్వారా చెన్నై తాగునీటికి 10 టిఎంసిలు విడుదల చేయాల్సి ఉంది. నాగార్జున సాగర్ రైట్ కెనాల్, లెఫ్ట్ కెనాల్ పరిధి తాగునీటికి 32 టిఎంసిలు అవసరం అన్నారు.ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడతాం అన్నారు. 2027 జూన్ వరకు నీటిని భద్రపరుచుకోవడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఎల్‌నినో విపత్తు ముప్పు పొంచి ఉన్నందున కృష్ణా జలాల్లో ఎపికి ఉన్న 63 శాతం వాటాలో తాగునీటికే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం శ్రీశైలంలో 119 టిఎంసిల నీరు నిల్వ ఉందని, రాబోయే 10 రోజుల్లో మరో 100 టీఎంసీల వరకు >>2




బుధవారం విజయవాడలో బిసి ముసాయిదా రక్షణ చట్టంపై జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రులు సవిత, అచ్చెన్నాయుడు, పార్థసారధి తదితరులు

# ప్రత్యేక చట్టంతో బిసిలకు రక్షణ

## కులం, వృత్తిపేరిట దూషిస్తే కఠిన శిక్షలు

## వీలయినంత త్వరగా చట్టం చేస్తాం: మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత, పార్థసారధి

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** బిసి రక్షణ చట్టంతో వెనుబడిన వర్గాలు గౌరవ ప్రదంగా సామాజిక జీవనం కొనసాగించేలా రక్షణ కల్పిస్తున్నామని, కులం, వృత్తుల పేరుతో దూషిస్తే కఠినంగా శిక్షించేలా చట్టం రూపొందిస్తున్నామని మంత్రులు ఎస్.సవిత, అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ చట్టంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల అభిప్రాయాలు తీసుకున్నామని, త్వరలో జిల్లా స్థాయిలోనూ బిసి సంఘాల ప్రతినిధుల నుంచి సలహాలు తీసుకుంటామని తెలిపారు. బిసి ముసాయిదా రక్షణ చట్టం జాతీయ బిసి కమిషన్ దృష్టికి తీసుకెళతామని, అక్కడ అనుమతి రాగానే అసెంబ్లీలో ఆమోదానికి ప్రవేశపెడతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ >>2

# ఎమ్మెల్సీ అనంత బాబు బెయిల్ పిటిషన్ రద్దు

2లో

# మరో 4 రోజులు భారీ వర్షసూచన

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోని ఉపరితల ఆవర్తన ప్రభావంతో రాబోయే నాలుగైదు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్‌లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో బుధవారం నుంచి మరో మూడు రోజుల పాటు మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. కోస్తా, ఉత్తరాంధ్ర అలాగే రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రత్యేక సూచనలు చేశారు. భారీ వర్షాల సమయంలో చెట్ల కింద తలదాచుకోరాదని హెచ్చరించారు. వేటకు వెళ్లే మత్స్యకారులు వాతావరణ శాఖ హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాజాగా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, ఎగువన వస్తున్న వరదతో జలాశయాల్లో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. దీంతో రైతన్నలు పొలం పనులు వేగవంతం చేస్తున్నారు. మరో వైపు తుంగభద్ర డ్యాంకు వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో లక్ష క్యూసెక్కులు నమోదవగా, డ్యాం నీటిమట్టం పదహారు వందల పందొమ్మిది అడుగులకు చేరింది. మైత్తం 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 59 టీఎంసీల నీటి నిల్వ నమోదవడంతో అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. శ్రీశైలం జలాశయం యాభై శాతానికి పైగా నిండింది. జూరాల నుంచి రెండులక్షల నలభై ఐదువేల క్యూసెక్కుల వరద వస్తుండగా, ప్రస్తుతం నీటిమట్టం ఎనిమిదివందల అరవై మూడు అడుగులకు చేరింది. జలాశయంలో నూట పద్దెనిమిది టిఎంసిల నీటి నిల్వ నమోదైంది.

# ఐబిఎం సేవలు ఇక విస్తృతం

## విశాఖలో 'ఐబిఎం ఫ్యూచర్ నౌ' సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి లోకేష్

**విశాఖపట్నం, ఆగస్టు5 ప్రభాత వార్త :** ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఐబిఎం, విశాఖపట్నంలో తన నూతన ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్ నౌ సెంటర్ ను ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ సేవలకు మద్దతుగా విశాఖ ఇసుకతోట జంక్షన్ లోని లాన్సమ్ స్క్వేర్ భవనంలో ఐబీఎం సంస్థ ఏర్పాటుచేసిన ఫ్యూచర్‌నౌ సెంటర్‌ను ఐబీఎం ఇండియా, సౌత్ ఏసియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్ తో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐ గవర్నెన్స్ ఇంటిలిజెన్స్, కెమికల్స్ అండ్ పెట్రోలియం ఇండస్ట్రీ ఆపరేషన్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా కన్సల్టింగ్ సేవలు, ఎఐ ఫస్ట్ ట్రాన్స్ ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ను ఏర్పాటుచేయడం జరిగింది. భారతదేశ సాంకేతిక ఆవిష్కరణలు, ప్రతిభావంతులైన మానవ వనరుల అభివృద్ధిపై సంస్థ కొనసాగిస్తున్న పెట్టుబడులకు ఇది మరో కీలక ముందడుగు కానుంది. ఈ సెంటర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖాతాదారులకు కన్సల్టింగ్, సాంకేతిక సేవలను అందించనుంది. ఇందులో కృత్రిమ మేధస్సు (ఎఐ), హైబ్రిడ్ క్లౌడ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా, అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కీలక రంగాల్లో సేవలు అందించనున్నారు. అదేవిధంగా ఏఐ ఆధారిత క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ప్లాట్‌ఫార్మ్ ఇంజనీరింగ్, సర్వీస్ ఇంటిగ్రేషన్, క్వాలిటీ ఇంజనీరింగ్, యూజర్ ఎక్స్‌పీరియన్స్ సేవలకు ఇది ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది. ..ఫ్యూచర్ రెడీ టెక్నాలజీ వర్క్ ఫోర్స్ అభివృద్ధే లక్ష్యం భారతదేశంలోని అభివృద్ధి చెందుతున్న సాంకేతిక కేంద్రాల్లో ఆవిష్కరణలు, సేవల సామర్థ్యాలను విస్తరించాలన్న ఐబీఎం లక్ష్యానికి ఈ ఫ్యూచర్‌నౌ సెంటర్ ప్రతీకగా నిలుస్తోంది. విస్తృత సాంకేతిక ప్రతిభ, బలమైన విద్యాసంస్థలు, వేగంగా అభివృద్ధి చెందు తున్న సాంకేతిక పర్యావరణ వ్యవస్థతో విశాఖపట్నం ప్రపంచ >>2




బుధవారం విశాఖలో ఫ్యూచర్ నౌ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి లోకేష్

# అగ్రిగోల్డ్ భూములు 6వేల ఎకరాలు వేలం

## మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం

## 11 నాటికి విధివిధానాలు ఖరారు

**విజయవాడ.ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** అగ్రిగోల్డ్‌కు చెందిన 6,000 ఎకరాలకు పైగా భూములను వెంటనే వేలం వేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. సచివాలయంలో హోం మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణపై సమగ్రంగా చర్చించారు. భూముల వేలం ప్రక్రియను వేగంగా ప్రారంభించాలని సిఐడి, పోలీసు శాఖలను సబ్ కమిటీ ఆదేశించింది. ఆస్తుల వేలానికి సంబంధించిన పూర్తి విధివిధానాలను ఈ నెల 11 నాటికి ఖరారు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. బాధితుల కేసుల వేగవంతమైన విచారణ కోసం ఆగస్టు 15లోగా ప్రత్యేక కోర్టును కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకుంది. 9 రాష్ట్రాల్లోని డిపాజిటర్లకు బాండ్లు అందించేందుకు ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక సెల్స్, డిపాజిటర్ల సమాచారం కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. సెప్టెంబర్ 15 నాటికి బాండ్ల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని, సిఎం చంద్రబాబు నాయుడి ఆదేశాల మేరకు విడతల వారీగా చెల్లింపులు జరపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అగ్రిగోల్డ్ డిపాజిటర్లకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.. అగ్రిగోల్డ్‌కు చెందిన 20 వేల ఎకరాలు ఎపిలో ఉన్నాయి. 6 వేల ఎకరాల అగ్రిగోల్డ్ భూములను >>2



ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలకు శ్రీశైలం జలాశయం నిండిన దృశ్యం

# ఉప్పొంగిన కృష్ణమ్మ

## శ్రీశైలం జలాశయానికి పోటెత్తిన వరద

### జూరాల 40 గేట్లు ఎత్తి నీటి విడుదల

### ఎస్సారెస్పీలో 37.37 టిఎంసిల నీటి నిల్వ

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 125.62 టీఎంసీల నీరు ఉంది. జలాశయానికి 24,518.3 క్యూసెక్కుల ప్రవాహం నమోదవుతుండగా, 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్, విద్యుత్ ఉత్పత్తి, దిగువ ప్రాంతాల అవసరాలను అనుగుణంగా నీటి వినియోగం కొనసాగుతోంది. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా కృష్ణ నదిపై నిర్మించిన గుర్జాపూర్, యాదగిరి జిల్లా గూడూరు భీమా నదిపై ఉన్న గుగ్గల్ బ్యారేజీకి వరద నీరు పోటెత్తడంతో ఈ బ్యారేజీ వద్ద 40 గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు మూడులక్షల క్యూసెక్కుల నీటిని దిగువనున్న శ్రీశైలానికి వదులుతున్నారు. జూరాల ఎగువన ఆరుయూనిట్లు దిగువన ఆరు యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద జలాలు తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టు కు చేరుతుండటంతో నది పరివాహక ప్రాంతం జలకళను సంతరించుకుంది. నది పూర్తిగా నీటితో నిండిపోవడంతో తెలంగాణకర్ణాటక సరిహద్దులోని కృష్ణ బ్రిడ్జి కింద ప్రవహిస్తున్న వరద ప్రవాహం ఆహ్లాదకర దృశ్యాన్ని తలపిస్తోంది. ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులతో పాటు ప్రయాణికులు కూడా బ్రిడ్జి వద్దకు చేరుకుని ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నారు. కృష్ణానదిలో రోజురోజుకు వరద ప్రవాహం పెరుగుతుండడంతో జూరాల ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, వరద ఉధృతి కారణంగా నదిలో స్నానాలు చేయడం, చేపల వేటకు వెళ్లడంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కృష్ణా నదిపై కర్ణాటకలో ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు నిండడంతో దిగువకు వరద కొనసాగుతోంది. ఆల్మట్టి నుంచి దిగువకు 1,49,597 క్యూసెక్కులు, నారాయణపూర్ నుంచి 1,47,776 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. తుంగభద్ర జలాశయంలో ప్రస్తుతం 51 టీఎంసీల నీరు ఉండగా 82వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. దిగువకు 1,589 క్యూసెక్కులు వదులుతున్నారు. నాగార్జునసాగర్ పూర్తి సామర్థ్యం 312 టిఎంసిలకు గాను ప్రస్తుతం 136 టిఎంసిల నిల్వ ఉంది .గోదావరిలో ఎగవ నుంచి తెలంగాణలోని తొలి ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు 32831 క్యూసెక్కులు వదర వచ్చిచేరుతోంది. ప్రస్తుతం అందులో 37,37టిఎంసిలు నీరు నిలిచి ఉంది.

# ఐబిఎం సేవలు ఇక విస్తృతం

>> ఖాతాదారుల అవసరాలను తీర్చేందుకు అనువైన కేంద్రంగా ఎదుగుతోంది. ఈ సెంటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ఐబీఎం తన కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన సాంకేతిక నైపుణ్యాలున్న మానవ వనరుల అభివృద్ధికి తోడ్పడాలని లక్ష్యంగా పెట్టుకుంది. ..ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలి ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ సేవలు, సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా విశాఖపట్నం ఆవిర్భవించడాన్ని ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటునందిస్తోందన్నారు. మా లక్ష్యం, కేవలం సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడం మాత్రమే కాదు, నాణ్యమైన ఉపాధిని సృష్టించడం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను అభివృద్ధి చేయడం, ఆంధ్రప్రదేశ్ యువత ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యేలా చేసే ఒక సంపూర్ణ పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే మా లక్ష్యమని అన్నారు.ఆంధ్రప్రదేశ్ పట్ల ఐబీఎం చూపుతున్న నిరంతర నిబద్ధతను మేం స్వాగతిస్తున్నామని, ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కోసం విశాఖపట్నాన్ని భారతదేశంలోని అగ్రగామి కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దడానికి ఐబీఎంతో కలిసి పనిచేయడానికిఎదురుచూస్తున్నామని అన్నారు. ..ప్రపంచ ఆవిష్కరణల గమ్యస్థానంగా భారత్‌ను తీర్చిదిద్దుతాం ఐబీఎం ఇండియా, సౌత్ ఏసియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్ మాట్లాడుతూ... వికసిత్ భారత్2047 లక్ష్య సాధనలో భారతదేశానికి డిజిటల్ యుగంలో ప్రపంచానికి నాయకత్వం వహించే అపూర్వ అవకాశం ఉందన్నారు.ప్రతిభ, ఆవిష్కరణలు, సాంకేతిక సామర్థ్యాలను సమన్వయం చేసుకుంటూ ఈ లక్ష్యాన్ని సాధించవచ్చు. ఐబీఎంలో మేం, మా ఖాతాదారులు ఏఐతో పాటు ఇతర అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను అందిపుచ్చుకుని, దీర్ఘకాలిక విలువను సృష్టించేందుకు అవసరమైన సామర్థ్యాలను నిర్మించడానికి కట్టుబడి ఉన్నామన్నారు.విశాఖపట్నంలోని ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ఏర్పాటు ఇందుకు నిదర్శనం. అలాగే ప్రపంచస్థాయి ఆవిష్కరణలు, సాంకేతిక సేవల కేంద్రంగా భారతదేశ స్థాయిని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. ..యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తాం ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ఇండియా మేనేజింగ్ పార్ట్‌నర్ ఉషా శ్రీకాంత్ మాట్లాడుతూ.. విశాఖపట్నంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రతిభ, బలమైన విద్యాసంస్థలు, టెక్నాలజీ ఎకోసిస్టమ్ వల్ల ప్రపంచ ఖాతాదారుల డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ అవసరాలకు మద్దతు ఇచ్చే కీలక కేంద్రంగా మారుతోంది.

ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ ద్వారా అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను స్థానిక ప్రతిభతో సమన్వయం చేస్తాం. ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌ను వేగవంతం చేయడంతో పాటు, స్థానిక యువతకు మరింత మెరుగైన ఉపాధి అవకాశాలను సృష్టించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రస్తుతం ఐబీఎం కన్సల్టింగ్ భారతదేశంలోని అహ్మదాబాద్, బెంగళూరు, భువనేశ్వర్, చెన్నై, కోయంబత్తూరు, గురుగ్రామ్, హైదరాబాద్, కొచ్చి, కోల్‌కతా, లక్నో, ముంబై, మైసూరు, నోయిడా, పుణె, విశాఖపట్నం సహా 15 ప్రాంతాల నుంచి ఫ్యూచర్‌నౌ సెంటర్లను నిర్వహిస్తోంది. ఐబీఎం ప్రపంచవ్యాప్తంగా హైబ్రిడ్ క్లౌడ్, ఏఐ, వ్యాపార సేవల రంగాల్లో అగ్రగామి సంస్థ. 175కి పైగా దేశాల్లోని సంస్థలు తమ డేటా నుంచి విలువైన సమాచారాన్ని పొందడం, వ్యాపార ప్రక్రియలను సరళీకృతం చేయడం, వ్యయాలను తగ్గించడం, పోటీ సామర్థ్యాన్ని పెంచుకోవడంలో ఐబీఎం సేవలను వినియోగిస్తున్నాయి. ఫైనాన్షియల్ సర్వీసెస్, టెలి కమ్యూనికేషన్స్, హెల్త్ కేర్ వంటి కీలక మౌలిక సదుపాయాల విభాగాల్లోని వేలాది ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు తమ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్స్ ను వేగంగా, సమర్థంగా, భద్రంగా అమలు చేసేందుకు ఐబీఎం హైబ్రిడ్ క్లౌడ్ ప్లాట్‌ఫాం, రెడ్ హ్యాట్ ఓపెన్ షిఫ్ట్‌ను వినియోగిస్తున్నాయి.

# రాష్ట్రమంతా సమతుల్య అభివృద్ధి

>> ద్వారా విఇఆర్ పరిధిలో అభివృద్ధి చేపట్టాలని స్పష్టం చేసారు

**ఆర్థిక రాజధానిగా విశాఖ**

విఇఆర్ ప్రాజెక్టు ద్వారా లభించే ప్రయోజనాలు, ఉద్యోగఉపాధి అవకాశాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు స్థానిక ప్రజలకు స్పష్టంగా వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా పనులు చేపడుతూ విశాఖ రీజియన్‌ను ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. సిఆర్‌జెడ్ నిబంధనలు దాటకుండా పర్యావరణ పరిరక్షణతో కూడిన పారిశ్రామిక ప్రగతి సాధించేందుకు యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో చర్చ జరుగుతున్న ఈస్ట్‌వెస్ట్ కనెక్టివిటీ ఆధారంగా విశాఖ ప్రాజెక్టుల రూపకల్పన వేగవంతం కావాలని సిఎం చంద్రబాబు తెలిపారు. తూర్పు తీరంలో ఉన్న కాకినాడ, విశాఖ పోర్టులను పశ్చిమ భారత్‌లోని కీలక ప్రాంతాలతో రోడ్డు, రైలు మార్గాల ద్వారా అనుసంధానించాలని ఆదేశించారు. విఇఆర్ పరిధిలోని 4 విమానాశ్రయాలు, 3 ప్రధాన రేవులను అనుసంధానించడం ద్వారా భారీగా పెట్టుబడులతో పాటు రవాణా రరంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని వివరించారు. గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు, ఫిన్‌టెక్, లాజిస్టిక్స్ రంగాలు ఒకదానితో ఒకటి ఇంటిగ్రేట్ అయ్యేలా కార్యాచరణ ఉండాలని అధికారులను కోరారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా విశాఖలోని జంతు ప్రదర్శనశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో మరింత అభివృద్ధి చేయాలని స్పష్టం చేశారు.

**బే సిటీ కోసం ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ కమిటీ**

బేసిటీ ప్రాజెక్ట్ అమలు కోసం ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేయాలని సిఎం చంద్రబాబు ఈ సమీక్షా సమావేశంలో పేర్కొన్నారు. అన్ని ప్రాజెక్టులను అనుసంధానం చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి. జీసిసి, ఫిన్ టెక్, లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ రంగాలపై దృష్టి సారించాలి. ఈస్ట్ టూ వెస్ట్ కనెక్టివిటీపై ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. ఐటీలో ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టుల రూపకల్పన.. పెట్టుబడుల సాధన జరిగేలా ప్రణాళికలను సిద్ధం చేయండి. రోడ్ రైల్ ఇంటిగ్రేషన్ జరగాలి. కాకినాడ, విశాఖలతో పశ్చిమ భారతదేశంలోని వివిధ ప్రాంతాలు అనుసంధానం కావాలి. ముఖ్యంగా 4 ఎయిర్ పోర్ట్స్, 3 పోర్టులు లింక్ చేసే అభివృద్ధి వేగంగా జరగుతుందనేపాటు... పెట్టుబడులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. విశాఖలో జంతు ప్రదర్శన శాలను మరింత అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టాలి. అంతర్జాతీయ నగరంగా విశాఖ ఎదుగుతోంది. ఇలాంటి ప్రాంతంలో ఉన్న జంతు ప్రదర్శన శాల మంచి పర్యాటక ప్రాజెక్టు అవుతుంది." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షలో సిఎస్ సాయి ప్రసాద్, ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక, విద్య, వైద్య శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# శ్రీశైలం జలాలు

>> ఇన్‌ఫ్లో వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు మంత్రి నిమ్మల వెల్లడించారు. పోతిరెడ్డిపాడు పరిధిలోని రిజర్వాయర్ల మంచినీటి కోసం గురువారం నుంచే 10 టిఎంసిల నీటిని విడుదల చేస్తున్నామని, హంద్రీనీవా పరిధికి 13 టిఎంసిలు, తెలుగుగంగ ద్వారా చెన్నై తాగునీటి సరఫరాకు 10 టిఎంసిలు, నాగార్జునసాగర్ రైట్, లెఫ్ట్ కెనాల్స్ పరిధికి 32 టిఎంసిల నీరు అవసరమవుతుందని వివరించారు. ప్రతి వారం పరిస్థితులను సమీక్షించుకుంటూ వర్షాలు, వరదల ఆధారంగా చర్యలు చేపడతామని మంత్రి నిమ్మల వెల్లడించారు. కలెక్టర్లు, ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి భద్రతను నిర్ధారించాలని మంత్రి ఆదేశించారు. శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతుంది. జూరాల నుంచి శ్రీశైలానికి 2 లక్షల 45 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 863.90 అడుగులకు చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215 గిలీదిలు కాగా, ప్రస్తుతం 119 గిలీదిల నీటినిల్వ ఉంది. శ్రీశైలానికి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించారు. విద్యుత్ ఉత్పత్తి చేసి 4,267 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 800 క్యూసెక్కుల వరద నీరు వదులుతున్నారని మంత్రి వివరించారు.

# 6వేల ఎకరాలు వేలం

>> వేలానికి సిద్ధం చేశామన్నారు. వేలం ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని సిఐడిని ఆదేశించామన్నారు.ఆస్తుల వేలం విధివిధానాలు ఈ నెల 11లోగా ఖరారు చేస్తామన్నారు.అగ్రిగోల్డ్ చరాస్తుల స్వాధీనానికి ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామన్నారు.. సంస్థ రూ.6 వేల కోట్ల డిపాజిట్లు సేకరించింది. అగ్రిగోల్డ్ ఏపీ నుంచే రూ.3 వేల కోట్ల డిపాజిట్లు సేకరించింది. బాధితుల వివరాల కోసం ప్రత్యేక వెబ్‌సైట్ తెస్తాం. బాధితులకు బాండ్లు అందించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తాం. సెప్టెంబర్ 15లోగా బాండ్ల ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. అగ్రిగోల్డ్‌పై ఈ నెల 11న సీఎస్‌తో కీలక సమీక్షా సమావేశం ఉంటుంది. ఆగస్టు 15లోగా అగ్రిగోల్డ్ కేసులపై ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేస్తాం అన్నారు. ఈ ప్రక్రియపై ఈ నెల 11న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో మరో కీలక సమీక్ష సమావేశం జరగనుంది. ప్రభుత్వం భూముల వేలానికి శ్రీకారం చుట్టడంపై బాధితుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, ఈ భూములను చిన్న బిట్లుగా విక్రయిస్తే బాధితులకు త్వరితగతిన పరిహారం అందుతుందని ముప్పాళ్ల నాగేశ్వరరావు అభిప్రాయపడ్డారు. సమావేశంలో అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# క్షమించండి

>> జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. యూజర్లకు ఏ కంటెంట్ చేరాలనేది ప్లాట్‌ఫామ్‌లే ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నప్పుడు, వాటిని కేవలం మధ్యవర్తులుగా పరిగణించలేమని భారత అధికారులు మెటాకు స్పష్టం చేసినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ఐటీ చట్టం కింద లభించే సేఫ్ హార్బర్ రక్షణ వర్తించదని తేల్చిచెప్పారు. కొన్ని రకాల కంటెంట్‌ను ప్రోత్సహించేందుకు (బూస్టింగ్) భారీగా డబ్బులు చెల్లించినట్లు మెటా అంగీకరించిందని, ఈ తప్పులకు విచారం వ్యక్తం చేసిందని కూడా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రధాని మోడీ పోస్ట్ తొలగింపుపై మూడు రోజుల్లోగా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పార్లమెంటరీ ప్యానెల్ మెటానుఆదేశించింది. గడువులోగా స్పందించకపోతే మెటా సేఫ్‌హార్బర్ రక్షణను కోల్పోతుందని ఐటీమంత్రిత్వశాఖవర్గాలు హెచ్చరించాయి. ఈ పరిణామాల మధ్య మెటా ప్రతినిధులు ఐటీ కార్యదర్శితో భేటీ కావడం, కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కూడా సమావేశం కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

## వారం - వర్జ్యం

06-08-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
తి.అష్టమి సా.6.49 న.భరణి రా.8.10
వ.ఉ.6.24-ఉ.7.56
దు.1. ఉ.10.05-ఉ.10.56
దు.2. మ.3.12-సా.4.03
రాహు. మ.1.30-మ.3.00 శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా వుంటుంది. పెద్ద స్థాయిని కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**వృషభం :** ఇచ్చిన ఋణాలను తిరిగి వసూలు అవ్వటం కష్టమవుతుంది. కాంట్రాక్టులు దక్కుతాయి. ఆరోగ్యం జాగ్రత్త

**మిథునం :** మిత్రులతో చేయు నూతన కార్యక్రమములు ఉత్సాహకరముగా, లాభకరముగా ఉంటాయి. వస్త్ర లాభం.

**కర్కాటకం :** మీరు చెబితేనే గాని అభివృద్ధి పనులు మీ కార్యాలయములోని వారికి తెలియవు. వస్తువులు కొనుగోలు చేస్తారు.

**సింహం :** శత్రువుల మూలకముగా కొంత మానసిక ఆందోళనకు గురౌవుతారు. వాహన యోగం. మిత్రులను కలుస్తారు.

**కన్య :** స్త్రీలతో విభేదాలు ఏర్పడకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోండి. మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది.

**తుల :** అనేక లాభదాయక వ్యవహారములు మీకు అనుకూలముగా మారుట వలన అసూయ పెరుగుతుంది.

**వృశ్చికం :** కొన్ని త్యాగముల కొరకు నిర్బంధములను అతిక్రమించ వలసి వస్తుంది. ప్రయోషన్లకు అవకాశం ఉంది.

**ధనుస్సు :** సహోదర, సహోదరి వర్గీయులు కొన్ని కారణముల వలన దూరముగా వుంటారు. గృహనిర్మాణ యత్నాలు ఫలించవు. వాహన సౌఖ్యం.

**మకరం :** స్వజనుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. విక్రయ ప్రదర్శనలు కలిసి వస్తాయి. ఇంటా బయటా అనుకూలం.

**కుంభం :** విద్యా సారస్వత, రాజకీయ రంగాలలో కొన్ని వివాదాలు రావచ్చు. వ్యాపార ప్రకటనలు ఆకర్షిస్తాయి.

**మీనం :** రహస్య విరోధులపై విచారణలు, అభియోగాలు సంభవం. ఉమ్మడిగా సాగించే కృషికి ప్రతిఫలం వస్తుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రత్యేక చట్టంతో బిసిలకు రక్షణ

>> సహకారంతో వీలైనంత త్వరగా బిసి రక్షణ అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ హోటల్ లో బిసి ముసాయిదా రక్షణ చట్టంపై రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో బిసి సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో బుధవారం కీలక సమావేశం జరిగింది. సమావేశ అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రులు మాట్లాడారు. ముందుగా మంత్రి సవిత సవిత మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు బిసి రక్షణ చట్టాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు. బిసిలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. బిసిలను వేధించినా, జాతి, కుల వృత్తుల పేరుతో దూషించినా బిసి రక్షణ చట్టం కింద శిక్షార్హులున్నారు. బిసి రక్షణ చట్టం కేసుల్లో సత్వర పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందజేసిన సలహాలు సూచనలను ఇప్పటికే రూపొందించిన బిసి ముసాయిదా రక్షణ చట్టం బిల్లులో పొందుపరుస్తామన్నారు. త్వరలో జిల్లాల్లోనూ బిసి సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామన్నారు. తుది నివేదికను త్వరలో జాతీయ బీసీ కమిషన్‌కు అందజేస్తామన్నారు. బిసి కమిషన్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే, అసెంబ్లీలో ఆమోదానికి బిసి రక్షణ చట్టాన్ని సభలో ప్రవేశపెడతామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో బిసి రక్షణ చట్టం అమలుకు కృషి చేస్తామని మంత్రి సవిత వెల్లడించారు. బిసిల అభ్యున్నతే లక్ష్యంగా అన్న ఎన్టీఆర్ పార్టీ ని స్థాపించారన్నారు. సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ సైతం బిసిలను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేలా వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. బిసిలు సమాజానికి బ్యాక్‌బోన్లు అని వ్యక్తులు సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ అని మంత్రి సవిత తెలిపారు.

**బీసీలను వేధించిన గత ప్రభుత్వం: మంత్రి అచ్చెన్నాయుడు**

బిసి రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మా పార్టీ ఆవిర్భావం నుంచి బిసిలు అండగా ఉంటూ వస్తున్నారన్నారు. వారు కుల వివక్షకు గురికాకుండా ఉండాలని భావించి బిసి రక్షణ చట్టానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. దేశంలో ఎన్నో చట్టాలున్నా బిసిల రక్షణకు చట్టం లేదన్నారు. గత ప్రభుత్వ మధ్య పాలనలో బిసిలు తీవ్ర అన్యాయానికి గురయ్యారన్నారు. మంత్రి నారా లోకేష్ పాదయాత్ర సమయంలో బిసిలు తమ కష్టాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారన్నారు. బిసిలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత అన్న ఎన్టీఆర్ దేనన్నారు. ఆ రిజర్వేషన్లను 27 శాతానికి సిఎం చంద్రబాబునాయుడు పెంచారన్నారు. ప్రభుత్వం మారాక గత ప్రభుత్వంలో బలహీన వర్గాలపై కక్ష కట్టి రిజర్వేషన్లు తగ్గించారని మండిపడ్డారు. న్యాయస్థానాలు చెప్పాయని బిసి రిజర్వేషన్లను తగ్గించేశారని, కాని, పైకోర్టుకు వెళ్లి గత ప్రభుత్వం న్యాయ పోరాటం చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే, రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో డెడికేటెడ్ బిసి కమిషన్ వేశామన్నారు. బిసి రిజర్వేషన్లను 34 శాతానికి పెంచేలా కృషి చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అంతకుముందు మంత్రి సవిత నేతృత్వంలో జరిగిన సమావేశంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ అభిప్రాయాలను తెలియజేశారు. బిసిలను వృత్తులపరంగా, కులాల పరంగా దూషించుకుండా ఉండేలా చట్టం అమలు చేయడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.



బుధవారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కురిసిన భారీ వర్షాలకు జలమయమయిన రోడ్లు

# విశాఖకు కొత్త రూపు

>> స్టిక్స్, షూటింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్ తదితర క్రీడలకు ఈ అకాడమీ వేదికగా నిలుస్తుందని తెలిపారు. అత్యుత్తమ శిక్షణ, మౌలిక సదుపాయాలతో యువ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేలా స్పోర్ట్స్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు.ఆంధ్రప్రదేశ్‌ను గొప్ప క్రీడాకారులను తయారు చేసే రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రతి చిన్నారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడం ప్రభుత్వంతో పాటు తల్లిదండ్రులు, పాఠశాలల బాధ్యత అని అన్నారు. పిల్లలను క్రీడల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. క్రీడలు కేవలం పతకాలు సాధించడానికే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, ఓటమిని అధిగమించే ధైర్యాన్ని పెంపొందిస్తాయని లోకేష్ పేర్కొన్నారు. ప్రతి చిన్నారి తప్పనిసరిగా ఒక క్రీడలో పాల్గొనాలని సూచించారు.ఆంధ్రప్రదేశ్ క్రీడా రంగానికి సంబంధించిన ప్రభుత్వ విజన్‌ను సాకారం చేయడంలో పివి సింధు సహకారం ఎంతో అవసరమని మంత్రి అన్నారు. ముఖ్యంగా బాలికలు, మహిళలు క్రీడల్లో రాణించేలా అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.రాష్ట్ర క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, మౌలిక సదుపాయాలు, ఇతర సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రతిభ ఉన్న ఏ చిన్నారి కూడా అవకాశాలు లేక క్రీడలకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. 'ఈ రోజు మనం కేవలం ఒక క్రీడా అకాడమీకి శంకుస్థాపన చేయలేదు.. భారతదేశ భావి ఛాంపియన్లకు బలమైన పునాది వేశాం' అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. భవిష్యత్తులో దేశం నలుమూలల నుంచి యువ క్రీడాకారులు విశాఖకు వచ్చి శిక్షణ పొందేలా పివి సింధు స్పోర్ట్స్ అకాడమీని అంతర్జాతీయ స్థాయి క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

# చంపినా సరే.. ప్రజలమధ్యే ఉంటా

>> ఉద్యమాన్ని హింసాత్మకంగా మార్చి, ఎన్నికైన ప్రభుత్వాన్ని గద్దె దించారని ఆరోపించారు.2024 అల్లర్ల సమయంలో 450కి పైగా పోలీస్ స్టేషన్లకు నిప్పు పెట్టారని, ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు చేశారని, పలువురు పోలీస్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఆమె ఆరోపించారు. తన ప్రసంగంలో 1975లో తన కుటుంబ సభ్యుల హత్యను గుర్తు చేసుకుంటూ హాసీనా భావోద్వేగానికి గురయ్యారు. తన తండ్రి షేక్ ముజిబుర్ రెహ్మాన్‌తో పాటు 1971విమోచన పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు నివాళలర్పించారు. ఇప్పుడున్న బంగ్లాదేశ్ తాము సృష్టించింది కాదని, గత రెండేళ్లుగా బంగ్లాదేశ్‌లో కష్టాలు పెరిగాయని అన్నారు. తాను దేశానికి దూరంగా ఉన్నా, ప్రజలకు ఎన్నడూ దూరంగా లేనని, తన కుటుంబం బంగ్లాదేశ్ కోసం పోరాడిందని చెప్పారు. మహ్మద్ యూనస్ పోలీసుల్ని చంపిన హంతకులకు క్షమాభిక్ష ప్రసాదించారని చెప్పారు. షేక్ హాసీనా రెండేళ్ల తర్వాత తొలిసారి మౌనం వీడి బహిరంగంగా మాట్లాడారు. 2024 ఆగస్టు 5న బంగ్లాదేశ్ విడిచి భారత్ వచ్చిన ఆమె న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ ప్రసంగం సందర్భంగా ఆమె చాలా సార్లు కన్నీరు పెట్టుకున్నారు. షేక్ హాసీనా తర్వాత పాలనాధికారం చేపట్టిన తాత్కాలిక పాలకుడు మహ్మద్ యూనస్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తన ప్రభుత్వాన్ని కూల్చేందుకు ముందే పక్కా ప్రణాళికను రూపొందించినట్లు ఆరోపించారు. ఈ కుట్ర నిజాన్ని మహ్మద్ యూనసే స్వయంగా బయటపెట్టారని అన్నారు. ఎన్నికైన తన ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు వ్యవస్థీకృత రాజకీయ వర్గాలు పనిచేశాయని ఆరోపించారు. చివరకు ఈ ఉద్యమం తనను పదవి నుంచి తొలగించాలనే ఏకైకలక్ష్యంతో కొనసాగిందని పేర్కొన్నారు. విద్యార్థిఉద్యమాన్ని అడ్డంగా పెట్టుకుని బ్యాలెట్‌కు వెలుపల అధికారాన్ని చేజిక్కించుకోవాలనే ప్రయత్నం జరిగిందని విమర్శించారు. ఏ రాజకీయ పార్టీ లేదా సంస్థ పేరును ప్రస్తావించకపోయినా, దుష్ప్రచారంవల్లే పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయని వ్యాఖ్యానించారు. సంక్షోభం మొత్తం కాలంలో తమ ప్రభుత్వం చర్చలకే ప్రాధాన్యత ఇచ్చిందని, ఉద్యమం చాలా ముందుగానే రాజకీయ ప్రయోజనాల కోసం దారి మళ్లించబడిందని ఆమె పునరుద్ఘాటిం చారు. నన్ను జైలుకు పంపవచ్చు.. చంపేయవచ్చుకూడా. అయినప్పటికీ నా ప్రజల మధ్యకే తిరిగి వస్తాను. వారితో కలిసి ఉంటానని హాసీనా భావోద్వేగంగా అన్నారు.దేశ ప్రజలు తీవ్ర కష్టాలు అనుభవిస్తు న్నారని, వారి బాధను ఇకపై చూస్తూ ఉండలేనని చెబుతూ తాను స్వదేశానికి తిరిగి వెళ్లాలని నిర్ణయించు కున్నానని వెల్లడించారు. డిసెంబర్ మా విజయమాసం. అందుకే డిసెంబర్‌లోనే బంగ్లాదేశ్‌కు తిరిగి రావాలని అనుకుంటున్నాను. ఆ ప్రయాణంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

# ఎమ్మెల్సీ అనంత బాబు బెయిల్ పిటిషన్ రద్దు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5,ప్రభాతవార్త:** కారు డ్రైవర్ దళితుడు సుబ్రహ్మణ్యం హత్య సంఘటనలో ప్రభావితం చేసి ప్రలోభాలకు గురిచేసిన కేసులో వైఎస్ఆర్సిపి ఎమ్మెల్సీ అనంత బాబు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునేద్ అహ్మద్ మోలానా కొట్టి వేశారు. ఈ కేసులో బెయిల్ కోరుతూ వేసిన పిటిషన్‌పై బుధవారం కోర్టులో విచారణ జరిగింది. వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో ముద్దాయిగా ఉన్నటువంటి అనంత బాబు సాక్షులను బెదిరించి సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిల్ నిబంధనలు ఉల్లంఘించారని హత్య కేసులో బెయిల్ రద్దు చేయడం జరిగింది. హత్య కేసులో సాక్షులను నిర్బంధించి బెదిరించి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు బలవంతంగా ప్రోలోభపెట్టి తమకు అనుకూలంగా సుబ్రహ్మణ్యం హత్య కేసులో చెప్పాలని బెదిరించిన కేసులో నలుగురు సాక్షుల నుంచి సుమారు నాలుగు లక్షల రూపాయలు పోలీస్ వారికి స్వాధీనం చేయడం జరిగినది. అలాగే నాలుగో ముద్దాయిగా ఉన్న వ్యక్తి వద్దనుంచి పాతికవేల రూపాయలు ఒప్పుదల స్టేట్మెంట్ ద్వారా స్వాధీనం చేసుకోవడం అయినది. ప్రభావితం చేసి ప్రలోభాలకు గురి చేశారని సర్పవరం పోలీసులు పెట్టిన కేసులో ప్రథమ ముద్దాయిగా ఉన్నటువంటి అనంత బాబు రెండోసారి జిల్లా న్యాయమూర్తి కోర్టులో వేసుకున్న బెయిల్ కూడా డిస్మిస్ చేస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలు ఇవ్వడం జరిగినది. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాల సుబ్బారావు వాదించారు.

### గుంటూరు, విజయవాడతో కలిపి

# అమరావతి మెగా సిటీ

## కృష్ణానదిపై వంతెనల కోసం అధ్యయన కమిటీ

### సిఆర్‌డిఎ అథారిటీలో నిర్ణయం

**విజయవాడ.ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** గుంటూరు, విజయవాడతో కలిపి అమరావతి మెగా సిటీని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు సిఆర్డిఏ అథారిటీ ప్రాథమిక ఆమోదం తెలిపినట్లు సమాచారం. దీనిలో భాగంగానే అమరావతి విజయవాడను కలిపేందుకు వీలుగా కృష్ణానదిపై మరిన్ని వంతెనలు నిర్మించేందుకు అవసరమైన నివేదిక తయారు చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది.అమరావతి - విజయవాడ మధ్య ఎన్ని వంతెలను నిర్మించాలనే అంశాన్ని వీలైనంత త్వరగా అధ్యయనం చేయనున్నారు అమరావతి ఐ టెండర్ పిలిచేందుకు అథారిటీ అనుమతిచ్చిందని, టోటల్ క్యాపిటల్ సీటి 217 కిలో మీటర్లుకు 4 ఎస్ టీ పీలు వస్తాయని చెబుతున్నారు.అమరావతి మెగా సిటి అయితే కోటి జనాభా టార్గెట్ పెట్టుకున్నామని ఇప్పటికే సిఆర్‌డిఎ నిర్ణయాలను ఉటంకిస్తూ మంత్రి నారాయణ వెల్లడించారు.దీనికి వీలుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతోపాటు కేంద్రీయ విద్యాలయం భూ కేటాయింపులకు సంబంధించి రిజిస్ట్రేషన్ స్టాంపుడ్యూటీ ఫీజును మినహాయించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు.

# సాయికృష్ణ కేసులో ముగిసిన సిఐ నాగరాజు సిట్ కస్టడీ

**విజయవాడ.ఆగస్టు 5, ప్రభాతవార్తప్రతినిధి:** లాకప్‌డెత్ మృతుడు గాదె సాయికృష్ణ కేసులో సీఐ నాగరాజును సిట్ ఏడో రోజు బుధవారం విచారించింది.అయితే సీఐ నాగరాజు వారం రోజుల కస్టడీ నేటితోముగిసింది. విచారణ అనంతరం మధ్యాహ్నం విజయవాడ కోర్టులో హాజరు పరిచారు. ఎసీబీ కోర్టు ఆదేశాల మేరకు నాగరాజును సిట్ రాజమహేంద్రవరం కారాగారానికి తరలించనున్నది.వారం రోజుల విచారణలో సీఐ నాగరాజు దాదాపు సిట్‌కు సహకరించలేదంటున్నారు.


అయితే లాకప్‌డెత్ గోప్యతపై కీలక సమాచారాన్ని సిట్‌కు అందించారని సమాచారం,ఇక ఈ కేసులో కానిస్టేబుళ్లు అశోక్, నాని, బాబూరావు, సాంబయ్యను నేటి నుంచి సిట్ కస్టడీకి తీసుకోనున్నారు. నేటినుంచి 5 రోజుల పాటు నలుగురిని కస్టడీకి తీసుకోనుంది. సాయికృష్ణ కేసులో సీఐ నాగరాజు ఇప్పటివరకు ఎలాంటి సమాధానాలు ఇవ్వనట్లు తెలుస్తుంది.

# తెలుగు జాతి ఆత్మగౌరవానికి చిరునామా 'అమరావతి'

**• హోంమంత్రి వంగలపూడి అనిత • అమరావతి నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు**

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవానికి ప్రతీకగా అమరావతి ఆవిర్భవించిందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తోందన్నారు. బుధవారం రాష్ట్ర మంత్రులు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి హోంమంత్రి అమరావతి రాజధాని నిర్మాణ ప్రాంతాలను విస్తృతంగా పరిశీలించారు. మంత్రుల నివాస సముదాయాలు, ఎమ్మెల్యేలు- ఎమ్మెల్సీల నివాసాలు, సచివాలయ సముదాయం, హెచ్‌వోడీ ఐకానిక్ టవర్లు, ప్రధాన రహదారుల నిర్మాణ పనులు, ఇతర కీలక ప్రాజెక్టులను సందర్శించి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హోంమంత్రి మీడియాతో మాట్లాడుతూ, అమరావతి అంటే కేవలం రాజధాని కాదు, అది ప్రతి తెలుగు వ్యక్తి ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత శాసనసభలో అమరావతిని రాజధానిగా ఏకగ్రీవంగా ఆమోదించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఆ సమయంలో మద్దతు తెలిపిన వారే తర్వాత అధికారంలోకి వచ్చి

అమరావతి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రులు వంగలపూడి అనిత, పి.నారాయణ, కొండపల్లి శ్రీనివాస్



రాజధాని నిర్మాణాన్ని నిలిపివేసి రాష్ట్ర అభివృద్ధిని ఐదేళ్లు వెనక్కి నెట్టారని విమర్శించారు. ప్రజలు 2024లో ఎన్డీయే కూటమిపై విశ్వాసం ఉంచి ఇచ్చిన స్పష్టమైన తీర్పుతో అమరావతి నిర్మాణం మళ్లీ వేగం పుంజుకుందని తెలిపారు. మంత్రి నారాయణ నాయకత్వంలో రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, ప్రతి నిర్మాణంలో నాణ్యత, ప్రణాళిక, వేగం స్పష్టంగా కనిపిస్తున్నాయని కొనియాడారు. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయం, హెచ్‌వోడీ టవర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల నివాస సముదాయాలు ఒకే పరిపాలనా కేంద్రంలో నిర్మితమవుతున్నాయని, ఇది దేశానికే ఆదర్శంగా నిలిచే రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దుతుందని పేర్కొన్నారు. నిర్మాణంలో నిమగ్నమైన ప్రతి కార్మికుడు. నిర్మాణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇంజినీర్లు, కార్మికులు అమరావతితో భావోద్వేగ అనుబంధం పెంచుకొని పనిచేస్తున్నారని తెలిపారు. 2014లో ప్రారంభించిన నిర్మాణాలను మళ్లీ కొనసాగించడం సంతోషంగా ఉందని పలువురు ఇంజినీర్లు చెప్పడం అమరావతిపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు.

**అమరావతే మా సంకల్పం:** అమరావతిని విమర్శించే వారు ఒకసారి స్వయంగా వచ్చి జరుగుతున్న అభివృద్ధిని పరిశీలించాలని హోంమంత్రి సూచించారు. 'అభివృద్ధి మా సమాధానం... అమరావతి మా సంకల్పం... ప్రజల విశ్వాసమే మా బలం' అని ఆమె స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణ పనులు నిరాటంకంగా కొనసాగేందుకు శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా చర్యలకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అమరావతి నిర్మాణాన్ని అడ్డుకునే ఎలాంటి అరాచకాలు, విధ్వంసక చర్యలను ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు. 2028 నాటికి అమరావతి తొలి దశ నిర్మాణాలను పూర్తి చేసి, ప్రపంచం గర్వించే రాజధానిగా, ప్రతి తెలుగు వ్యక్తి గర్వించే నగరంగా అమరావతిని నిలబెట్టడం ప్రభుత్వ లక్ష్యమని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.

## అక్టోబర్‌లో నోటిఫికేషన్.. డిసెంబర్‌లో పరీక్షలు

### డిఎస్సీపై మంత్రి నారా లోకేశ్ స్పష్టీకరణ



**• టెట్ ప్రారంభం, అభ్యర్థులకు మంత్రి శుభాకాంక్షలు**

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రారంభ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న టెట్ పరీక్షలను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఇచ్చిన హామీ ప్రకారమే జాబ్ క్యాలెండర్ షెడ్యూల్ మేరకు తదుపరి డిఎస్సీ ప్రక్రియను కూడా పూర్తి చేస్తామని లోకేశ్ స్పష్టం చేశారు. అక్టోబర్‌లో డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఇప్పటికే 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డిఎస్సీని విజయవంతంగా పూర్తి చేసిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల జీతాల, డైట్ చార్జీల కోసం రూ.137.98 కోట్లు విడుదల


**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** సమగ్ర శిక్ష పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందితో పాటు వివిధ కేడర్ల సిబ్బంది, ఉపాధ్యాయుల జూన్, జులై నెలల వేతనాలతో పాటు డైట్ చార్జీల చెల్లింపుల కోసం రూ.137.98 కోట్లు నిధులను విడుదల చేసినట్లు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ బి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల విడుదల ప్రక్రియ పూర్తవ్వడంతో, రెండు నెలల బకాయి వేతనాలు, సంబంధిత అలవెన్సుల మొత్తం విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈ నిధులను వెంటనే ఉద్యోగుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని సిబ్బందికి సూచించారు.

## ఎపిఎన్ఆర్‌టి 292 కోఆర్డినేటర్ల నియామకం

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ఎన్ఆర్‌టి రెండో విడత జాబితాలో కోఆర్డినేటర్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. రెండో విడతలో 292 మందిని కోఆర్డినేటర్లుగా నియమించింది. ప్రవాసాంధ్రుల అభ్యున్నతికి సంక్షేమం కోసం ఈ నియామకాలు చేపట్టినట్లు ఎపి ఎన్ఆర్‌టి ప్రకటించింది. భారత ఎంబసీలు, స్థానిక ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ స్వచ్ఛంద సేవలు అందించేందుకు కోఆర్డినేటర్లు సహకరిస్తారని తెలిపింది. కొత్తగా కోఆర్డినేటర్లుగా నియమితులైన వారికి ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎపి ఎన్ఆర్‌టి సొసైటీ ప్రెసిడెంట్ వేమూరి రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు.

# చట్టం ముందు అందరూ సమానులే

**• జగన్ కేసుల్లో 13 ఏళ్ల జాప్యం దేనికి? • సత్వర న్యాయంపై రాజ్యసభలో ఎంపి చింతకాయల విజయ్**



**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజ్యసభలో ప్రతిపాదించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల (సవరణ) బిల్లు 2026కు తెలుగుదేశం పార్టీ తరపున ఎంపి చింతకాయల విజయ్ పరిపూర్ణ మద్దతు ప్రకటించారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 33 నుండి 37కు పెంచడం సకాలంలో తీసుకున్న అభినందనీయమైన నిర్ణయమని పేర్కొన్నారు. సత్వర న్యాయం అందించే దిశగా ఈకోర్టులు, ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని, అమరావతిలో జ్యుడీషియల్ మౌలిక వసతుల కల్పనకు విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌ను ఆయన సభలో ప్రముఖంగా ప్రశంసించారు. చట్టం ముందు సామాన్యులైనా, అత్యంత బలవంతులైనా సమానులేనని, న్యాయం ఆలస్యం అవ్వడం అంటే న్యాయం నిరాకరించబడటమేనని ఎంపి విజయ్ స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో ఎపి మాజీ సిఎం వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులను ఆయన రాజ్యసభలో విజయ్ తన ఉద్వేగభరిత ప్రసంగంలో ప్రస్తావించారు. జగన్‌పై 2013లో నమోదైన సిబిఐ, ఇడి కేసులు 13 ఏళ్లు గడుస్తున్నా విచారణ ముందుకు సాగాలేదు అని అన్నారు. డిశ్చార్జ్ పిటిషన్లు, న్యాయమూర్తుల బదిలీల సాకుతో ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సకాలంలో విచారణ జరగాలని, ఇలాంటి సుదీర్ఘ జాప్యాల వల్ల న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుందని ఆయన కుండబద్దలు కొట్టారు. భారత జనాభా 150 కోట్లకు చేరుకున్న ప్రస్తుత తరుణంలో, సామాన్యులకు సైతం వేగంగా, పారదర్శకంగా న్యాయం అందాలన్నదే తమ ఆకాంక్ష అని ఎంపి తెలిపారు. వ్యవస్థపై ప్రజలకు పూర్తి భరోసా కలగాలంటే కేవలం అత్యున్నత న్యాయస్థానంతో పాటు హైకోర్టులు, కింది స్థాయి కోర్టులు, ముఖ్యంగా ప్రత్యేక సిబిఐ కోర్టులను సైతం ఏకకాలంలో బలోపేతం చేసి తీర్పులు వేగవంతం చేయాలని ఎంపి విజయ్ డిమాండ్ చేశారు.

## 8నుండి విజయవాడ- వాడపల్లి టూర్ ప్యాకేజీ

### - ఎపిటిడిసి జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఎపిటిడిసి) ఆధ్వర్యంలో ఈనెల8 (శనివారం) నుండి విజయవాడలోని సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ కేంద్రంగా ఒక రోజు 'విజయవాడ - వాడపల్లి టూర్ ప్యాకేజీ'ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఎపిటిడిసి జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు, పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అత్యంత సౌకర్యవంతమైన రవాణా, ఆహార వసతులతో ప్రణాళికాబద్ధమైన తీర్థయాత్ర అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా ఈ ప్యాకేజీని రూపకల్పన చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ టూర్ ప్యాకేజీ ఆగస్టు 8న ఉదయం 4:00 గంటలకు విజయవాడలోని సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ వద్ద ప్రారంభమై, తిరిగి సాయంత్రం 7:00 గంటలకు విజయవాడ చేరుకుంటుందన్నారు. ప్యాకేజీ ధర పెద్దలకు రూ.1,160, పిల్లలకు రూ.1,000గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ రుసుములో సౌకర్యవంతమైన బస్సు రవాణా ఛార్జీలతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజన వసతి కలిగి ఉంటాయని, అయితే ఆలయ దర్శనం టికెట్ ఛార్జీలను పర్యాటకులే స్వయంగా భరించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక యాత్రను సద్వినియోగం చేసుకోవాలనుకునే భక్తులు, పర్యాటకులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో గానీ, లేదా విజయవాడ బందర్ రోడ్, లెమన్ ట్రీ హోటల్ పక్కన ఉన్న సెంట్రల్ రిజర్వేషన్ ఆఫీస్ వద్ద నేరుగా సంప్రదించి తమ సీట్లను ముందుగానే బుక్ చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ లిమిటెడ్ జనరల్ మేనేజర్ టిఎస్‌వి నారాయణ ఆ ప్రకటనలో తెలిపారు.

# గోదావరిలో ఏ ఘాట్‌లో స్నానం చేసినా పుణ్యం వస్తుందనే విశ్వాసం భక్తుల్లో కల్పించాలి

**• స్నాన ఘట్టాలవారి భక్తుల రద్దీ నిర్వహణకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయండి • పుష్కరాల విశిష్టను తెలియజేయాలి**

**• మఠాధిపతులు, పీఠాధిపతులు, ప్రముఖ ప్రవచనకర్తల సూచనలు సలహాలు తీసుకోండి • ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్**



**సచివాలయం, ఆగస్టు 5 ప్రభాతవార్త:** రానున్న గోదావరి పుష్కరాల సమయంలో గోదావరి నది వెంబడి ఏస్నాన ఘట్టంలో పుష్కరస్నానం ఆచరించినా పుణ్యం లభిస్తుందనే విశ్వాసాన్ని భక్తుల్లో కల్పించేందుకు ఇప్పటి నుండే తగిన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అధికారులను అదేశించారు. గోదావరి పుష్కరాలు 2027పై బుధవారం సచివాలయంలో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాల విశిష్టతను ఏవిధంగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలనే దానిపై ఇప్పటి నుండి ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా 'స్నానం-దానం-పితృతర్పణం' వంటి నినాదంతో గోదావరి పుష్కరాల్లో రాష్ట్ర,దేశ విదేశీ భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పుష్కర పుణ్యస్నానాలు ఆచరించే విధంగా తగిన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వివిధ మఠాధిపతులు, పీఠాధిపతులు, ఇతర ప్రముఖ స్వామీజీలు, ప్రముఖ ప్రవచన కర్తలను స్వయంగా కలిసి వారి సూచనలు, సలహాలను తీసుకొని పుష్కరాల సమర్థ నిర్వహణతో పాటు విజయవంతానికి తగిన ప్రణాళికలను సిద్ధం చేసి, ఆసూచనలను పుష్కరాల కమ్యూనికేషన్ ప్లాన్‌లో పొందు పర్చాలని సిఎస్ చెప్పారు. పలానా స్నాన ఘట్టంలో స్నానం ఆచరిస్తేనే పుణ్యం వస్తుందనే అపోహను ప్రజల్లో తొలగించాలని సూచించారు. భక్తుల రద్దీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యంగా రైలు, రోడ్డు మార్గాల్లో లక్షల్లో తరలివచ్చే భక్తులను ఏవిధంగా క్రమబద్ధీకరించాలనే కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని సిఎస్ అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి జి.వీరపాండ్యన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ గత పుష్కరాలకు సుమారు 4కోట్ల 80లక్షల మంది భక్తులు రాగా వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలకు ఆసంఖ్య రెట్టింపు కానుందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. గోదావరి పుష్కరాలకు సంబంధించి పోలవరం, ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి కాకినాడ, బిఆర్ అంబేద్కర్ కోనసీమ 6జిల్లాల్లో 3వేల 161కోట్ల రూ.ల అంచనాలతో 21శాఖల ద్వారా 4వేల 695వివిధ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.60కోట్ల పనులు మొదలయ్యాయని చెప్పారు. ప్రతి 15రోజులకు ఒకసారి అధికారులు అందరితో సమీక్ష నిర్వహించడం జరుగుతుందని వివరించారు.

సమావేశంలో రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పిఆర్ అండ్ ఆర్డి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే, ఆర్థికశాఖ కార్యదర్శి రోనాల్డ్ రోజ్, పౌర సరఫరాల శాఖ కమీషనర్ కె.కన్నబాబు, ఐ అండ్ డిఆర్ డైరెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, ఏపి మారిటైం బోర్డు సిఈవో ప్రవీణ్ ఆదిత్య, దేవాదాయ శాఖ కమీషనర్ రామచంద్ర మోహన్, పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండి పద్మావతి తదితర అధికారులు పాల్గొన్నారు. అదేవిదంగా సమావేశానికి వర్చువల్‌గా హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్, ఎంఎయూడి ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, పోలవరం, ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ, బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఏలూరు రేంజ్ ఐజిలు అశోక్‌కుమార్, ఐజి రవిప్రకాశ్, ఇంకా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తక్కువ ఫీజుతో 'జర్నలిజంలో డిప్లొమా'

### సిఆర్ మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్‌కుమార్

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** అతి తక్కువ ఫీజుతో 'జర్నలిజంలో డిప్లొమా కోర్సు' చేసే మంచి అవకాశాన్ని సి.ఆర్. మీడియా అకాడమీ అందిస్తోందని ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సు ప్రత్యేకంగా వర్కింగ్ జర్నలిస్టులకోసం ఉద్దేశించినదైనా, జర్నలిజం వృత్తిలో అభిరుచి కలిగిన డిగ్రీ ఉత్తీర్ణులైన సాధారణ అభ్యర్థులు కూడా ఈ డిప్లమా కోర్సుకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పే లక్ష్యాలకు అనుగుణంగా ఈ కోర్సును రూపొందించామన్నారు. జర్నలిస్టులకు వృత్తిపరమైన విద్యార్హత ఉంటే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ఈ కోర్సు కాల వ్యవధి 6 నెలలని ఆయన తెలిపారు. ఎంపిక చేసిన రిటైర్డ్ అధ్యాపకులు, సీనియర్ జర్నలిస్టులచే క్లాసులు నిర్వహిస్తామన్నారు. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు నాగార్జున యూనివర్సిటీ డిప్లొమా సర్టిఫికెట్ జారీ చేస్తుందన్నారు. వర్కింగ్ జర్నలిస్టులు డౌన్ లోడ్ చేసుకున్న దరఖాస్తులో తమ వివరాలు నింపి ఇంటర్ మీడియట్ సర్టిఫికెట్, అక్రిడిటేషన్ కార్డు లేదా ఐ.డి.కార్డు లేదా సర్వీసు ధ్రువీకరణ పత్రం జెరాక్స్ కాపీలను సెక్రెటరీ, సి.ఆర్. మీడియా అకాడమీ పేరున తీసిన రూ.2వేలు డిమాండ్ డ్రాఫ్ట్‌ను జతపరచి అప్లికేషనలను పంపుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తులను సెక్రెటరీ, ఆంధ్రప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ, 406/48, 4వ అంతస్తు, రెవెన్యూ కాలనీ, మొగల్రాజపురం, విజయవాడ. 520 010కు పంపాలని సూచించారు. దరఖాస్తులు పంపేందుకు చివరి తేదీ ఆగస్టు 20 అని ఆయన తెలిపారు. సెప్టెంబర్ మొదటివారం నుంచి క్లాసులు ప్రారంభమౌతాయన్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై ముఖ్య కార్యదర్శి శ్యామలరావు సమీక్ష



**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై జి.ఎ.డి ముఖ్య కార్యదర్శి జె. శ్యామల రావు బుధవారం సమీక్షించారు. పెరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న ఏర్పాట్లను సి.ఆర్.డి.ఏ కమిషనర్ విజయరామ రాజు, జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ, సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్.విశ్వనాథన్, పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్లు ఏ.భార్గవ తేజ, కొల్లాబత్తుల కార్తీక్, అభిషేక్‌లతో కలసి పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, న్యాయాధికారులు, అధికారులు వచ్చే మార్గాలను, స్థలాలను పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ ఆహ్వానాల ముద్రణ, పంపిణీపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పెరేడ్ ఏర్పాట్లు పక్కా ఉండాలని అన్నారు. వేల సంఖ్యలో సాధారణ ప్రజానీకం హాజరు అయ్యే అవకాశాలు ఉంటాయని, అందుకు తగిన విధంగా కూర్చునే ప్రదేశాలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు దృష్టిలో పెట్టుకోవాలని చెప్పారు. పార్కింగ్ ప్రదేశం, వాహనాల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ ప్లాన్ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలు తమ ప్రగతిని ప్రదర్శించే శకటాలు తయారీ పూర్తి చేయాలని, 13వ తేదీన జరిగే తుది రిహార్సల్స్‌లో ప్రదర్శన చూపాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఐ.కిషోర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్‌లు సి.హెచ్.రమేష్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగసాయికుమార్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబి వలలో లోపెంట విఆర్ఒ

**శ్రీకాకుళం, ఆగస్టు 5 ప్రభాతవార్త:** అవినీతి నిరోధక శాఖ అధికారుల వలకు మరో ఉద్యోగి చిక్కాడు. లావేరు మండలం లోపెంట సచివాలయంలో విఆర్ఒ ఏ.మల్లేశ్వరరావు రైతు నుంచి నగదు తీసుకుంటుండగా బుధవారం ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లోపెంట పరిధిలోని సహపురంలో చేపడుతున్న రీసర్వే కోసం రైతు నుంచి డబ్బులు డిమాండ్ చేయడంతో బాధిత రైతు ఎసిబి అధికారులను ఆశ్రయించినట్టు తెలిసింది. ఎసిబి అధికారుల సూచనతో విఆర్ఒ మల్లేశ్వరరావు బాధిత రైతు నుంచి నగదు తీసుకుంటుండగా ఎసిబి అధికారులకు చిక్కాడు. రణస్థలం కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం పునరావాసంలోనూ అవినీతికి పాల్పడినట్లు మల్లేశ్వరరావుపై అనేక అభియోగాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎసిబి తనిఖీలు ఎంత మొత్తం తీసుకున్నాడన్న వివరాలు తెలియాల్సి ఉంది. లోపెంట సచివాలయంలో ఎసిబి అధికారులు తనిఖీలు నిర్వహించి ఉద్యోగులందరినీ విచారిస్తున్నారు. దాడుల వివరాలను ఎసిబి ఉన్నతాధికారులు వెల్లడిస్తారని రైడ్‌లో పాల్గొన్న అధికారులు స్పష్టం చేశారు. తనిఖీల్లో ఎసిబి డిఎస్‌పితో పాటు సిఐలు ఎస్‌వి రమణ, భాస్కరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థినులతో మసాజ్.. ఇద్దరు సస్పెన్షన్

### నంబులపూలకుంట కెజిబివి టీచర్, ప్రిన్సిపల్‌పై వేటు

**అనంతపురం(క్రైమ్) ఆగస్టు 5 ప్రభాతవార్త:** శ్రీసత్యసాయి జిల్లా నంబుల పూలకుంట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులతో మసాజ్ చేయించుకున్న ఘటన తీవ్ర కలకలం రేపిన నేపథ్యంలో బాధ్యులైన హిందీ టీచర్ రూపారాణి, విధుల్లో నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపల్ రెహానాలను ఉద్యోగం నుంచి తొలగిస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నంబులపూలకుంట కెజిబివి పాఠశాలలో హిందీ టీచర్‌గా పని చేస్తున్న రూపారాణి, విద్యార్థినులకు పాఠాలు చెప్పాల్సింది పోయి వారిచేత సొంత పనులను చేయించుకోవడం, తలకు కొబ్బరి నూనె రాయించుకోవడం, ఒళ్ళంతా మసాజ్ చేయించుకోవడం, ఒళ్లు నొక్కించుకోవడం వంటి వ్యక్తిగత పనులు చేయించుకునేవారు. ఈ వ్యవహారం గత కొన్నాళ్ళుగా జరుగుతున్నా బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. విద్యార్థినులతో టీచర్ రూపారాణి మసాజ్ చేయించుకుంటున్న దృశ్యాలను పాఠశాలలో ఉన్న కొందరు రహస్యంగా ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ ఫోటోలు నెట్టింట తీవ్రంగా వైరల్ కావడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రత్యేక అధికారుల బృందంతో ప్రాథమిక విచారణకు ఆదేశించారు. పాఠశాలను సందర్శించిన విచారణాధికారులు స్థానిక విద్యార్థినులు, సిబ్బంది నుంచి సమాచారం సేకరించి విచారణ పూర్తి చేశారు. విచారణలో టీచర్ రూపారాణి విద్యార్థులతో అనైతికంగా మసాజ్ చేయించుకున్నట్లు ఆధారాలతో సహా రూఢీ కావడంతో అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రిన్సిపల్ రెహనా విఫలమవ్వడం, ఈ విషయాన్ని దాచిపెట్టే యత్నం చేశారన్న ఆరోపణలతో ఇద్దరినీ విధుల నుంచి తొలగిస్తూ అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు.




# చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరిస్తాం

## వారికి అండగా నిలుస్తాం: బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** బిజెపి ఒబిసి మోర్చా ఆధ్వర్యంలో చేనేత సమ్మేళనం ఏర్పాటు చేశారు. రాఘవయ్య పార్కు నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు ప్రదర్శన నిర్వహించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ వివేకానంద విగ్రహానికి నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. మగ్గం, రాట్నం, చేనేత కులాల రుషుల చిత్రపటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ సందర్భంగా చేనేత కులాల ఐక్యత, సంక్షేమమే చేనేత సమ్మేళనం ప్రధాన లక్ష్యమని మాధవ్ అన్నారు. చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి అండగా నిలుస్తామన్నారు.

చేనేత కుటుంబాలకు స్థిర ఉపాధి, ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, సంప్రదాయ చేనేత కళను పరిరక్షించడం అందరి బాధ్యత అని మాధవ్ అన్నారు. వృత్తికారులకు బిజెపి మాత్రమే పూర్తి న్యాయం చేస్తోందన్నారు. వారి ఉత్పత్తులు మార్కెట్‌లో గిరాకి పెంచుతుందన్నారు.

## విఆర్ఎల పదోన్నతులకు లైన్‌క్లియర్

### నిబంధనల్లో సవరణలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకులకు (విఆర్ఎ) గుడ్ న్యూస్ చెప్పింది. వారు విఆర్ఒగా ప్రమోషన్లు పొందేందుకు వీలుగా నిబంధనల్లో కీలక సవరణలు చేసింది. ఈ మేరకు జీవో కూడా జారీ చేసింది. దీని ప్రకారం విఆర్ఎలు గ్రేడ్-2 విఆర్ఒలుగా ప్రమోషన్ పొందేందుకు అవసరమైన డిగ్రీ అర్హత సంపాదించేందుకు షరతులతో అనుమతి మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపింది. రాష్ట్రంలో విఆర్ఎలకు విఆర్ఒలుగా ప్రమోషన్లు పొందేందుకు ఉన్న నిబంధనల్ని సడలిస్తూ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సర్వీస్ రూల్స్, 2008లో సవరణలు చేసింది. ఈ సవరణల ప్రకారం 2023 మార్చి 10న జారీ చేసిన జి.ఓ.ఎం.ఎస్. నెం.104కు ముందు నియమితులైన విఆర్ఎలు ప్రస్తుతం డిగ్రీ అర్హత లేకపోయినా షరతులతో విఆర్ఒ గ్రేడ్-2గా నియామకం పొందేందుకు అర్హులు అవుతారు. అయితే వారికి ఓ కీలక షరతు పెట్టింది. ఈ జీవో అమల్లోకి వచ్చిన తేదీ నుంచి ఐదేళ్లలోపు వారు తప్పనిసరిగా డిగ్రీ పూర్తి చేయాలి. నిర్ణీత గడువులో డిగ్రీ అర్హతను సాధించలేకపోతే, వారిని తిరిగి విఆర్ఎ పోస్టుకే తిరిగి పంపిస్తారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ పతిపాదనల ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం సర్వీసులో ఉన్న ఇంటర్మీడియట్ అర్హతతో పనిచేస్తున్న విఆర్ఎలకు పదోన్నతి అవకాశాన్ని కల్పించడంతో పాటు, ఉన్నత విద్యను పూర్తి చేసుకునేందుకు సమయం ఇవ్వడమే ఈ సవరణ ఉద్దేశమని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. ఈ సవరణతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విఆర్ఎలకు విఆర్ఒ గ్రేడ్-2 పోస్టుకు ప్రమోట్ అయ్యేందుకు మార్గం సుగమం కానుంది. అయితే, ఐదేళ్లలోపు డిగ్రీ పూర్తి చేయడం తప్పనిసరి అని ప్రభుత్వం స్పష్టం చేసింది.

వార్త

ఆరోగ్యం, మంచి శరీరం బంగారం కంటే మించినవి. మంచి మనసు అంతులేని సంపద కంటే విలువైనది.

- ఎమర్సన్

# వలసలకేదీ దారి?


చరిత్రలో వలసలు, వలస రాజ్యాల ఊసులు మనకు కొత్తమీ కాదు. కానీ ఆధునిక ప్రపంచంలో కూడా ఎందరో తామున్న చోట దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించలేక హుటాహుటిన మరో ప్రాంతానికి తరలివెళ్లడమే విచిత్రం. నాలుగు రోజుల నాడు మొరాకో నుంచి స్పెయిన్‌లోకి దాదాపు అరవై వేల మంది శరణార్థులు వలస వచ్చారు. ఒక్కొక్కరుగా వస్తే తెలిసేది కాదు. ఒకేసారి మిడతల దండులా స్పెయిన్ మీద పడటమే వారిని ఇబ్బందులపాల్జేసింది. ఇదే ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వాళ్ల ఎలాంటి పరిస్థితుల్లో వచ్చారో ఆలోచించడం మానిస్పెయిన్ పాలకులు అవాక్కయ్యారు. అంతేకాదు ఏమిచేయాలోపాలుపోని పరిస్థితులలో స్పెయిన్ దళాలు కాల్పులు కూడా జరిపాయి. ఈ హఠాత్పరిణామానికి హతాశులై అటు ఇటూ పరుగెట్టిన వలసదారులు 72 మంది మరణించారని అంచనా. అలా వెళ్లిన వారిలో సుమారు 45 వేల మందికి పైగా మొరాకోవాసులు తిరిగిస్పెయిన్‌కు వెళ్లిపోయారు. ఇలా వలసల ధాటికి యూరప్ ఎంతో ఆందోళన చెందుతోంది. ఈ విషయమై యూరోపియన్ యూనియన్ స్పెయిన్‌లోని సెయూటాగరంలోకి చొరబడిన మొరాకో వాసుల సంఖ్యను బట్టి చూస్తే ఆ నగర జనాభాలో దాదాపు 70 శాతం మంది ఉన్నారు. వారందరినీ స్పెయిన్ యువత తీవ్రంగానే అడ్డుకొంది. సముద్రతీరం నుంచి పర్వత ప్రాంతమైన సరిహద్దు దాటి కూడా వాళ్ల వలసవచ్చేశారు. పడవల్లో ఎందరో ప్రయాసతో వచ్చి చేరుకున్నారు. అయినా స్పెయిన్‌లో పరిస్థితులు సానుకూలపడక నరకయాతన అనుభవించారు. సముద్రంలో ఈదుకుంటూ వచ్చిన వారిలో సుమారు 100 మంది మరణించారు. వలసదారుల్ని అదుపు చేయడంలో స్పెయిన్ దళాలు వాటర్ కెనాన్‌లు, బాష్పవాయు ప్రయోగాలు, కొన్ని సందర్భాల్లో కాల్పులకు తెగబడ్డారు. ఈ తొక్కిసలాటలో చనిపోయిన వారెందరో, ప్రాణాలకు తెగించి అయిదు గంటలపాటు సముద్రాన్ని ఈదుకొంటూ వచ్చినా స్పెయిన్ భద్రతా దళాలు ఆటంకపరచడమే కాకుండా సెయూటాలో తమకు ఆశ్రయమే కాదు ఆహారం, నీరు కూడా లభించలేదని కొందరు మొరాకో వాసులు ఆవేదన వెలిబుచ్చిన సందర్భాలు కూడా గోచరించాయి. చెప్పాలంటే మొరాకో వాసులపై ఎన్నో దాష్టీకాలే జరిగాయి. యూరోపియన్ యూనియన్‌కు ఆది నుంచీ వలసదారుల బెడద ఎక్కువగానే ఉంది. ఆఫ్రికా దేశాలతో అస్థిరత, అంతర్యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాల కారణంగా వేలాదిమంది శరణార్థులు, వలసదారులు యూరప్‌వైపు పరుగులు తీస్తున్నారు. దాంతో ఆఫ్రికా శరణార్థులను నీచంగా చూస్తూ యూరప్ దేశాలు తీసుకుంటున్న నిరోధక చర్యలు ఎంతో ఇబ్బందికరంగా పరిణమిస్తున్నాయి. వలసదారుల భారాన్ని గ్రీస్, ఇటలీ, స్పెయిన్ వంటి సరిహద్దు దేశాలుమాత్రమే మోయలేవు కనుక పదేళ్లనాడే దాదాపు యూరోపియన్ దేశాలన్నీ ఒక ప్రణాళికను రూపొందించుకుంది. ఆ మేరకు అన్ని దేశాలు శరణార్థుల్ని నేరుగా స్వాగతించాలి. కానీ చాలా యూరప్ దేశాలు అందుకు భిన్నంగా అనుసరించే వైఖరి వలసదారులకు ప్రాణాంతకమౌతోంది. ఆఫ్రికా దేశాలు ఏమంత సంపన్నదేశాలు కావు. అలాఅని అభివృద్ధి చెందిన దేశాలు కావు. ఆ కారణం చేత అక్కడ జీవన పరిస్థితులు దుర్భరమైనప్పుడు సరిహద్దు దేశాల్లోకి వలసలు వచ్చేస్తున్నారు. సరిహద్దు దేశాలంటే అతిసమీపంలో ఉన్నా ఎంతో శ్రమకోర్చి అక్కడికి చేరుకోవాల్సిందే. గత్యంతరం లేకనే ఈ వలసలు. ఈ 'సాలిడారిటీ' పథకం కింద శరణార్థులను స్వాగతించలేకపోయినట్లయితే వారికి భారీ మొత్తంలోఆర్థిక వితరణ అందించాలి. అవేమీ లేకుండానే తాజా వలసదారులపై స్పెయిన్ కొరడా ఝుళిపించింది. కనీస ఆతిథ్య మర్యాదలలో భాగంగా మంచినీరు కూడా అందించలేకపోయింది. సరిహద్దుల రక్షణ ఎంతముఖ్యమో, శరణార్థుల పట్ల మానవతా దృక్పథం చూపించడమూ అంతే ముఖ్యం. కానీ ఈ రెండు అంశాల మధ్య యూరోపియన్ యూనియన్ నలిగిపోతోంది. మానవ హక్కుల ఉల్లంఘనలో హంగేరి, పోలాండ్ వంటిదేశాలు కూడా స్పెయిన్ వంటి యూరోపియన్ దేశాల చర్యలకు వంత పాడుతున్నాయి. ఈయుకు వెలుపలనున్న మొరాకో వంటి దేశాలతో సత్సంబంధాలుమంచివేనని, అదే సమయంలో స్పెయిన్‌లో అక్రమ ప్రవేశాలను కట్టుదిట్టం చేయడం అవసరమని బుధవారం జరిగిన యూరోపియన్ యూనియన్ దేశాల ఐక్యతా సమావేశం నిర్ణయించింది. ఆయా దేశాల భద్రతా చర్యలతోపాటు వలసదారుల పట్ల మానవ హక్కుల పరిరక్షణకూడా ప్రాధాన్యత నివ్వాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పాయి. ఉత్తర ఆఫ్రికాలోని ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, సామాజిక అసంతృప్తి, ఐరోపా వలస విధానాల పరిమితులపై అవగాహన, ఇరు దేశాల మధ్య ఉండే దౌత్యసంబంధాల సంక్లిష్టతలను మెరుగుపరుచుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. స్వదేశంలో అవకాశాల కొరత, జీవన భద్రతలో సమస్యలు ఏర్పడి నప్పుడే వలసల సమస్య ఏర్పడుతుందని అన్నిదేశాలు గుర్తించదగినది. మొరాకో, స్పెయిన్‌ల మధ్య వలసల సంక్షోభం సరిహద్దుల భద్రతకే కాదు, మానవత్వానికే పరీక్ష అన్న ధోరణిలో శరణార్థుల పట్ల సుహృద్భావ ధోరణితో వ్యవహరించడానికి అన్ని కట్టుబాట్లు సిద్ధం చేసుకునేందుకు యూరోపియన్ యూనియన్ ముందుకొచ్చింది. అనేకమంది యువత మెరుగైన జీవితంకోసం ప్రాణాలను పణంగా పెట్టడమంటే స్వదేశంలో వారికి అవకాశాలకొరత ఎంత బలీయంగా ఉందో తెలుస్తుంది. పైగా వలసల వ్యవహారంలో కొన్ని మానవ అక్రమరవాణా ముఠాలు ప్రేరేపణలపైకన్నేసి ఉంచాలని, ఇప్పటికే తమదేశాల్లో అపరిచితుల్లా ఉండిపోయిన శరణార్థులను బలప్రయోగంలేకుండా తిప్పిపంపడంపై శ్రద్ధవహించే దిశగా ఆయాదేశాలు పయనిస్తున్నాయి. వలసలకుమూల కారణాలను అన్వేషించి పరిష్క రించే సమగ్ర విధానాలే ఈ తరహా సంక్షోభాలకు శాశ్వత పరిష్కారం చూపగలవు.

సలహా ఇచ్చేటప్పుడు విచక్షణ పాటించాలి. స్వీకరించేటప్పుడు వినమ్రంగా ఉండాలి.



స్వామి వివేకానంద

సోమరిలా, బలహీనంగా నూరేళ్లు బతకడం కన్నా, దృఢసంకల్పంతో కొద్ది కాలమైనా జీవించడం ఉత్తమం.



అరిస్టాటిల్

## ప్రజావాక్కు



### అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం

ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో భోగాపురంలో నిర్మితమైన అల్లూరి సీతారామరాజు గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం ఒక కీలక ఘట్టం. రాజకీయాలకుఅతీతంగా ఈవిమానాశ్రయం ఆంధ్రప్రదేశ్‌కు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది వేయనుంది. గిరిజనుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు పేరును ఈ విమానాశ్రయానికి ఇవ్వడం చారిత్రకంగా సముచిత నిర్ణయం. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు ఇదికొత్తఆర్థిక ద్వారంగా మారనుంది. పర్యాటక రంగానికి ఊత మివ్వడంతో పాటు, సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు, ఔషధ పరిశ్రమలు, సమాచార సాంకేతిక రంగం, లాజి స్టిక్స్, గిడ్డంగుల ఏర్పాటు, విమానయాన అనుబంధ పరిశ్రమల విస్తరణకు ఇది విశేష అవకాశాలు కల్పిస్తుంది. ఉద్యోగాలసృష్టితోపాటుపెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధిఅవకాశాలను పెంచేసామర్థ్యంఉంది.

- హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అందరి ప్రాణాలు ఫోన్‌లోనే..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పని చేయుచున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల కోసం, విద్యార్థిని విద్యార్థుల కోసం లీప్ యాప్ ప్రవేశపెట్టింది. అందరి హాజరుతో పాటు, వార్షిక పరీక్షల్లో వచ్చిన మార్కులు, టెస్టులలో వచ్చిన మార్కులు, అసెస్మెంట్ చేసినప్పుడు వచ్చిన మార్కులు, కరికులర్ కోరికులర్ ఎక్స్ట్రా క్యులర్ యాక్టివిటీస్ అన్ని నమోదు చేసే విధంగా హోలిస్టిక్ ప్రెస్ కార్డును కూడా ప్రవేశపెట్టింది. అయితే బైజుస్ కంటెంట్‌కి బదులుగా క్లికర్స్ అనే కంటెంట్‌ని ఉపయోగించమని అధికారులకు సూచించారు. ఇది డేంజర్ యాప్.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### నీటి వృథాను అరికట్టాలి

తెలంగాణ కాంగ్రెసు ప్రభుత్వం తమ ప్రాబల్యంగల ప్రాంతాలను అశాస్త్రీయంగా గ్రేటర్ హైదరాబాద్‌లో కలుపుతూ గ్రేటర్‌పై ఆధిపత్యానికి పాకులాడ్తోందని బిజెపి రాష్ట్ర చీఫ్ అన్నట్లు పత్రికల్లో వచ్చింది. మున్సిపాలిటీలలో అంతటా విలువైన వర్షపునీరే కాక జలమండలిచే శుద్ధి చేయబడిన తాగునీరు పైపుల లీకేజీ ద్వారా రోడ్లపైకి వచ్చి మ్యాన్‌మోల్స్ ద్వారా డ్రైనేజీలో కలిసిపోతున్నాయి. ఈ నీటి వృథాను అరికట్టాలి.

-వి.ఆర్.ఆర్.ఎ.రాజు, హైదరాబాద్

### ఉత్తుత్తి మాటలేనా..

ముఖ్యమంత్రి గారూ తిరుపతిజిల్లా, ప్రకాశం జిల్లాలలో కల్కి, దొంగస్వామీ ప్రభుత్వ భూములు ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసంచేస్తుంటే, రెవెన్యూ అధికారులు దొంగ స్వాములకు సాష్టాంగ పడుతున్నారు. మీరు జోక్యం చేసుకోరా? ప్రభుత్వ భూములాక్రమిస్తే జైలే గతి అన్నారు కదా. ఉత్తుత్తి మాటలేనా? తిరుపతి జిల్లాలో కల్కి దళితుల అసైన్డ్ భూములు, అటవీ భూములు ఆక్రమించి ఆశ్రమం పేరుతో చెక్కభజనలు ,యజ్ఞాలు యాగాలు చేస్తున్నారు. అటవీ భూమిలో విదేశీయులను రప్పించి, అటవీ నిబంధనలకు వ్యతిరేకంగా రాత్రుళ్ళు భజనలు చేస్తున్నారు. కల్కి పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. బాధ్యతారహితంగా రెవెన్యూ యంత్రాగం ఉంది. అదేవిధంగా ప్రకాశం జిల్లాలో దొంగ రామదూత కూడా కోట్లాది రుపాయల చెరువు పోరంబోకు ఆక్రమించి దీక్షలు చేస్తున్నారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ2021లో దొంగస్వామి ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. ఇంత వరకు అతీగతిలేదు. మీరేమో ఆక్రమిస్తే జైలే అంటున్నారు. అధికారులేమో దాసోహం అంటున్నారు. మీరు జోక్యం చేసుకొని ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### కుంటల తవ్వకంతో చేపల పెంపకం

తెలంగాణ ప్రభుత్వం నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచాలనే ఉద్దేశంతో చేపట్టిన జలసిరి కార్యక్రమంలో పంట కుంటలు తవ్వించాలి అని నిర్ణయించారు. ఒక రకంగా ఇది రాజస్థాన్ మోడల్ అయినా తెలంగాణకు సరిపోయే మోడల్ ఇది. ఒక తెలంగాణకు మాత్రమే కాదు భూ పరివేష్టిత రాష్ట్రాలన్నింటికి సరిపోయే మోడల్ ఇది. తెలంగాణలో సగటు కమతం పరిమాణం తక్కువ కాబట్టి 8..8ఫారం పాండ్స్‌ని ఎక్కువ మొత్తంలోచేయాలి. తెలంగాణలో ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 75 వేల చెరువులు నూతన ఆర్థిక విధానాలు అభివృద్ధి పేరుతో కల్లోలం అయినాక మిగిలిన 46531 చెరువులలో పూడికపనులు అయినాక చేపలపెంపకం ఎక్కువ అయింది.

- భారత అవినాష్, జనగామ

### దళితుల భూములను అభివృద్ధి చేయాలి

తెలంగాణ రాష్ట్రంలో అధిక పేద సామాజిక వర్గమైన షెడ్యూల్ కులాల వ్యవసాయ భూములను, బావులను అభివృద్ధి చేయవలసిన అవసరంఉంది. షెడ్యూల్ కులాల కార్పొరేషన్, సోషల్ వెల్ఫేర్, డిపార్టుమెంట్‌ల పర్యవేక్షణలో రాష్ట్ర వార్షిక బడ్జెట్ నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఉచిత వైద్యసేవలే ప్రజలకిచ్చే వరం

*ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా పేషంట్ల మెడికల్ హిస్టరీని ట్రాక్‌చేసే విధానాన్ని ఎక్కువగా పబ్లిక్ ప్రైవేట్ ఇన్స్టిట్యూట్స్లో చేపట్టే హెల్త్ మేనేజ్మెంట్ విధానాన్ని అవలంభించాలి! డ్రగ్ క్వాలిటీ రెగ్యులేషన్లను తప్పక పాటించాలి! కొత్త కొత్త విధానాలతో రెగ్యులేషన్లను అప్డేట్ చేసుకోవాలి! తక్కువ స్థాయి లో ఉత్పత్తిచేసే మాన్యుఫ్యాక్చర్ సంస్థలను నిరంతర తనిఖీల ద్వారా అదుపులో వుంచాలి! సబ్ స్టాండర్డ్ మాన్యుఫ్యాక్చరర్లను శిక్షించాలి! ప్రజా ఆరోగ్య విధానాలు ఎన్నో పాటించగులుగుతేనే ప్రభుత్వాలు, మెడికల్ సంస్థలూ ఆసుపత్రుల ద్వారా రోగులకూ వ్యాధిగ్రస్తులకు నిరంతర సేవను చేసేందుకు ఆస్కారం వుంటుంది! అన్నిటికంటే మించి ఉచిత వైద్య సౌకర్యం ప్రభుత్వాలు కల్పించగలిగితే అంతకంటే మించిన వైద్య సేవ మరొకటి వుండదు! అప్పుడే డాక్టరును ప్రజలు 'దేవుడి'గా భావిస్తారు!*



రావులపాటి సీతారాంరావు

ప్రజారోగ్య విధానాలు నిర్దిష్టంగా రూపొందించటం ప్రతి ప్రభుత్వం ప్రథమ కర్తవ్యం! అయితే విధానాల రూపకల్పన ఆర్థిక శక్తి మీద ఆధారపడి వుంది! ఆర్థిక పురోగతి సాధించిన దేశాలలో ప్రజారోగ్యం ప్రాథమిక అవసరంగా గుర్తించటం వల్ల చాలావరకు ప్రభుత్వమే ఉచిత ఆరోగ్య సేవలు అందజేస్తున్నది! సరాసరి తలసరి ఆదాయం కొన్ని దేశాల్లో ఎక్కువగా వున్నప్పటికిని, ఆ దేశ లెక్కల ప్రకారం తక్కువగా వున్న క్రింది తరగతి ప్రజానీకానికి మరింతగా ఆరోగ్యం పట్ల ఖర్చు చేస్తున్నది! కోవిడ్ 19 పెండమిక్ ఈ విధానాలను దాదాపు ప్రతి దేశంలో దెబ్బ తీసింది! దానితో ఆరోగ్య విధానాలకు సహాయకారిగా వుండే 'డెవలప్మెంట్ అసిస్టెన్స్ ఫర్ హెల్త్ (డి.ఎ.హెచ్) కోవిడ్ తర్వాత తగ్గ ముఖం పట్టింది! ప్రతి రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ప్రజారోగ్యం కోసం బడ్జెట్లో నిధులను కేటాయించటం జరుగుతుంది! వేరు వేరు శాఖలకు కేటాయించిన బడ్జెట్ నిధులను లెక్కిస్తే 'హెల్త్ కేర్'కు కేటాయించిన నిధులను ఖర్చుచేసే విధానాలలో ఈ మధ్య కాలంలో లోపాలు పెరుగుతున్నాయి! ప్రతి సంవత్సరం గ్లోబల్ వ్యవస్థలో అమెరికా, హెల్త్ కోసం ఇచ్చే సహాయం కోవిడ్19 తర్వాత దాదాపు 67 శాతం(ఫారిన్ అసిస్టెన్స్ ప్రోగ్రాం)లో తగ్గించింది. అమెరికా మాదిరే యు.కె., ఫ్రాన్స్, జర్మనీ గూడా 39శాతం, 35 శాతం, 12 శాతం (దేశాల వరుసలో) తగ్గించాయి! దీంతో ప్రజారోగ్యానికి తోడ్పడే ఆర్థిక సహకారం తగ్గుముఖం పట్టటంతో ఆరోగ్య పరిస్థితులు మన దేశంలో కూడా గడ్డు పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది! ఎంతకాలం ఇతర దేశాల సహాయ సహకారాల మీద కాలం గడుపుతాం? స్వయం కృషితో ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధి సాధనతో ఆరోగ్య విధానాలను పరిస్థితుల దృష్ట్యా మార్చుకుంటూ మెరుగుపర్చుకోక తప్పదు!. జాతీయ బడ్జెట్ కూడా కొన్ని పరిస్థితుల వల్ల (అంటే అప్పులు వడ్డీలు) అనుకున్నంతగా ఆరోగ్య వ్యవస్థకు ఆర్థిక సహకారం అందించలేకపోతున్నది! దాదాపు 102 ట్రిలియన్స్ 2024 లో వడ్డీ రికార్డు స్థాయికి గ్లోబల్ పబ్లిక్ డెత్ చేరుకుంది! అందుకోసమే ఉన్నంతలో ఆరోగ్య వ్యవస్థకు ఎక్కువ డబ్బు సమకూర్చక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఎంతయితే బడ్జెట్ ప్రకారం కేటాయించబడిందో ఆ మొత్తం డబ్బు ఆరోగ్య భద్రత కోసమే ఖర్చు పెట్టాలి! ఖర్చు అవసరమైన వాటి కోసమే పెట్టాలి. తక్కువ డబ్బు వెచ్చించటం వల్ల మన దేశ ప్రజల ఆరోగ్యాలను కాపాడటంలో వెనకడుగు వేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నేషనల్ హెల్త్ మిషన్



(ఎన్.హెచ్.ఎం) లెక్కల ప్రకారం అంటువ్యాధులు, అంటు వ్యాధులు కాని ప్రోగ్రాంస్కు చెందాల్సిన డబ్బుల్లో కేవలం 26 శాతం మాత్రమే ఖర్చు చేయటం దారుణం! పాలసీలకు క్షేత్రస్థాయిలో అమలుకు భారతప్రభుత్వం నిర్దిష్టమైన సంస్థాగత, రెగ్యులేటరీ పర్యవేక్షణ ఆరోగ్య శాఖ విషయంలో అవసరంగా మారింది. వైద్య విద్యా విధానం కూడా దేశ మంతటా ఒకే మాదిరిగా తీర్చిదిద్దాలి! వైద్యులుగా బయట ప్రపంచంలోకి అడుగుపెట్టేవారు మౌలికమైన వృత్తి నైపుణ్యాన్ని నేర్చుకున్నారని స్పష్టమైన నమ్మకం ప్రభుత్వాలకూ ప్రజలకూ కలిగేందుకు 'నేషనల్ ఎగ్జిట్ టెస్ట్' అన్ని రాష్ట్రాల లోనూ నిర్వహించిన తర్వాతనే వారిని మెడికల్ గ్రాడ్యుయేట్సుగా గుర్తించాలి! చాలా మెడికల్ కాలేజీలు దేశమంతటా వెలుస్తున్నాయి! దానికి కారణం నేషనల్ మెడికల్ కమీషన్ (ఎన్.ఎమ్.సి) నిబంధనలను సడలించటం వల్ల! కొత్తగా వచ్చిన ఈ కాలేజీలలో కావల్సిన రీతిలో స్టాండర్డ్స్ అవలంబిస్తున్నారా లేదా అని మానిటరింగ్ చేయాలి! అంతేగాదు పేరుకే ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 'ఘోస్ట్ ఫ్యాకల్టీ'ని కనిపెట్టేందుకు సరియైన చర్యలు క్షుణ్ణంగా తీసుకోవాలి! రీజనల్, డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్, సూపర్ స్పెషాల్టీ ట్రైనింగ్ సీట్లను పెంచటం వల్ల లోకల్ డాక్టర్లు అందుబాటులో లేని సమస్యను పరిష్కరించినట్లవుతుంది! ఆయుష్మాన్ భారత్ (ఎబిపియంజె) ఎకో సిస్టమ్‌ను పెంచటం వల్ల అవుట్ పేషంట్ల కవరేజ్ ఎక్కువవుతుంది. ఆ పని సత్వరం చేపట్టాలి! ఈ సౌకర్యంతో ఎక్కువ మందికి మెడికల్ సదుపాయం కలుగుతుంది! ప్రాథమికంగా కేర్ తీసుకోవటంతో పాటు, ప్రివెంటివ్ చర్యలు గ్రామ సీమలలో ప్రైమరీ హెల్త్ సెంటర్ల ద్వారా చేపట్టాలి! ఆ చర్యల వల్ల పెద్ద హాస్పిటల్స్ చుట్టూ చిన్న చిన్న ఆరోగ్య సమస్యలతో తిరిగే వారి సంఖ్య తగ్గుతుంది! డ్రాఫ్ట్ నేషనల్ హెల్త్ రిసెర్చి పాలసీ 2026 ను త్వరితగతిన యాక్టుగాచేయాలి! పేషంట్లను దృష్టిలో పెట్టుకొనిపబ్లిక్ ఫండ్స్‌ను సమకూర్చాలి! కేవలం పబ్లిసిటీ చర్యలతో కార్యక్రమాలు తలపెట్టినట్లుగా పైపై కంటి తుడుపు చర్యలు మానేయాలి! వైద్యంలో కొత్త కొత్త ప్రయోగాలను పేషంట్లను ఆధారం చేసుకొని చేపట్టినట్లయితే సంతృప్తికర, ఉపయోగకరమైన ఫలితాలు రోగులకు రిలీఫ్ నిచ్చే విధంగా వుంటాయి. క్షేత్రస్థాయి ప్రయోగాలకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాల్సిన సమయం ఆసన్నమయింది! ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా పేషంట్ల మెడికల్ హిస్టరీని ట్రాక్ చేసే విధానాన్ని ఎక్కువగా పబ్లిక్ ప్రైవేట్ ఇన్స్టిట్యూట్స్లో చేపట్టే హెల్త్ మేనేజ్మెంట్ విధానాన్ని అవలంభించాలి! డ్రగ్ క్వాలిటీ రెగ్యులేషన్లను తప్పక పాటించాలి! కొత్త కొత్త విధానాలతో రెగ్యులేషన్లను అప్డేట్ చేసుకోవాలి! తక్కువ స్థాయి లో ఉత్పత్తిచేసే మాన్యుఫ్యాక్చర్ సంస్థలను నిరంతర తనిఖీల ద్వారా అదుపులో వుంచాలి! సబ్ స్టాండర్డ్ మాన్యుఫ్యాక్చరర్లను శిక్షించాలి! ప్రజా ఆరోగ్య విధానాలు ఎన్నో పాటించగులుగుతేనే ప్రభుత్వాలు, మెడికల్ సంస్థలూ ఆసుపత్రుల ద్వారా రోగులకూ వ్యాధిగ్రస్తులకు నిరంతర సేవను చేసేందుకు ఆస్కారం వుంటుంది! అన్నిటికంటే మించిఉచిత వైద్య సౌకర్యం ప్రభుత్వాలు కల్పించగలిగితే అంతకంటే మించిన వైద్య సేవ మరొకటి వుండదు! అప్పుడే డాక్టరును ప్రజలు 'దేవుడి'గా భావిస్తారు! ●

# దేశ ప్రగతికి బాటలు వేస్తున్న 'ఆర్థికం'

ఇస్కా రాజేష్ బాబు

దేశీయ లావాదేవీలు సహా దిగుమతుల ద్వారా పన్ను వసూళ్లు పెరగడంతో జులైలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది జులైతో పోలిస్తే ఈ వసూళ్లు 15.4శాతం ఎక్కువని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. సీజీఎస్టీ రూ.39,835 కోట్లు, ఎస్జీఎస్టీ రూ.47,881 కోట్లు, ఐజీఎస్టీ వసూళ్లు రూ. 1,23,000 కోట్లుగా ఉన్నాయి. గతనెలలో రిఫండ్లు 13.1 శాతం పెరిగి రూ.29,968 కోట్లకు చేరుకున్నాయి. రిఫండ్లను మినహాయించిన అనంతరం నికర జీఎస్టీ ఆదాయం 1.81లక్షల కోట్లుగా ఉంది. దేశీయ వ్యాపార లావాదేవీలు ఊపందుకోవడం, విదేశాల నుంచి దిగుమతులు భారీగా పెరగడంతో భారత ఆర్థిక వ్యవస్థ మరోసారి తన బలాన్ని చాటుకుంది. జూలై నెలలో దేశవ్యాప్తంగా వస్తు, సేవల పన్ను వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లకు చేరుకుని కొత్త రికార్డు నమోదు చేశాయి. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 15.4 శాతం వృద్ధి నమోదవగా, గత 14 నెలల్లో ఇదే అత్యధిక వృద్ధి రేటు కావడం విశేషం. దిగుమతులపై వసూలైన జీఎస్టీ 28.8 శాతం పెరిగి రూ.66,511 కోట్లకు చేరగా, దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ 10.1శాతం వృద్ధితో రూ.1.45లక్షల కోట్లుగా నమోదైంది. దేశంలో వినియోగం, వ్యాపార కార్యకలాపాలు మరింత బలపడుతున్నాయనే సంకేతాలను ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రెండోసారి రూ.2 లక్షల కోట్ల మార్కు. ఏప్రిల్‌లో రూ.2.43 లక్షల కోట్ల ఆల్‌టైమ్ రికార్డు నమోదైన తర్వాత, మేలో రూ.1.94 లక్షల కోట్లు, జూన్‌లో రూ.1.95లక్షల కోట్లు వసూలయ్యాయి. జూలైలో మళ్లీ రూ.2.11 లక్షల కోట్లతో రూ.2 లక్షల కోట్ల మార్కును దాటి మరోసారి రికార్డు సృష్టించింది. వ్యాపారులకు రూ.29,968 కోట్ల రీఫండ్లు చెల్లించిన తర్వాత ప్రభుత్వానికి వచ్చిన నికర జీఎస్టీ ఆదాయం రూ.1.81 లక్షల కోట్లు. ఇది గత ఏడాదితో పోలిస్తే 15.8 శాతం అధికం. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జులై వరకు మొత్తం జీఎస్టీ వసూళ్లు రూ.8.43 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో వసూలైన రూ.7.66 లక్షల కోట్లతో పోలిస్తే 10.1శాతం వృద్ధి నమోదైంది. ఈసారి జీఎస్టీ వృద్ధికి ప్రధాన కారణం దిగుమతులపై పన్ను వసూళ్లు భారీగా పెరగడమేనని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అదే సమయంలో దేశీయ ఆర్థిక కార్యకలాపాలు కూడా బలంగా కొనసాగడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం గణనీయంగా పెరిగింది. రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ వసూళ్లలో రెండంకెల వృద్ధిని నమోదు చేసి దేశంలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాయి. ఇది రెండు రాష్ట్రాల్లో ఆర్థిక కార్యకలాపాలు వేగంగా పెరుగుతున్నాయనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నెలవారీ జీఎస్టీ ఆదాయ నివేదిక ప్రకారం, జులై నెలలో మొత్తం జీఎస్టీ వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గతేడాది జూలై నెలతో పోలిస్తే వార్షిక ప్రాతిపదికన 15.4 శాతం పెరుగుదల కనిపించింది. డొమెస్టిక్ ట్రాన్సాక్షన్స్, దిగుమతులకు సంబంధించిన ఆదాయం వలన జీఎస్టీ వసూళ్లు జోరు కొనసాగుతోందని తాజా గణాంకాలు సూచిస్తున్నాయి. డొమెస్టిక్ ట్రాన్సాక్షన్స్ ద్వారా వచ్చిన గ్రాస్ జీఎస్టీ ఇన్‌కమ్, గత ఏడాది ఇదే నెలలో నమోదైన రూ.1.31లక్షల కోట్ల నుంచి 10.1శాతం పెరిగి, 2026 జూలైలో రూ. 1.45 లక్షల కోట్లకు చేరింది. దీనితోపాటు దిగుమతులపై వసూలైన జీఎస్టీలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. దిగుమతులకు సంబంధించిన జీఎస్టీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 28.8శాతం పెరిగి రూ.66,511 కోట్లకు చేరింది. ఇది ఆ నెలలో దేశం మొత్తం స్థూల జీఎస్టీ వసూళ్లను రూ.2.11 లక్షల కోట్లకు పెరిగేందుకు కారణమైంది. జూలై నెలలోప్రభుత్వం ఎక్కువ మొత్తంలో జీఎస్టీ రీఫండ్లను కూడా జారీ చేసింది. గత ఏడాదితో పోలిస్తే మొత్తం రీఫండ్లు 13.1 శాతం పెరిగి రూ. 29,968 కోట్లకు చేరాయి. ఈ రీఫండ్స్ విషయంలో ఎక్కువగా గణనీయంగా ఎగుమతిదారుల వాటా ఉంది. ఐస్‌గేట్ సిస్టమ్ ద్వారా ప్రాసెస్ చేయబడిన రీఫండ్స్ ఏడాదితో పోలిస్తే 22.7శాతం పెరిగి రూ. 12,288 కోట్లకు చేరినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జీఎస్టీరీఫండ్స్‌ను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, నికర జీఎస్టీ వసూళ్లు రూ.1.81 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇది జూలై 2025తో పోలిస్తే 15.8 శాతం పెరుగుదల. నెట్ డొమెస్టిక్ రెవెన్యూ 10.5 శాతం పెరిగి రూ. 1.27 లక్షల కోట్లకు చేరగా, నికర కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం 30.3 శాతం భారీవృద్ధితో రూ.54,223 కోట్లకు పెరిగింది. కేంద్ర ఆర్థిక శాఖ తెలిపిన వివరాల ప్రకారం, గత ఏడాది ఏప్రిల్ నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.2.43 లక్షల కోట్లు వచ్చాయి. ఈ ఏడాదిలో దేశీ దిగుమతుల ద్వారా జీఎస్టీ రెవెన్యూ 28.8 శాతం పెరిగింది. దీంతో వరుసగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతుండటం దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సంకేతమని నిపుణులు భావిస్తున్నారు. జీఎస్టీ వసూళ్లలో హరియాణా రాష్ట్రం అత్యధిక వృద్ధిని సాధించింది. పెద్ద రాష్ట్రాలతో పోల్చి హర్యానా రాష్ట్రం అత్యధిక వార్షిక వృద్ధి రేటును నమోదు చేసింది. గుజరాత్, తెలంగాణ రాష్ట్రాలు ఆ తర్వాత జాబితాలో ఉన్నాయి. జీఎస్టీ వసూళ్లలో 19శాతం వృద్ధిని నమోదు చేశాయి. పంజాబ్, కేరళ రాష్ట్రాలు 16 శాతం, ఉత్తరప్రదేశ్ జీఎస్టీ వసూళ్లలో 15 శాతం పెరుగుదలను నమోదుచేశాయి. జీఎస్టీ ఆదాయానికి దేశంలోనే అత్యధికంగా సహకరిస్తున్న మహారాష్ట్ర 13 శాతం వృద్ధిని నమోదు చేయగా, కర్ణాటక 12శాతం పెరుగుదలను నివేదించింది. ఢిల్లీలో జీఎస్టీ వసూళ్లు 8శాతం పెరిగాయి. జులై నెలలో జీఎస్టీ కింద నమోదైన ఆదాయం సీజీఎస్టీ రూ. 39,835 కోట్లు ఉండగా, రాష్ట్ర వస్తు, సేవలపన్ను ఎస్జీఎస్టీ రూ.47,881 కోట్లు, ఇంటిగ్రేటెడ్ ఐజీఎసీ వసూళ్లు రూ.1.23 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. ●

# సనాతన ధర్మాచరణే అనుసరణీయం!



సరికొండ రవింద్రనాథ్

భారతీయ జనతా పార్టీలో (బిజెపి)లో ఉన్న వారంతా సనాతనులు కాదు. అలాగే సనాతనులు అంతా బిజెపి వారు కాదు. కొంచెం స్పష్టంగా చెప్పాలంటే బిజెపి రాజకీయ పార్టీ. అనేక రకాలైనవారు, అనేక జీవన స్రవంతుల నుంచి వచ్చిన వారు, వేర్వేరు ప్రయోజనాలను ఆశించి వచ్చిన వారు ఆ పార్టీలో ఉన్నారు. వీరిలో సనాతన ధర్మాన్ని నమ్మని వారు, ఆచరించనివారు కూడా ఉన్నారు. అలాగే సనాతన ధర్మాన్ని నమ్మినవారు ఇతర పార్టీలలో కూడా ఉన్నారు. భారత దేశంలో సనాతన ధర్మం గొప్పతనం ఇది. దేశంలోని జీవితానికి ఇది అద్దం పడుతుంది. ఏ పార్టీవారైనా, కులం వారైనా సనాతన ధర్మం ఆచరణ విషయంలో ఏకాభిప్రాయంలోనే యుగాలుగా సహజీవనం సాగిస్తున్నారు. ఈ సజీవ స్రవంతిని మార్చే శక్తి ఏదీ ఇప్పటివరకూ జనించలేదు. సనాతన ధర్మం అంటే అనేక అభిప్రాయాలున్నాయి. వివేచనను, నేర్చుకున్న జ్ఞానాన్ని బట్టి సనాతనం అనే పదానికి నిర్వచనాలను వింటున్నాం, చూస్తున్నాం. ఎవరేం చెప్పినా పామరుల నుంచి పండితుల వరకూ హిందూ జీవన విధానం అంతా వేదాంత సారమైన సనాతనాన్నే అనుసరిస్తున్నారు. వేదాలు చదవని వారు సైతం తెలియకుండానే వేదాలు చెప్పే జీవన విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇదే హిందూ జీవన విధానం. మనకు తెలియని, తెలిసిన చరిత్రల హిందూ జీవన విధానం అనేక మార్పులకు, సంఘర్షణలకు లోనైంది. అనేక ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ యుద్ధాలను చూసింది. జీవన విధానాలకు సంబంధించిన అనేక అంతర్గత సంఘర్షణలకు లోనైంది. కానీ అన్నింటికి మూలమైన వేదాల సారం ఈ కాల చక్రాన్ని నియంత్రిస్తూ వస్తోంది. ప్రపంచంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయినప్పుడు. ఆకలి దప్పులతో అరాచకాలతో, నియంతృత్వాలతో రాక్షస పాలనలో ప్రపంచం జీవనం గతి తప్పినపుడు ప్రజలకు రుజుమార్గం చూపించడానికి ఒక అవతార పురుషుడు జన్మిస్తాడు. ఒక ప్రవక్త ఉదయిస్తాడు. సనాతన ధర్మంలో నాటి వేదాల నుంచి నేటి వరకూ ప్రపంచ గతిని, నాగరికతను సరైన మార్గంలో పెట్టడానికి సనాతన ధర్మంలో అవతారాలు ఉదయించడం కనిపిస్తుంది. ఒక్కో అవతారం ఆ యుగంలో ప్రజలకు సరైన మార్గనిర్దేశం చేయడాన్ని చూస్తాం. సంభవామి యుగే యుగే అని గీతలో కృష్ణుడు చెప్పడం ఈ సనాతన ధర్మానికి పతాక శీర్షిక అని చెప్పాలి. ఇప్పుడు సనాతన ధర్మంలో బిజెపి పాత్ర ఏంటన్న ప్రశ్న గురించి కొద్దిగా మాట్లాడుకుందాం. దేశంలో గతంలో రాజ్యాలను ఏలిన రాజులకు సనాతన ధర్మానికి మధ్య సంబంధంలాంటిదే ఇది కూడా. సనాతన ధర్మ చరిత్రను పరిశీలిస్తే బిజెపి సముద్రంలో నీటి బిందువులాంటిది. యుగయుగాల చరిత్ర గతిలో రాజులు వచ్చిపోయారు. రాజ్యాలు ఎన్నో మారిపోయాయి. సనాతన ధర్మాన్ని పాటించిన రాజుల మనుగడ సాధించారు. సనాతన ధర్మాన్ని అనుసరించిన రాజ్యాల చరిత్రలో నిలిచాయి. ఇప్పుడు ఆరెస్సెస్, బిజెపిలను హిందుత్వ పార్టీలు అంటున్నారు. తప్పు లేదు. హిందుత్వాన్ని అనుసరించే వారిని హిందువులు, భారత దేశంలో ఉన్నవారిని భారతీయులు అనేకదా అంటారు. చరిత్రలో ఇతర మతాల నుంచి సనాతన ధర్మాన్ని కాపాడుకోడానికి యుద్ధాలు చేసిన రాజులు, జాతిని కాపాడుకోడానికి ప్రాణాలు అర్పించిన అమరవీరులు ఉన్నారు. వాళ్ల యుద్ధాలు చేసి, త్యాగాలు చేయకపోతే భరతమాతకు మరో వీరపుత్రుడో, వరపుత్రికో జనించేవారు. సంభవామి యుగే యుగే అనుకున్నాం కదా! వారిలాగే ఈరోజు ఆరెస్సెస్, బిజెపిలు, విహెచ్ పిలు 'సనాతన ధర్మాన్ని కాపాడటానికి కృషి చేస్తున్నాం' అని చెబుతున్నాయి. వీరు చేస్తున్న కృషివల్ల భరతజాతి ఎంతవరకు తలెత్తుకుని నిలబడగలదో. భవిష్యత్తులో చరిత్ర చెప్పకనే చెబుతుంది. సమాజం నడతను మార్చే క్రమంలో అనేక తత్వశాస్త్రాలు పుట్టాయి. వీటిలో కొన్నింటిని తత్వ, ఆర్థిక శాస్త్రాలని, కొన్నింటిని మతాలని అంటున్నాం. వీటిలో సైన్స్ ఆధారంగా సమానత్వాన్ని బోధించే ఫిలాసఫీలు కూడా ఉన్నాయి. సైన్స్ భూమిపై జరిగే పరిణామాలకు వివరణ ఇవ్వగలదు. కాని పరిష్కారాలను సూచించలేదు. సాంఘిక, రాజకీయ జీవితం ఇలా ఉండాలని సైన్స్ నిర్దేశించలేదు. ఇక్కడ సైన్స్ ఫెయిల్యూర్ కనిపిస్తుంది. సైన్స్ శోధించలేనిది సనాతన ధర్మం చేయగలదు. విశ్వాన్ని సైతం యుగాల క్రితమే సనాతన ధర్మం శోధించింది. సత్యం కోసం రాజ్యాలను తృణప్రాయంగా త్యాగం చేసిన రాజులను సనాతన హిందువుల్లో చూస్తాం. ప్రపంచంలోని ఏ చరిత్రలోనూ ఈ ఉదాత్తత, ఔన్నత్యం కనిపించదు. పెద్దలను, గురువులను గౌరవించడం ఇక్కడే ఉంది. అలాగే కుటుంబ బంధాలు, అనుబంధాలు సనాతన ధర్మంలోనే కనిపిస్తాయి. అందుకే ఈ ధర్మానికి ప్రపంచంలో అంతటి విశిష్ట స్థానం ఉంది. సనాతన ధర్మం తనను తాను సంస్కరించుకోగలదు. ఒకనాడు భారత స్త్రీ వంటింటి కుందేలుగానే ఉండాలనే సంప్రదాయం ఉండేది. ఇప్పుడు కుటుంబాన్ని ముందుకు నడిపించడంలో స్త్రీ ముందు ఉంటోంది. ఈ మార్పును సనాతనధర్మం ప్రకృతి సహజంగానే స్వీకరించింది. నేడు ఈ భారతావనిలో స్త్రీని దేవతగానే పూజిస్తారు. ప్రకృతిలో సగమైన స్త్రీకి ఏ ఇతర దేశంలోనూ భారతజాతి ఇచ్చిన గౌరవం ఇవ్వడం లేదు. సైన్స్ ఒక్కటి కాదు, తత్వశాస్త్రం, ఖగోళ, ఆరోగ్య శాస్త్రాలతో సకల శాస్త్రాలతో మానవాళికి భవిష్య మార్గం చూపించే యుగధర్మం సనాతనం. సనాతన ధర్మాన్ని అధ్యయనం చేయడానికి పండితులకి జీవితకాలం సరిపోని గ్రంథాలున్నాయి. ఈమధ్య కాలంలో మతం గురించి, సనాతన ధర్మం గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కారణం ఏంటి అన్న ప్రశ్నలు తలెత్తడం సహజం. ఇద్దరు వ్యక్తులు ఇరుగు పొరుగున ఉన్నారు. ఒక వ్యక్తి అదే పనిగా పక్కింటిపైకి రాళ్ల వేస్తున్నాడు. రెండో వ్యక్తి మనకెందుకులే అని కొంతకాలం మౌనంగా ఉన్నాడు. ఒక రోజు రెండో వ్యక్తి తనను రక్షించుకోడానికి రాళ్ల వేయడం మొదలు పెట్టాడు. ఘర్షణ మొదలైంది. ఇప్పుడు మనకు సోషల్ మీడియాలో ఈ యుద్ధమే కనిపిస్తోంది. సనాతన ధర్మాన్ని, చరిత్రను, సంస్కృతిని అవమానపరుస్తూ ఎవరు మాట్లాడినా కొన్ని తరాలవారు మౌనంగా, సహనంతో భరించారు. తమ దేవుళ్లను ఎవరుతూలనాడినా సహించారు. కానీ ఈ తరంలో ఆ సహనం కనిపించడం లేదు. జెన్‌జీ తరం కదా! సనాతన ధర్మంపై దాడికి సరైన సమాధానం చెబుతున్నారు. అందుకే ఇంత కాలం తాము మాట్లాడిందే ధర్మమని ఏకపక్షంగా పిడివాదం చేసేవారు గుక్కపెట్టి సమాధానాలు వెదుక్కోవలసి వస్తోంది. ●

# పార్లమెంటుకు గైర్హాజరు కావొద్దు

**• సమావేశాలు సజావుగా సాగేందుకు కృషి చేయండి.. • నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనండి..**

**సభా సమయం వృధా చేయొద్దు • కొత్త ఎంపీలకు ప్రధాని మోడీ దిశానిర్దేశం**



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** వర్షాకాల సమావేశాల సందర్భంగా పార్లమెంటు సభ్యులతో తాను కొనసాగిస్తున్న సంప్రదింపులలో భాగంగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బుధవారం తన అధికారిక నివాసంలో 37 మంది బిజెపి పార్లమెంటు సభ్యులతో అల్పాహార సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో వివిధ బిజెపి ఎంపిల బృందాలతో సమావేశమై అభిప్రాయాలను పంచుకోవడం, పరిపాలన, పార్లమెంటరీ వ్యవహారాలపై చర్చించడం, పార్టీలో సమన్వయాన్ని బలోపేతం చేయడం వంటి ప్రధాని ఆచరణలో భాగంగా ఈ అనధికారిక సమావేశం జరిగింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ అల్పాహార సమావేశంలో ప్రధాన మంత్రి మోడీ ఎంపిలతో తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. పలు అంశాలపై అనధికారిక చర్చలు జరిపారు. పార్లమెంట్ ఎటు వంటి ఆటంకాలు లేకుండా సజావుగా పనిచేయాలని ప్రధాని మోడీ ఎంపిలకు హితబోధ చేశారు. ప్రజా జీవితంలో తన అనుభవాన్ని పంచుకున్న మోడీ, ఎంపీలు పార్లమెంట్‌ను ఎంత తీవ్రంగా పరిగణించాలనే దానిపై మార్గదర్శనం చేశారని ఈ సమావేశం గురించి తెలిసిన వర్గాలు తెలిపాయి. ప్రతిరోజూ పార్లమెంట్ లైబ్రరీలో కనీసం ఒకటి లేదా రెండు గంటల సమయం గడపాలని ప్రధానమంత్రి ఎంపిలను ప్రోత్సహించారు. అంతేకాకుండా, యువతతో మమేకమవ్వాలని, తమ నియోజకవర్గాల్లో యువత, క్రీడా కార్యకలాపాలపై దృష్టి సారించి ఎంపి స్థానిక ప్రాంత అభివృద్ధి పథకాన్ని (ఎంపీల్యాడ్స్) చురుకుగా అమలు చేయాలని ఆయన వారిని ప్రోత్సహించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. పార్లమెంట్ సమావేశాలకు నిత్యం హాజరుకావాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ గైర్హాజరు కాకూడదని హితబోధ చేశారు. అలాగే నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలని, పార్లమెంట్ సజావుగా పనిచేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధి అజెండాను ముందుకు తీసుకెళ్లడానికి అర్థవంతమైన చర్చలు, సామూహిక ప్రయత్నాలు అవసరమని ఆయన నొక్కి చెప్పారు. హాజరైన వారిలో ఎన్‌సిపిఐ కూటమికి చెందిన బిజెపి ఎంపిలు, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నుండి బిజెపిలో చేరిన మాజీ నాయకులు, అలాగే పార్టీ సీనియర్ నాయకులు తరుణ్ చుగ్, వినోద్ తావ్డే, బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్ ఉన్నారు.

ఈ సమావేశానికి కొత్తగా ఎన్నికైన పార్టీ నాయకులు తరుణ్ చుగ్, వినోద్ తావ్డే, మాజీ ఆప్ నాయకులు స్వాతి మాలివాల్, రాఘవ్ చద్దా, అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్, విక్రమ్‌జిత్ సింగ్ సహానీ హాజరయ్యారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో అల్పాహార సమావేశం నిర్వహించడం గత కొన్నేళ్లుగా ప్రధానమంత్రి ఆచరిస్తున్న పద్ధతిలో భాగం. ఇది ఎంపిలకు ఆయనతో నేరుగా సంభాషించే అవకాశాన్ని కల్పిస్తుంది. ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాకాల సమావేశాల నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. దీనివల్ల ప్రధానమంత్రి ఎంపిలతో చిన్న బృందాలుగా సమావేశమై, పాలన, నియోజకవర్గ స్థాయి సమస్యలు, ప్రజలకు చేరువయ్యేందుకు పార్టీ చేపట్టిన కార్యక్రమాలపై వారి నుంచి అభిప్రాయాలను తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

## 17నుంచి 3 రోజులు ప్రత్యేక సమావేశాలు!

### డీలిమిటేషన్, మహిళా బిల్లుల కోసం..

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో పలు అంతరాయాలు ఏర్పడి చాలా భాగం రద్దయినప్పటికీ, నరేంద్ర మోడీ ప్రభుత్వం తన అత్యంత ప్రతిష్టాత్మకమైన రెండు శాసన ప్రతిపాదనలను ఒకే ప్యాకేజీలో ముందుకు తీసుకెళ్లడానికి సిద్ధమవుతోంది. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లులను చేపట్టేందుకు, ఆగస్టు 13న వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. అయితే, సమావేశాలు ముగిసిన తర్వాత పార్లమెంటును వాయిదా వేయకపోవచ్చు, తద్వారా ప్రభుత్వం స్వల్ప నోటీసుతో దానిని తిరిగి సమావేశపరచడానికి వీలు కలుగుతుంది. రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించడానికి అవసరమైన మూడింట రెండువంతుల మెజారిటీని సాధించేందుకు కేంద్రం కృషిచేస్తోందని సంబంధిత వర్గాలుతెలిపాయి.

131వ రాజ్యాంగ సవరణ బిల్లులో భాగంగా మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లు, ఏప్రిల్‌లో నిర్వ హించినన మూడు రోజుల ప్రత్యేక సమావేశంలో లోక్‌సభలో అవసరమైన మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీని సాధించడంలో విఫలమైంది. మే నెలలో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నిక లలో టిఎంసి ఘోర పరాజయం తర్వాత ఉభయ సభలలోనూ బిజెపి స్థానం బలపడింది. ప్రత్యేక మెజారిటీకి లోక్‌సభలో 360మంది ఎంపిలు, రాజ్యసభలో 164మంది ఎంపిలు అవసరంకాగా, ఆ సంఖ్యలకు దూరంతగ్గింది. అదే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, తన ఇండియా కూటమి మిత్రపక్షమైన కాంగ్రెస్‌తో ఎంకె స్టాలిన్‌కు ఏర్పడిన విభేదాలనేపథ్యంలో, పార్లమెంటు ఉభయ సభలలో మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీ అవసరమయ్యే రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదింపజేసుకునే అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి బిజెపి కూడా డిఎంకెకు చెందిన 22 మంది లోక్‌సభ ఎంపిల మద్దతుపై దృష్టి సారించింది.




# స్వతంత్ర దేశంగా ప్రకటించిన బలూచిస్థాన్

## 11న స్వాతంత్ర్య దినోత్సవం

**క్వెట్టా, ఆగస్టు 5:** పాకిస్థాన్ నుంచి విడిపోయామని తనకు తాను ప్రకటించుకున్న బలూచిస్తాన్ ఈనెల 11వ తేదీని బలూచిస్తాన్ స్వాతంత్ర్య దినోత్సవంగా అధికారికంగా ప్రకటిస్తున్నట్లు తెలిపింది. ఇక నుంచి తమది స్వతంత్ర దేశమని దాని పేరు రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్ అని పేర్కొంది. ఈ క్రమంలోనే ప్రపంచం లోని అన్ని దేశాల్లోఉన్న బలూచ్ ప్రజలు ఆగస్టు 11వ తేదీని ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవంగా నిర్వహించు కోవాలని పిలుపునిచ్చింది. అలాగే అంతర్జాతీయ సమాజం తమను స్వతంత్ర, సార్వభౌమ దేశంగా గుర్తించాలని కోరింది. ఈ క్రమంలోనే సోమవారం విడుదలచేసిన ఈ ప్రకటనలో బలూచ్ విముక్తి ఉద్యమ నేత మీర్ యార్ బలూచ్ కీలకవ్యాఖ్యలు చేశారు. ప్రతి బలూచ్ కుటుంబం తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, ప్రజా ప్రదేశాల్లో స్వతంత్ర బలూచిస్తాన్ జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. ఈ చారిత్రక దినం ప్రాముఖ్యతను భావితరాలకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్ ప్రకారం 1947 ఆగస్టు 11వ తేదీన బ్రిటిష్ పాలన ముగిసే సమయంలో బలూచిస్తాన్ స్వాతంత్ర్యాన్ని ప్రకటించిందని పేర్కొంది. ఆ ప్రకటనను అప్పటి అంతర్జాతీయ మీడియా, ఆల్ ఇండియా రేడియో కూడా ప్రచురించాయని తమ వాదనలో తెలిపింది. అందుకే ప్రతీ యేడాది ఆగస్టు 11వ తేదీనే తమ స్వాతంత్ర్య దినోత్సవంగా నిర్వహిస్తామని స్పష్టం చేసింది. 1948లో బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ బలవంతంగా విలీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రకటనలో పాకిస్థాన్ విధానాలపై మీర్ యార్ బలూచ్ తీవ్ర విమర్శలు చేశారు. కాశ్మీర్ సమస్య, 1948లో బలూచిస్తాన్‌పై సైనిక చర్య, 1971లో తూర్పు పాకిస్థాన్ విభజన, సోవియట్ అఫ్గాన్ యుద్ధం, చగాయ్ అణు పరీక్షలు, సెప్టెంబర్ 11వ తేదీ తర్వాతి పరిణామాలు వంటి అనేక సంఘటనలకు పాకిస్థాన్ విధానాలే కారణమని ఆరోపించారు. ఈ పరిణామాలు దక్షిణాసియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా అస్థిరతకు దారితీశాయని పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రస్తుతం ఉన్నట్లు కొనసాగినంత కాలం దక్షిణాసియాలో శాశ్వత శాంతి, అభివృద్ధి సాధ్యం కాదని రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్ పేర్కొంది. అందువల్ల తమ స్వాతంత్ర్యాన్ని అంతర్జాతీయ సమాజం గుర్తించి మద్దతు ఇవ్వాలని కోరింది. తమతో 6 కోట్ల మంది బలూచ్ ప్రజలు ఉన్నారని తాము స్వతంత్ర దేశమని బలూచ్ జాతీయ వాద గ్రూపులు ప్రకటించాయి. అయితే ఈ ప్రకటనను ఇప్పటివరకు పాకిస్థాన్ ప్రభుత్వం అంగీకరించలేదు. ఐక్యరాజ్యసమితి, ప్రపంచంలోని ఏ దేశమూ బలూచిస్తాన్‌ను స్వతంత్ర దేశంగా అధికారికంగా గుర్తించలేదు. ప్రస్తుతం బలూచిస్తాన్ అంతర్జాతీయంగా పాకిస్థాన్‌లోని ఒక ప్రావిన్స్‌గా గుర్తింపు పొందింది.

## ప్రెషర్‌గ్రూప్‌గా మాత్రమే పనిచేస్తాం



### సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే

**ఛత్రపతి శంభాజీనగర్, ఆగస్టు 5:** కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తమ పార్టీ కేవలం ప్రెషర్ గ్రూప్‌గా మాత్రమే పనిచేస్తుందని స్పష్టంచేసారు. బుధవారం మీడియాతో మాట్లాడిన దీప్కే ప్రస్తుతానికి తమ పార్టీ ఓ ప్రెజర్ గ్రూపులా పనిచేస్తుందన్నారు. కేంద్రప్రభుత్వంపై వత్తిడి తీసుకు రావడమే తమ ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రస్తుత దశలో భారత్ ఇదే ఉద్యమాన్ని కోరుకుంటోందన్నారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో జరగనున్న సీజేపీ కోర్ కమిటీ సమావేశాల నేపథ్యంలో ఆయన రిపోర్టర్లతో మాట్లాడారు. మీడియా, న్యాయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం సన్నిగిల్లుతోందని, ఇలాంటి అంశాలపై తమ కోర్ కమిటీ మీటింగ్‌లో చర్చించనున్నట్లు చెప్పారు. ఇథనాల్ కలిసిన పెట్రోల్, నిరుద్యోగం లాంటి అంశాలపై కూడా చర్చించనున్నట్లు తెలిపారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మాకు మెంటర్‌గా పనిచేస్తారని సిజెపి ప్రతినిధి సౌరవ్ దాస్ అన్నారు. వారి నుంచి సలహాలు తీసుకోనున్నట్లు తెలిపారు. సిజెపి నిరసన వేళ విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఎత్తివేసేలా వత్తిడితెస్తామని దాస్ తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వ ప్రతినిధులతో చర్చిస్తున్నామన్నారు. సిజెపి రాజకీయాల్లోకి వస్తుందని జరుగుతున్న ప్రచారంపై అభిజీత్ దీప్కే స్పందించారు.



## ఐన్‌స్టీన్ బిలం సమీపంలో కూలిన స్పేస్‌ఎక్స్ రాకెట్

**న్యూయార్కు, ఆగస్టు 5:** అంతరిక్షంలో పెను ప్రమాదం చోటు చేసుకుంది. స్పేస్ ఎక్స్ సంస్థ పంపిన ఫాల్కన్9 రాకెట్‌కు చెందిన, విడిచిపెట్టిన పైభాగం భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.05 గంటల ప్రాంతంలో చంద్రునిపై ఉన్న ఐన్‌స్టీన్ బిలం సమీపంలో కూలిపోయినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఘటనను శాస్త్రవేత్తలు ఇంకా పూర్తిగా నిర్ధారించాల్సి ఉంది. దాదాపు 4500 కిలోల బరువు ఉన్న ఈ రాకెట్ పైభాగం చంద్రునిపైకి బ్లూ ఘోస్ట్ మిషన్‌ను ప్రయోగించాక 19 నెలల పాటు అంతరిక్షంలో తేలుతూ ఉంది. ఇవాళ ఈ దుర్ఘటన చోటు చేసుకుందని సమాచారం. 2025 జనవరి 15న స్పేస్ ఎక్స్ ఫాల్కన్9 రాకెట్‌ను ప్రయోగించింది. ఇది దశలవారీగా విడిపోతూ చంద్రుడిపైకి రాకెట్ పైభాగం మాత్రమే వెళ్లింది. అక్కడ ఈ రాకెట్ పైభాగం మాత్రమే చంద్రుడిని ఢీకొట్టింది. అసలు రాకెట్ నుంచి విడిపోయిన తర్వాత ఇది మండుతూ చంద్రుడిపైకి వెళ్తుంది.

ఈ క్రమంలోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ రాకెట్ ఇంధనం అయిపోయిన తర్వాత, సౌర కార్యకలాపాలు, చంద్రుడి గురుత్వాకర్షణ శక్తి క్రమంగా రాకెట్ దశ గమనాన్ని మార్చేసినట్లు సమాచారం. భూమికి, చంద్రుడికి మధ్య ఒక విశాలమైన, అస్థిరమైన వలయంలో 19 నెలలుగా ఇది తిరుగుతూ ఉంది. నెలల తరబడి, భూమి, చంద్రుడు, సూర్యుని గురుత్వాకర్షణ వల్ల కలిగే రాపిడి, వాటితో పాటు సూర్యరశ్మి యొక్క ఒత్తిడి కలిసి దాని మార్గాన్ని క్రమంగా ముందుకు నెట్టాయని తెలుస్తోంది. చివరికి ఆ చిన్న చిన్న నెట్టడాలు అన్నీ కలిసి నేరుగా భూమిని ఢీకొట్టేలా చేశాయి. స్పేస్‌ఎక్స్‌లోని ఇంధనాన్ని పూర్తిగా తీసివేసి సురక్షితం చేశామని, కానీ అంతటి అధిక శక్తి మార్గాలలో ప్రయాణించే స్టేజ్‌లకు నియంత్రిత పద్ధతిలో ఇంధనాన్ని పారవేసే ప్రక్రియ సాధ్యం కాదని స్పేస్‌ఎక్స్ తెలిపింది. ఇది సుమారుగా గంటకు 8,700 కిలోమీటర్ల వేగంతో భూమిని ఢీకొట్టి ఉంటుంది. ఇది దాదాపు మూడు టన్నుల టీఎన్టీకి సమానమైన శక్తిని విడుదల చేస్తుంది. చంద్రునికి గాలి నిరోధం లేదా ఘర్షణను కలిగించే వాతావరణం లేనందున, రాకెట్ దాదాపు పూర్తి వేగంతో ఢీకొట్టినట్లు తెలుస్తోంది. చంద్రునిపై నుంచి ప్రయాణిస్తున్న మన చంద్రయాన్2 ఆర్బిటర్ ఈ ప్రమాద స్థలాన్ని గుర్తించగలుగుతుంది.

## ప్రతిపక్షాల నిరసనల మధ్య బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ప్రతిపక్ష సభ్యుల నిరసనలు కొనసాగుతున్నప్పటికీ, డిజిటల్, వర్చువల్ రికార్డులను కోర్టులలో సాక్ష్యంగా అనుమతించే బిల్లును లోక్‌సభ బుధవారం ఆమోదించింది. ఎలాంటి చర్చ లేకుండా మూజువాణి ఓటుతో ఈ చట్టం ఆమోదం పొందినఅనంతరం, సభను వాయిదా వేశారు. 'బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ యాక్ట్, 2026 1891నాటి బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ యాక్ట్‌ను రద్దుచేస్తుంది లేదా దాని స్థానంలోకి వస్తుంది. అంతకు ముందు వాయిదాపడిన సభ మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి సమావేశమైనప్పుడు ఈ బిల్లును పరిశీలనకు చేపట్టారు. కానీ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూనే ఉన్నారు. దానిపై చర్చించాలన్న సభాపతి విజ్ఞప్తిని పట్టించుకోలేదు. అంతరాయాలు కొనసాగుతుండటంతో, బిల్లును ఓటింగ్‌కు పెట్టగా, అది మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. నినాదాలపై స్పందిస్తూ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, కాంగ్రెస్ నాయకుడు కెసి వేణుగోపాల్ 'మంచి వ్యక్తి' అయినప్పటికీ, ఆయన తన పార్టీ ఎంపిలను నియంత్రించలేకపోయారని అన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీలు శ్రీరాముడికి వ్యతిరేకంగా ఉన్నాయని రిజిజు ఆరోపించారు. వారు దేశానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్‌పై ఇక్కడ జంతర్ మంతర్ వద్ద, దేశంలోని ఇతర ప్రాంతాలలో నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యపై ప్రతిపక్షం ప్రభుత్వం నుండి క్షమాపణలతో కూడిన వివరణ కోరుతోంది. అలాగే అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల అపహరణ ఆరోపణలపై కూడా నిరసన తెలుపుతోంది.

## డ్రోన్ తయారీ కంపెనీ సిఇఒ లక్ష్యంగా పేలుడు



### డ్రైవర్ మృతి, సిఇఒకు తీవ్రగాయాలు

### ఉక్రెయిన్‌లోని కీలక ప్రాంతాలపై రష్యా డ్రోన్ల దాడులు

### 17 మంది మృతి, 45 మందికిపైగా గాయాలు

**మాస్కో, ఆగస్టు 5:** రష్యాక్రెయిన్ యుద్ధం వేళ రష్యా భూభాగంలో ఊహించని సంచలనం చోటుచేసుకుంది. రష్యన్ సైన్యానికి అత్యంత కీలకమైన డ్రోన్లను సరఫరాచేసే ఓ ప్రముఖ రక్షణ సంస్థ సిఇఒపై హత్యాయత్నం జరిగింది. రష్యా సైన్యం ఉపయోగిస్తున్న శక్తివంతమైన ఉపిర్ ఎఫ్‌పివి డ్రోన్లను తయారుచేసే ఉరల్‌డ్రోన్ జావోడ్ కంపెనీ సిఇఒ వ్లాదిమిర్ త్కాచుక్ లక్ష్యంగా భారీ పేలుడు సంభవించింది. యెకాటెరిన్‌బర్గ్ సమీపంలోని బోల్షోయే ఇస్తోక్ ప్రాంతంలో ఆయన ప్రయాణిస్తున్న మెర్సిడెస్ కారు వెళ్తుండగా ఈ విస్ఫోటనం జరిగింది. కారు కింద ముందే అమర్చిన పేలుడు పదార్థాలు పేలిపోవడంతో ఈ ప్రమాదంజరిగింది. ఈ శక్తివంతమైన పేలుడు ధాటికి మెర్సిడెస్ కారు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా వ్లాదిమిర్ త్కాచుక్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయనను అత్యవసర చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రిలోని ఐసీయూలో చేర్చి వైద్యం అందిస్తున్నారు. ఈ దాడికి ఎవరు ఒడిగట్టారనే దానిపై రష్యన్ భద్రతా ఏజెన్సీలు దర్యాప్తు ప్రారంభించాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం, కారు కింద పేలుడు పదార్థాలను అమర్చారని, మెర్సిడెస్ అతివేగంగా వెళ్తున్నప్పుడు ఈ పేలుడు సంభవించిందని తెలుస్తోంది. దాడి వెనుక ఉన్నవారి గుర్తింపు ఇంకా అధికారికంగా నిర్ధారించబడలేదు. రష్యా ఏజెన్సీలు దర్యాప్తును ప్రారంభించాయి. ఉక్రెయిన్ నుంచి తక్షణమే ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడం గమనార్హం.

ఇదిలా ఉండగా బుధవారం తెల్లవారుజామున కీవ్, పరిసర ప్రాంతాలపై రష్యా జరిపిన క్షిపణి, డ్రోన్ దాడులలో 17 మంది మరణించగా 45మంది గాయపడ్డారు. పలు వ్యాపార సంస్థలు, ఓ రైల్వే స్టేషన్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. రష్యా లక్ష్యాలలో యుద్ధంతో సంబంధం లేని ఒక బ్రూవరీ, నిర్మాణ సామగ్రి గిడ్డంగి, మెయిల్ సార్టింగ్ ఆఫీస్ ఉన్నాయని, ఈ ప్రదేశాలకు యుద్ధంతో ఎలాంటి సంబంధం లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆరోపించారు. అయితే ఆ వ్యాపార సంస్థలకు సైనిక సంబంధాలు ఉన్నాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ చెబుతోంది. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ దాడులు, దాదాపు ప్రతిరోజూ జరుగుతున్న రష్యా భారీ స్థాయి బాలిస్టిక్ క్షిపణి దాడుల పరంపరలో భాగం. అమెరికా పేట్రియాట్ వ్యవస్థకు చెందిన ఇంటర్‌సెప్టర్ క్షిపణుల తీవ్ర కొరతను అవకాశంగా తీసుకుని ఈవేగవంతమైన దాడులు జరుగుతున్నాయి. బాలిస్టిక్ క్షిపణులను కూల్చివేయగల సామర్థ్యం ఉన్న ఉక్రెయిన్ ఏకైక వాయు రక్షణ ఆయుధం పేట్రియాట్ వ్యవస్థ. ఇరాన్ యుద్ధం కారణంగా కొరత ఏర్పడటంతో, జెలెన్స్కీ మరిన్ని మందుగుండు సామగ్రి కోసం ఇతర దేశాలకు విజ్ఞప్తి చేశారు.

## విజయ్ సర్కార్ తొలిబడ్జెట్


### ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక సాయం పెంపు



**చెన్నై, ఆగస్టు 5:** తమిళనాడు ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టింది. విజయ్ టివికె ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ ఇది. తమిళనాడు ఆర్థిక శాఖ మంత్రి ఎన్ మేరీ విల్సన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 2036లోపు తమిళనాడు ఆర్థిక వ్యవస్థను 1.5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పిల్లలు పుడితే వారికి ఒక గ్రామ్ బంగారం అందించే పథకాన్ని కూడా ప్రభుత్వం అమలు చేయనుంది. తాయ్ మామన్ తంగా మోతిరం తిట్టం పథకం కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించే ప్రతి బిడ్డకు 1 గ్రామ్ బంగారు ఉంగరాన్ని అందిస్తారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక సాయాన్ని పెంచనున్నారు. దీనివల్ల 1.93 లక్షల కుటుంబాలకు ప్రతి ఏటా రూ.7,000 వరకు ఆర్థిక సాయం అందిస్తారు. ఇందుకోసం రూ.135 కోట్లు కేటాయించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు అన్నన్ సీర్ తిట్టమ్ అనే పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనికింద వధువుకు 8 గ్రాముల బంగారంతోపాటు ఒక పట్టుచీరను అందిస్తారు. వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్ కింద అర్హులైన పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తారు. రైతులకు విద్యుత్ సబ్సిడీ కింద రూ.7,432 కోట్లు కేటాయించింది. రైతులు, వ్యవసాయ రంగం సంక్షేమానికి రూ.14,984 కోట్లు కేటాయించింది. అరివగం పేరుతో దేశంలోనే మొదటి ఎఐ అండ్ ఇన్నోవేషన్ సిటీని ఏర్పాటు చేస్తారు. అలాగే, తూతుకుడి, తిరునెల్వేలి ప్రాంతాల్ని స్పేస్ ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ జోన్‌గాప్రకటించారు. మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక గ్రూపులకు రూ.38వేల కోట్లు కేటాయించారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందించే హెల్త్ ఇన్సూరెన్స్ స్కీంను రూ.5 లక్షల నుంచి రూ.7.5 లక్షలకు పెంచబోతున్నారు. గరిష్టంగా రూ.12 లక్షలతో మరో హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం కూడా ఉంది. 12 జిల్లాల్లో 12 వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేస్తారు. మధురైలో ప్రత్యేక లా కాలేజీని ఏర్పాటు చేస్తారు. 2027-28 విద్యాసంవత్సరం నుంచి ఇది ప్రారంభమవుతుంది. రాష్ట్రంలో ఉన్నత విద్య కోసం రూ.8,393 కోట్లు కేటాయించారు. అలాగే, కొత్తగా ఐదు ఐటీఐలను ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ స్కూళ్లలో 11వ తరగతి చదివే విద్యార్థులకు హెల్మెట్, లైట్స్, వాటర్ బాటిల్స్‌తో కూడిన సైకిళ్లు అందజేస్తారు.

# సంక్షిప్త వార్తలు

## దుబాయ్‌లో 20 నిమిషాల్లోనే ఏడు పేలుళ్లు



**దుబాయి, ఆగస్టు 5:** యుఎఇలోని దుబాయ్ జెబెల్ అలీ పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున వరుస పేలుళ్లు సంభవించాయి. కేవలం 20 నిమిషాల వ్యవధిలో ఏడు పేలుళ్లు చోటుచేసుకున్నట్లు ఇరాన్‌కు చెందిన వార్తా సంస్థ పేర్కొంది. ఈ ఘటనతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలముకున్నాయి. ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. జెబెల్ అలీ నౌకాశ్రయం సమీపంలోని పారిశ్రామిక ప్రాంతంలో ఈ పేలుళ్లు జరిగినట్టు సమాచారం.


## పంజాబ్‌లో ఉగ్రవాద కుట్రభగ్నం

**అమృత్‌సర్, ఆగస్టు 5:** పంజాబ్ పోలీసులు మరో ఉగ్రకుట్రను భగ్నం చేశారు. ఇటీవలి జంతర్‌మంతర్ నిరసనలను కూడా నిందితులు టార్గెట్ చేసినట్టు గుర్తించారు. మొత్తం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ హ్యాండ్లర్ల సూచనల మేరకు నిందితులు కుట్రపన్నినట్టు పోలీసులు గుర్తించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, విద్యార్థుల నిరసనల సందర్భంగా నిందితులు జంతర్‌మంతర్‌కు వెళ్లినట్టు అధికారులు గుర్తించారు. పోలీసులను, ఇతర భద్రతా సిబ్బందిని టార్గెట్ చేసేలా వారికి పాక్ హ్యాండ్లర్లు శిక్షణ ఇచ్చినట్టు కూడా దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది.

## జార్ఖండ్ నిరసనలకు వాంగ్‌ఛుక్ సంఘీభావం


**రాంచి, ఆగస్టు 5:** జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జెపిఎస్సి), జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జెఎస్ఎస్‌సి), ఇతర పోటీ పరీక్షల్లో అవకతవకలు, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జార్ఖండ్ విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో, మరో ఐదుగురు విద్యార్థులు గతనెల నుంచి చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షకు సిక్కిం నేత వాంగ్‌ఛుక్ మద్దతు ప్రకటించారు. సిక్కిం సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, జార్ఖండ్ విద్యార్థుల నిరసనకు సంఘీభావం ప్రకటించారు. స్టూడెంట్ లీడర్ దేవేంద్రతో బుధవారం వీడియో కాల్‌లో మాట్లాడారు. ఆయన ఆరోగ్యం క్షీణించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

## ఆగస్టు 15ను ఇండియాడేగా ప్రకటించిన మసాచుసెట్స్



**బోస్టన్, ఆగస్టు 5:** అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులకు అరుదైన గౌరవం దక్కింది. మసాచుసెట్స్ రాష్ట్రంలో ప్రతి ఏటా ఆగస్టు 15వ తేదీని ఇండియా డేగా అధికారికంగా జరపాలని ఆ రాష్ట్ర గవర్నర్ మోరా హీలీ ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక, సాంస్కృతిక ప్రగతిలో భారతీయ సమాజం పోషిస్తున్న కీలక పాత్రకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన జారీ చేశారు. 1947లో బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్రం పొంది, ప్రపంచం లోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ ఆవిర్భవించిందని గవర్నర్ తన ప్రకటనలో కొనియాడారు.

## రోడ్డు ప్రమాదాల్లో 1.80 లక్షల మంది మృతి



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** భారత్‌లో ప్రతి యేడాది సగటును సుమారు 1.80 లక్షల మంది రోడ్డు ప్రమాదాలకు లోనవుతున్నట్లు కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. బుధవారం ఆయన రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడారు. చాలా బాధాకరమైన విషయమని, రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి యేడాది ఇండియాలో 1.80 లక్షల మంది మరణిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రమాదాలను తగ్గించే అంశంపై చర్యలు తీసుకోవాలని ఎంపీ సుధామూర్తి ప్రశ్న వేశారు. అందమైన రోడ్లు ఉన్నాయని, కానీ ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని, ఇది రోడ్ల వల్ల కాదు అని, డ్రైవర్లు సరిగా నడపలేకపోవడం వల్లే అని సుధామూర్తి అన్నారు జాతీయ రహదారులపై ప్రమాదాలను తగ్గించేందుకు ఆమె ఓ సూచన చేశారు. డ్రైవింగ్ లైసెన్సు ఇచ్చే ప్రక్రియ మరింత పటిష్టం చేయాలని సుధామూర్తి పేర్కొన్నారు.

# మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయాలి

- కూటమి పాలనలో దిగజారిన పొగాకు రైతు స్థితి • పొగాకు రైతులకు అండగా వుంటా: వైఎస్ జగన్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 5 ప్రభాతవార్త:** మార్కెట్‌ను నియంత్రించి రైతులకు న్యాయమైన ధర అందించాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ పొగాకు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా నేరుగా పొగాకు కొనుగోలు చేయాలని వైఎస్సార్‌సిపి అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. పొగాకు రైతుల సమస్యలను తెలుసుకుని వారికి భరోసా కల్పించేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్‌సిపి అధ్యక్షుడు జగన్ బుధవారం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో పర్యటించారు. దేవరపల్లి పొగాకు బోర్డు ప్రాంగణంలో నిర్వహించిన పొగాకు రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేవరపల్లి శివకళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న జగన్ అక్కడి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి భారీ ర్యాలీగా టొబాకో బోర్డు వరకు వెళ్లారు. అనంతరం పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేలం ప్రక్రియ, మార్కెట్ పరిస్థితులు, పొగాకు ధరలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జగన్ మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. అక్రమాలను ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు నమోదు చేసి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని విమర్శించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని ఆయన పేర్కొన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. పొగాకు రైతులకు సాగు వ్యయం పెరుగుతుండగా ఆదాయం మాత్రం తగ్గిపోతోందన్నారు. గత వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వ హయాంలో పొగాకు కిలోకు రూ.289 వరకు ధర లభించగా, ప్రస్తుతం కేవలం రూ.236 మాత్రమే వస్తోందని తెలిపారు. ఈ ఏడాది పండిన మొత్తం పొగాకులో ప్రభుత్వం సుమారు 12శాతం మాత్రమే కొనుగోలు చేసిందని ఆయన ఆరోపించారు. దాదాపు 83 మిలియన్ కిలోల ఉత్పత్తి నమోదైనా, కొనుగోలు మాత్రం సుమారు 10 మిలియన్ కిలోలకే పరిమితమైందని పేర్కొన్నారు. దీంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. గిట్టుబాటు ధర లేక వెంకటేశ్వరరావు అనే రైతు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని జగన్ విమర్శించారు. గతంలో వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గుర్తించి మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేసి వారికి అండగా నిలిచిందని గుర్తు చేశారు. తిరిగి అవకాశం వస్తే రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే చర్యలు చేపడతామని జగన్ హామీ ఇచ్చారు.

# పొగాకు రైతుల సంక్షేమంపై జగన్‌కి బహిరంగ సవాల్

- వాస్తవాలు, గణాంకాలతో చర్చకు సిద్ధమా జగన్? • రైతుల కోసం చేసింది ఎవరు? మాటలు చెప్పింది ఎవరు? ప్రజల ముందే తేల్చుకుందాం • మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** పొగాకు రైతుల సంక్షేమంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలపై ఆధారపడినవని, రైతులపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే వాస్తవాలు, గణాంకాలతో బహిరంగ చర్చకు రావాలని జగన్ మోహన్‌రెడ్డికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు బహిరంగ సవాల్ విసిరారు. బుధవారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మీడియాతో మాట్లాడుతూ "జగన్ మోహన్‌రెడ్డి గారూ... మీరు పొగాకు రైతుల కష్టాల గురించి మాట్లాడుతున్నారు, కానీ వాస్తవాలు, గణాంకాలతో బహిరంగ చర్చకు రావడం లేదు. రైతులపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే ఈ సవాలును స్వీకరించండి. పొగాకు రైతులు సంక్షోభంలో ఉన్న ప్రతిసారీ వారిని ఆదుకున్నది టిడిపి నాయకత్వంలోని ప్రభుత్వమే. రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రతిసారీ అండగా నిలిచి నిర్ణయాలు తీసుకున్న చరిత్ర టిడిపి ప్రభుత్వానిదే. గత సంవత్సరం బర్లీ పొగాకు రైతుల నుంచి 25 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేసి, సుమారు రూ.280 కోట్లు వెచ్చించడం జరిగింది. 2014-15లో ఎఫ్‌సీవీ పొగాకు ధరలు పడిపోయినప్పుడు, వాణిజ్య పంట అయినప్పటికీ రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రతి కిలోకు రూ.20 ఆర్థిక సహాయం అందించడం



జరిగింది. చరిత్రలోనే ఇది ఒక కీలక నిర్ణయం. అయితే, మీ ప్రభుత్వ హయాంలో 2019లో సుమారు 124 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి కాగా, ధర కిలోకు రూ.121-123కు పడిపోయింది. అయినప్పటికీ మీ ప్రభుత్వం కేవలం 11.8 మిలియన్ కిలోలను మాత్రమే కొనుగోలు చేసి, మిగిలిన రైతులను గాలికి వదిలేసింది. తదుపరి సంవత్సరం సుమారు 128 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అయి, ధర కిలోకు రూ.123కు పడిపోయినప్పటికీ, మీ ప్రభుత్వం ఒక్క కిలో కూడా కొనుగోలు చేయలేదు. రైతులకు ఎలాంటి అదనపు ఆర్థిక సహాయమూ అందించలేదు. పొగాకు ధరల విషయంలో కూడా వాస్తవాలు ప్రజల ముందున్నాయి. 2019లో కేజీ రూ.142, 2020లో రూ.140, 2021లో రూ.161, 2022లో రూ.192, 2023లో రూ.248, 2024లో కూటమి ప్రభుత్వ హయాంలో రూ.326, 2025లో రూ.300 2026లో రూ.275గా ధర ఉందన్నారు ప్రస్తుత సంవత్సరం టొబాకో బోర్డు లక్ష్యం 131 మిలియన్ కిలోలు కాగా, రైతులు సుమారు 241 మిలియన్ కిలోలు ఉత్పత్తి చేశారు. అధిక ఉత్పత్తితో ఇబ్బందులు ఎదురైన రైతులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం వెంటనే ముందుకొచ్చింది. సుమారు 100 మిలియన్ కిలోల పొగాకుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కిలోకు రూ.10 చొప్పున మొత్తం రూ.100 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది. ఈ సహాయం పంపిణీని రేపటి నుంచే ప్రారంభిస్తున్నాం. అంతేకాదు... రాష్ట్ర ప్రభుత్వ సహాయంతోపాటు, కేంద్ర ప్రభుత్వం ప్రతి పొగాకు బ్యారన్‌కు రూ.50వేలు వడ్డీలేని రుణం అందిస్తోంది. ఈ వాస్తవాలన్నింటి తర్వాత కూడా పొగాకు రైతుల గురించి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు జగన్‌కి లేదు. గత ప్రభుత్వ పనితీరు, కూటమి ప్రభుత్వ సహాయంపై గణాంకాలతో బహిరంగ చర్చకు రావాలని మరోసారి సవాలు చేస్తున్నాం. రైతులు గత ప్రభుత్వ పనితీరును, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని పోల్చి చూడండి. ఎవరు రైతులను గాలికి వదిలేశారో, ఎవరు కష్టకాలంలో అండగా నిలిచారో ప్రజలే నిర్ణయిస్తారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

## రేపటి నుండి తిరుపతిలో క్రెడాయి ఎక్స్‌పో

**తిరుపతి, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలోనే వేగంగా విస్తరిస్తున్న ప్రముఖ ఆధ్యాత్మిక నగరం,యాత్రాస్థలం తిరుపతిలో ప్రజలకు సులభంగా క్లియర్ టైటిల్, తుడ అనుమతి పొందిన ఆస్తులను అందుబాటులోకి తెచ్చేందుకు క్రెడాయ్ ఆధ్వర్యంలో తరచూ ప్రాపర్టీ ఎక్స్‌పోలు నిర్వహిస్తున్నారు. ఈనెల 7నుండి 9వతేదీ వరకు మూడురోజులు పాటు తిరుపతిలోని డిబిఆర్ ఆస్పత్రి మార్గంలో శ్రీకన్వెన్షన్ సెంటర్‌లో క్రెడాయి ఎక్స్‌ఫో ఏర్పాటుచేస్తున్నట్లు తిరుపతి చాప్టర్ అధ్యక్షుడు ఎం. రామ్‌ప్రసాద్, ఛైర్మన్ గోపీనాథ్, ప్రధాన కార్యదర్శి ఎ.రాజేష్‌బాబు తెలిపారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ, తిరుపతి నగరంలో అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమ్యూనిటీ ప్రాజెక్టులకు సంబంధించిన సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడంలో క్రెడాయ్ తిరుపతి చాప్టర్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. తిరుపతి నగరానికి చెందిన ప్రముఖ బిల్డర్లు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు, ఆర్థిక సంస్థలు, జాతీయ బ్యాంకులు తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నాయన్నారు. అన్ని రకాల ప్రాజెక్టులకు సంబంధించిన సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడంలో క్రెడాయ్ తిరుపతి చాప్టర్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

# అసత్య ప్రచారాలతో నిరుద్యోగ యువతను మభ్యపెట్టలేరు

- జెన్ జెడ్ పేరుతో డిఎస్సీ-2025 నియామకాలపై తప్పుడు ప్రచారం • ఆర్‌వైఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో డిఎస్సీ నియామకాలపై కొందరు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా ఆధారరహితమైనవని, నిరుద్యోగ యువతలో గందరగోళం సృష్టించడమే వాటి లక్ష్యంగా కనిపిస్తోందని రైట్స్ ఫర్ యూత్ అండ్ స్టూడెంట్స్ ఫోరం(ఆర్‌వైఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు పేర్కొన్నారు. విద్యార్థి, యువజన సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో జెన్ జెడ్ పేరుతో సంవత్సరం క్రితం జరిగిన డిఎస్సీ నియామకాలలో అవకతవకలు జరిగినాయని అసత్య ఆరోపణలు చేస్తూ నిరుద్యోగ యువతను మభ్యపెట్టే ప్రయత్నం చేయడంతో పాటుగా రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతలో అలజడి సృష్టించి పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నం చేస్తున్న కొంతమంది వ్యక్తులు నుండి నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. 2019 నుండి 24 వరకు నాడు అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తాం, డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పి తీరా 2024 ఎన్నికల సమయంలో హడావిడిగా నోటిఫికేషన్ ఇచ్చి డిఎస్సీ ప్రకటించామని గొప్పలు చెప్పుకోవడం సరికాదన్నారు. నాడు ఇవ్వగలమని పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకం చేసిన విధంగా 16300 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ ఇచ్చి 148 రోజుల కాలవ్యవధిలో 243 పైచిలుకు కోర్టు కేసులను న్యాయపరమైన చిక్కులను ఛేదించి ఏకకాలంలో ఉద్యోగాల భర్తీ చేస్తే ఉద్యోగాలు భర్తీ చేశారని గుర్తుచేశారు. నియామకాలైన 14 నెలల తరువాత డిఎస్సీలో అవకతవకలు జరిగాయని రోజుకొక ఆరోపణ చేస్తూ క్రీడల పట్ల ఉద్యోగాల పట్ల ఉద్యోగాల నియామకాల పట్ల రోస్టర్ విధానాల పట్ల అవగాహన లేకుండా అసత్య



విద్యార్థి, యువజన సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వైఎస్ఎఫ్ అధ్యక్షులు రాజేంద్రబాబు

ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. నేడు జెన్ జెడ్ పేరుతో ఆర్టిఫిషియల్ ఉద్యమాలకు తెరతీసిన నాయకులు రాష్ట్ర అధికారులు అన్ని వివరాలు తెలియజేసిన రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్లో గ్రీవెన్స్ జరుగుతున్న ఫిర్యాదులు లేకుండా అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయడానికి సిద్ధంగా ఉన్నా వారి పట్ల ఆలోచించకుండా కేవలం రాజకీయాల కోసం అమాయకమైన నిరుద్యోగులను బలిచేస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే 16 వేల డిఎస్సీ పోస్టులు రద్దు చేస్తామని ప్రకటించడం సరికాదన్నారు. నిరుద్యోగ యువత భావోద్వేగాలతో రాజకీయాలు చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమన్నారు. ఆధారాలు లేకుండా నియామక ప్రక్రియపై సందేహాలు వ్యక్తం చేయడం వల్ల ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల భవిష్యత్తుపైనా అనవసరమైన ఆందోళన ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వ నియామకాలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే వాటిని చట్టబద్ధమైన ఆధారాలతో సంబంధిత అధికారుల ముందు ఉంచాలని, కానీ నిరాధార ప్రచారం చేసి నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఉద్యోగాల కల్పన, పారదర్శక నియామకాలు, ఉపాధి అవకాశాలపై రాజకీయ పార్టీలు నిర్మాణాత్మక చర్చ జరపాలని, యువత ఆకాంక్షలను రాజకీయ వివాదాలకు బలిచేయొద్దని, అసత్య ఆరోపణలను తిప్పి కొట్టాల్సినటువంటి బాధ్యత నేటి యువతపై ఉందని, జరుగుతున్న పరిణామాలపై నిరుద్యోగ యువతను చైతన్యం చేస్తామని పరుచూరి రాజేంద్ర బాబు తెలిపారు.

## తిరుమల సమాచారం



### ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.2 కోట్లు విరాళం

**తిరుమల, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలు అందిస్తున్నారు. బుధవారం హైదరాబాద్‌కు చెందిన ట్రినిటీ కంబైన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టిటిడి వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.2 కోట్లు విరాళంగా అందించింది. ఆ సంస్థకు చెందిన దాతలు ఆర్.సీతారామ్ రెడ్డి, జి.కవిత, త్రినయ్ రెడ్డి, త్రిభువన్ రెడ్డి శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి విరాళం డిడిలను అందజేశారు.



### 21న వరలక్ష్మీ వ్రతం

- తిరుచానూరు ఆలయంలో విస్తృత ఏర్పాట్లు

**తిరుమల, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రావణమాసంలో ఎంతో పవిత్రమైన వరలక్ష్మీవ్రతాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో వేడుకగా నిర్వహిస్తుంది. ఈ నెల 21న జరగనున్న వరలక్ష్మీ వ్రత మహోత్సవం సందర్భంగా పాల్గొనే వేలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు విస్తృతంగా చేపట్టాలని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు అధికారులను ఆదేశించారు. బుధవారం తిరుమలలో చైర్మన్ క్యాంపు కార్యాలయంలో పద్మావతి అమ్మవారి ఆలయ అధికారులు, అర్చకులు చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వరలక్ష్మీ వ్రత మహోత్సవానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ, సక్రమమైన క్యూ లైన్లు, భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో వ్రతంలో పాల్గొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పద్మావతి అమ్మవారి ఆలయం, వ్రతం నిర్వహించే ఆస్థాన మండపాన్ని సుందరమైన పుష్పాలంకరణలతో శోభాయమానంగా అలంకరించి, మహోత్సవానికి తగిన ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులకు పద్మావతి అమ్మవారి ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వచనం అందజేశారు. ఆలయ డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్ పట్టువస్త్రం సమర్పించి అమ్మవారి వరలక్ష్మీవ్రత ఆహ్వానపత్రికను అందజేశారు.

# టిటిడిలో ఊసేలేని అర్చక పోస్టుల భర్తీ

- ఏడుకొండలస్వామి సేవకు అరకొర సిబ్బంది • నిత్యకైంకర్యాలకు డిప్యూటేషన్ భారం

**తిరుమల, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లు తున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి ఆలయంలో నిర్వహించే నిత్య కైంకర్యాల సేవలకు అవసరమైన మేరకు అర్చకులు లేకపోతున్నారు. గత ఐదేళ్ళుగా అర్చకుల కొరత వెంటాడుతున్నా భర్తీ చేయడంపై గత టిటిడి బోర్డు పెద్దలుగానీ, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోని టిటిడి బోర్డు పెద్దలు కూడా దృష్టి పెట్టలేదని అర్చక వర్గాల్లో వాదన వినిపిస్తోంది. ఆపద మొక్కులవాడు.. అనాథ రక్షకుడు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి కలియుగ ప్రత్యక్ష దైవంగా ఖ్యాతిచెందాడు. వైఖానస ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలు, పూజా కార్యక్రమాలు సేవలు జరుగుతాయి. వేకువజామున 3గంటలకు సుప్రభాతసేవతో శ్రీవారిని మేల్కొలిపే సేవ నుండి అర్ధరాత్రి ఏకాంత సేవ వరకు పలు రకాలుగా నిత్య సేవలు, వారాంతపు సేవలు విశేష సేవలు ఆలయంలో వడ్డీకాసుల వేంకటేశ్వరునికి ఎంతో భక్తితో జరిపిస్తుంటారు. ఇలా ఒకటేమిటి వేకువజామున శ్రీనివాసుడికి సుప్రభాతసేవ, తోమాల, అర్చన, నివేదన, కొలువు, ఆస్థానం, శుద్ధి, శాత్తుమొర కైంకర్యాలు జరుగుతాయి. ఆ తరువాత ఉదయం వేళ ప్రతిరోజూ నిత్యకళ్యాణోత్సవం, ఊంజల్‌సేవ, డోలోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవలు నిర్వహిస్తుంటారు. ఈ సేవలన్నిటికీ వైఖానస ఆగమ వైష్ణవ అర్చకులు, నాలుగు కుటుంబాలకు చెందిన ప్రధాన అర్చకులు సేవలందిస్తారు. ఆలయంలోపల మూడు షిప్టుల్లో గర్భగుడిలో ముగ్గురు అర్చకులు, కులశేఖర పడి వెలుపల నలుగురు పరిచారకులు సేవల్లో విధుల్లో నిమగ్నమవుతుంటారు. ఉదయం వేళ సంపంగి ప్రాకారంలో జరిగే కళ్యాణోత్సవం సేవకు ప్రధాన అర్చకులతోబాటు నలుగురు పరిచారకులు విధులు నిర్వహిస్తుంటారు. కొన్నేళ్ళ క్రిందట పరిస్థితులతో ఇప్పటి అవసరాలకు తగ్గట్లు అర్చకుల సంఖ్య తగ్గడం, డిప్యుటేషన్ సమస్యల వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని అర్చక వర్గాల్లో వినిపిస్తోంది. దేవదేవునికి జరిగే నిత్య కైంకర్యాల నిర్వహణలో ఉన్న కొద్దిమంది అర్చకులపై తీవ్రమైన ఒత్తిడి పడుతోందనే మాట వుంది.



తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయానికి చెందిన 17 మంది అర్చకులు పదేళ్ళుగా డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తించడం, వయోభారం, అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న అర్చకులు ఉన్నారనేది తెలుస్తోంది. ఆలయంలో అవసరమైన మేరకు సత్వరమే అర్చకుల ఖాళీలను భర్తీ చేయాలని, లేకపోతే సేవలపై ప్రభావం పడే అవకాశం ఉందని గతంలోనే చేసిన సూచనలు వినిపించుకోవడం లేదనే మాటలు లేకపోలేదు.

**యధావిధిగా నిత్యకైంకర్యాలు:** ఏడుకొండలస్వామి ఆలయంలో కైంకర్యాల నిర్వహణకు కొంతకాలం క్రిందట 60మంది వరకు అర్చకులు పనిచేసేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 40కి పరిమితం కావడంతో గత పదేళ్లుగా తిరుపతిలోని గోవిందరాజ స్వామి ఆలయం నుండి 17మందిని డిప్యుటేషన్‌పై తిరుమలలో వినియో గించుకుంటున్నారు. సేవలకు సరిపడే అర్చకులు లేకున్నా ఉన్న అర్చకులతోనే నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం తిరుమలలో పనిచేస్తున్న అర్చకుల కుటుంబాల నుంచి గతంలో 10మందిని పరీక్షల ద్వారా ఎంపిక చేశారు. ఇంకా పదవీ విరమణ చేసిన 7 పోస్టులు ఖాళీ ఉన్నట్లుగా చెబుతున్నారు. వీటిని కూడా భర్తీ చేస్తే ప్రస్తుతం ఉన్న అర్చకులపై భారం తగ్గుతుందంటున్నారు.

## సినీనటుడు ప్రకాశ్‌రాజ్‌పై చర్యలు తీసుకోండి

- సైబర్ సెల్ డిజికి టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి ఫిర్యాదు



**తిరుమల, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ దేవుళ్లపై అనుచిత పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి కోరారు. దేవుడిపై నోటికొచ్చినట్టు వ్యాఖ్యానించడం ప్రకాశ్‌రాజ్‌కు సరికాదన్నారు. హిందూ దేవుళ్లను నిందిస్తే తోలు తీస్తామని, సామాజిక మాధ్యమాల్లో హిందూ దేవుళ్లను లక్ష్యంగా చేసుకుని అభ్యంతరకర పోస్టులు పెడుతున్న వారిపై, అలాగే సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బిజెపి నాయకులు సైబర్ సెల్ డిజి రవిశంకర్‌కు ఫిర్యాదు చేశారు. మొత్తం 57 మందికి సంబంధించిన వివరాలను సైబర్ పోలీసులకు అందజేశారు. ఫిర్యాదు చేసిన బృందంలో టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి, బిజెపి నేతలు వల్లూరు జయప్రకాశ్, షేక్ బాజీ, శ్రీనివాసరెడ్డి ఉన్నారు. హిందూ సంస్కృతి, సాంప్రదాయాలలో శ్రీరామచంద్రుడిని ఆరాధ్య దైవంగా, లక్ష్మీదేవి, సరస్వతి, సీతాదేవిలను పవిత్ర మాతృమూర్తులుగా భావించి పూజిస్తామని గుర్తుచేశారు. కానీ కొందరు వ్యక్తులు నెట్టింట హిందూ దేవతామూర్తులను ఉద్దేశించి అసభ్యకర రీతిలో నోటికొచ్చినట్లు వ్యాఖ్యానించడం సహించరానిదని మండిపడ్డారు. నటుడు ప్రకాశ్ రాజ్ శ్రీరాముడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. దమ్ము, ధైర్యం ఉంటే ఇతర మతాల్లో జరిగే అన్యాయాలపై మాట్లాడాలని సవాల్ విసిరారు.

## యాళీవాహనంపై కుమారస్వామి దర్శనం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 5 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలోనూ అనుబంధంగా ఉన్న విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో ఆడికృత్తిక మహోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. ప్రతి రోజూ రెండు వాహనాలపై స్వామి అమ్మవార్ల దర్శనం భాగ్యం భక్తులు కల్గుతుంది. బుధవారం ఉదయం బంగారు యాళీ వాహనంపై వల్లిదేవ సేన సమేత సుబ్రమణ్యం స్వామి దివ్యదర్శనం ఇచ్చారు. అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకార గురుకుల్ ముస్తాబు చేయగా, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఇఒ బికె వెంకటేశులు, ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, కుమారస్వామి, ధర్మకర్తల మండలి చైర్మన్ నెమళ్ళూరు బుజ్జి వారి సహచర సభ్యులు హారతులిచ్చి ఊరేగింపుకు శ్రీకారం చుట్టారు. ఆ తరువాత శివయ్య గోపురం, రాజగోపురం నుంచి వాహనాల మండపం వద్దకు చేర్చారు. ఇక్కడ బంగారు యాళీ వాహనంపై ప్రతిష్టించి గ్రామోత్సవానికి తరలించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరి యాదవ్, ఆలయ సిబ్బంది వెంటరాగా ఉత్సవం నాలుగుమాఢ వీధులు, బాబూ అగ్రహారం మీదుగా ఉత్సవం సాగింది.



బంగారు యాళీవాహనంపై కుమారస్వామి దర్శనం

## పరిశ్రమలకు నో పవర్ కట్

- ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో పరిశ్రమలకు విద్యుత్ అంతరాయం రానివ్వొద్దని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పారిశ్రామిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి బుధవారం వినియోగదారులతో సిఎండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పారిశ్రామిక విద్యుత్ సమస్యల పరిష్కారానికై ప్రతినెలా మొదటి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్థ పరిధిలోని 9 జిల్లాల నుంచి 29 మంది పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సమస్యలను వివరించేందుకు తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుండి బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా 23 మంది పారిశ్రామిక వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలపై చర్చిస్తూ, పరిశ్రమలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయాలని, హెచ్‌టి లైన్ మార్పు, బిల్లింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలతో నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నామని, బిల్లింగ్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని వివరించారు. క్షేత్రస్థాయిలో క్షేత్రస్థాయిలో పారిశ్రామిక విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కె.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్లు ఎం.మురళి కుమార్, కె.సంపత్ కుమార్, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, పిఆర్‌ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

### మురుగా.. షణ్ముఖా.. వేలాయుధా..!

## నేడు ఆడికృత్తిక



**శ్రీకాళహస్తి, ఆగస్టు 5 ప్రభాతవార్త:** మురుగా.. షణ్ముఖా.. వేలాయుధా.. వడివేలా.. అప్పనే.. కార్తీకేయ.. చెంగల్వరాయ.. తిరుత్తణి వాసా.. హరోంహరా ఇవన్నీ సుబ్రహ్మణ్య స్వామిని భక్తులు పిలిచే పేర్లు. ప్రతి ఏడాది ఆడికృత్తిక మహోత్సవాలను ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రసిద్ధపుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలోని ఆలయంలోనూ, కుమారస్వామి కొండపై అలాగే తమిళనాడులోని తిరుత్తణితో పాటు, సుబ్రహ్మణ్యస్వామి వెలసిన ఆలయాల్లో ప్రత్యేక పూజలు, వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. నేడు ఆడికృత్తిక మహోత్సవం. శ్రీకాళహస్తి పట్టణంలోని విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రమణ్యస్వామి ఉత్సవాలను వైభవంగా నిర్వహించుటకు శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు.

## సిఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే బొండా ఉమా భేటీ

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన నివాసంలో కలిశారు. ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై ఈ భేటీలో పార్టీ అధినేతకు బొండా ఉమా వివరణ ఇచ్చినట్లు తెలిసింది. ఈ పార్టీలో క్రమశిక్షణే అత్యంత ప్రాధాన్యమైన అంశమని సిఎం స్పష్టం చేసినట్లు సమాచారం. తన ఇద్దరు కుమారులను బొండా ఉమా ముఖ్యమంత్రికి కలిపించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో పేదలకు ఇంటి పట్టాలను పంపిణీ చేసే కార్యక్రమానికి హాజరు కావాలని ముఖ్యమంత్రిని కోరినట్లు బొండా ఉమా తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన సిఎం, త్వరలోనే ఒక తేదీని ఖరారు చేసుకుని పంపిణీకి వస్తానని హామీ ఇచ్చినట్లు వివరించారు.



## కోటి 63 లక్షలతో కట్టుబడిపాళెం అభివృద్ధి

### కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

**బుచ్చి (నెల్లూరు), ఆగస్టు 5 ప్రభాతవార్త:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసినందుకే నేడు ధైర్యంగా ప్రజల ముందుకు వస్తున్నామని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాల్టీలోని కట్టుబడిపాళెంలో రెండేళ్ళు నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.7.26 కోట్లతో పెద్దూరు, పురంధరపురం, రామచంద్రాపురం, కట్టుబడిపాళెం లేవుట్లు, వీకర్స్ సెక్షన్ కాలనీలో త్రాగునీటి సరఫరా పైప్‌లైన్ నిర్మాణపనులకు శంకుస్థాపన చేశారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణి చేశారు. రెండేళ్ళలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్థానికుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకొని వారి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. కట్టుబడిపాళెంలో రూ.1.63 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని వివరించారు. బుచ్చిని గ్రేడ్-2 మున్సిపాల్టీగా అప్‌గ్రేడ్ చేశామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రమేష్, కోవూరు మార్కెటింగ్ చైర్మన్ వంశీకృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, క్లస్టర్ ఇంచార్జి వింజం రామానాయుడు, కట్టుబడిపాళెం నాయకులు రోశయ్య, రమాదేవి, సీనియర్ నాయకులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు బత్తల హరికృష్ణా, కమీషనర్ చిన్నబాబు, కౌన్సిలర్ నాగరాజు, కౌన్సిలర్ శ్రీదేవి, కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, సుమన్ తాళ్ళ నరసింహస్వామి, ఇందుకూరుపేట నాయకులు వీరేంద్ర చౌదరి, దుగ్గిశెట్టి హరినాద్, జనసేన నాయకులు శ్రీనివాసులురెడ్డి, బిజెపి నగర అధ్యక్షులు రామిశెట్టి కళ్యాణ్ టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి పోలీసు కస్టడీ

### నేటి నుంచి విచారణ

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** సహచర మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైల్లో వున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి రెండు రోజుల పోలీసు కస్టడీ ఇస్తూ ఉప్పర్‌పల్లి కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఉదయ్ కృష్ణారెడ్డిని వారం రోజుల కస్టడీకి ఇవ్వాలని ఈ కేసును విచారిస్తున్న అత్తాపూర్ పోలీసులు కోరగా దీనిని డిఫెన్స్ న్యాయవాది వ్యతిరేకించారు. సహచర ట్రైనీ మహిళా అధికారిపై లైంగిక వేధింపులతో పాటు మరో ఇద్దరు మహిళలను కూడా ఉదయ్ కృష్ణారెడ్డి ఇదే విధంగా వేధించినట్లు పిపి కోర్టుకు తెలిపారు. అశోక్‌నగర్‌లో అతని గదిలో దీనికి సంబంధించి కొన్ని ఆధారాలు లభ్యమయ్యాయని, బాధితుల వాంగ్మూలం కూడా వుందని ఆయన వెల్లడించారు. ఇరువర్గాల వాదనలు విన్న ఉప్పర్‌పల్లి కోర్టు ఉదయ్ కృష్ణారెడ్డిని రెండు రోజుల పోలీసు కస్టడీ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం నాడు అతన్ని పోలీసులు చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీలోకి తీసుకుని అత్తాపూర్ పోలీసు స్టేషన్‌తో పాటు మహిళా భద్రతా విభాగం కార్యాలయంలో విచారించనున్నారు. దీంతో పాటు అశోక్‌నగర్‌లోని అతను వుండే గది వద్దకు తీసుకువెళ్లి విచారించే వీలుంది. శుక్రవారం సాయంత్రం అతన్ని తిరిగి జైలుకు తరలించనున్నారు. మరోవైపు జాతీయ పోలీసు అకాడమి అధికారులు ఇచ్చిన నోటీసులకు ఉదయ్ కృష్ణారెడ్డి సరైన సమాధానం ఇవ్వలేదని తెలిసింది. తాను ఎలాంటి తప్పులు చేయలేదని, తనపై అనవసరంగా కేసు నమోదు చేశారని తన న్యాయవాదితో ఉదయ్ కృష్ణారెడ్డి సమాధానం పంపినట్లు తెలిసింది. దీనిపై అకాడమి అధికారులు మౌనం వహించారు.



# కొత్త రోడ్లతో పిఠాపురం కళకళ

- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో గ్రామీణ రోడ్లకు మహర్దశ
- రూ.207 కోట్లతో 307 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణ ప్రణాళిక
- రెండేళ్లలో రూ.100 కోట్లతో 611 రోడ్ల నిర్మాణం పూర్తి
- పురోగతిలో మరో 70 రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం - బడి, గుడి, ఆసుపత్రులను అనుసంధానిస్తూ రహదారులు
- తీర ప్రాంత మత్స్యకార కాలనీల్లో సిసి రోడ్ల వెలుగులు
- వరుస తుపాన్లకు కొట్టుకుపోయిన అమరవిల్లి రోడ్డు పునరుద్ధరణ
- 8 వేల మంది ప్రయాణ కష్టాలు తీర్చిన కొండెవరం రోడ్డు నిర్మాణం
- పల్లెపండుగ 2.0 ద్వారా పంట చేల మధ్య డొంక రోడ్ల నిర్మాణం

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త ప్రతినిధి:** పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఇచ్చిన మాటను నిలుపుకొంటూ, పలు గ్రామాలకు దశాబ్దాల రహదారి సమస్యలు తీర్చిన ఉపముఖ్యమంత్రి పల్లె నుంచి పట్టణం వరకు రహదారుల నిర్మాణ ప్రణాళికలను ముందుకు తీసుకువెళ్తున్నారు. డి.సిం.ఒ విడుదల చేసిన సమాచార పత్రాన్ని అనుసరించి పవన్ కల్యాణ్ తన నియోజకవర్గవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా నిధులు కేవలం రోడ్ల నిర్మాణానికే వెచ్చించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సాస్కీ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖల నిధులతో 307 కిలోమీటర్ల కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టారు. అందులో ఇప్పటికే రూ.100 కోట్ల విలువైన 611 రోడ్ల నిర్మాణం పూర్తయ్యింది. వీటి పొడుగు సుమారు 152 కిలోమీటర్లు. మరో 70కి పైగా రోడ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. నిర్ణీత లక్ష్యాల్లో 80 శాతం కొత్త రోడ్ల నిర్మాణం పూర్తి కావడంతో పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా పల్లెలు, పట్టణాల్లో రోడ్లన్నీ కళకళలాడుతున్నాయి. స్థానిక శాసన సభ్యుని హోదాలో ప్రజలు అడిగిన ప్రతి రోడ్డునీ డీసీఎం మంజూరు చేశారు. పలు రోడ్లు ప్రజల అవసరాలకు అనుగుణంగా నిర్మిస్తే.. మరికొన్ని రోడ్లు అన్నదాత సౌలభ్యం కోసం, ఇంకొన్ని రోడ్లు మత్స్యకారులకి సౌకర్యం కల్పించేందుకు నిర్మించారు. ఉప్పాడ తీర ప్రాంతంలో జెట్టీకి వెళ్లే రహదారి బురదమయంగా ఉంటూ మత్స్యకారులు వేటాడిన సరుకు రవాణా చేసేందుకు పడుతున్న ఇబ్బందులు చూసి, అక్కడ గ్రావెల్ రోడ్డు నిర్మించారు

అలల కోతకు సముద్ర గర్భంలో కలసిపోయిన ఉప్పాడ తీర ప్రాంతం మాయాపట్నం మత్స్యకారులకు 13 ఏళ్ల క్రితం సుబ్బంపేట సమీపంలో కొత్త మాయాపట్నం కాలనీ పేరిట పునరావాసం కల్పించారు. ఇళ్లు అయితే కట్టించి ఇచ్చారుగానీ, మౌలిక వసతుల కల్పన మరిచారు. ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ పెట్టి రూ. 1.52 కోట్లతో కాలనీ మధ్య 1.5 కి.మీ. సీసీ రోడ్లు, 2.8 కిలోమీటర్ల డ్రెయినేజీ నిర్మించారు. డీసీఎం నేడు కాలనీ మొత్తం కొత్త రోడ్లతో వెలుగులీనుతోంది. ఈ కాలనీకి సమీపంలో ఉన్న మరో పునరావాస కాలనీ కొత్తసూరాడపేట. 330 మంది నివసించే ఈ కాలనీకి రూ. 93 లక్షలు వెచ్చించి 1.6 కి.మీ. సిమెంటు రోడ్లు నిర్మించారు. సుబ్బంపేట-కొత్తపల్లి ప్రధాన రహదారికి అనుసంధానించారు.





తుపాను వచ్చి రోడ్డును తుడిచిపెడితే.. యు.కొత్తపల్లి మండల పరిధిలోని అమరవిల్లి గ్రామం, రామన్నపాలెం బీచ్ రోడ్డు తుపాన్లు, భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిని ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఉప ముఖ్యమంత్రివర్యుల చొరవతో రూ.88 లక్షల వ్యయంతో ఈ రోడ్డు పునర్నిర్మాణం పూర్తి చేశారు. 2 వేల మందికి ప్రయాణ సౌకర్యం ఏర్పడిన ఈ రోడ్డుతో బషీర్ బీబీ ఆలయ దర్శనానికి వెళ్లే భక్తులకు సౌకర్యం ఏర్పడింది. అభివృద్ధికి దూరమైన ఎస్ఈజెడ్ పరిధిలోని ముమ్మిడివారిపాడు గ్రామానికి రూ. 79.70 లక్షలతో శాశ్వత రహదారి సౌకర్యం కల్పించారు. ఎస్ఈజెడ్ పరిధి నుంచి విముక్తి కల్పించి మరీ అభివృద్ధి చేశారు. కొత్తపల్లి గ్రామ ప్రజల చిరకాల వాంఛ అయిన శ్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం కల్పిస్తూ, అంత్యక్రియలకు వెళ్లే ప్రజల ఇబ్బందులు తొలగిస్తూ, రూ. 26.30 లక్షల వ్యయంతో 411 మీటర్ల సిసి రోడ్డును ఈ మార్గంలో నిర్మించారు. ఈ రోడ్డు ద్వారా 4 వేల మంది ప్రత్యక్ష ప్రయోజనం పొందుతున్నారు.

యు.కొత్తపల్లి మండల పరిధిలోని కొండెవరం గ్రామ పంచాయతీకి అనుసంధానంగా ఉన్న పిఠాపురం, ఉప్పాడ ఆర్ అండ్ బీ రోడ్డు ఏడు సంవత్సరాల క్రితం పూర్తిగా దెబ్బతింది. గత ప్రభుత్వం ఆ రోడ్డు నిర్మాణాన్ని నిరక్ష్యం చేయడంతో సుమారు 8 వేల మంది పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రూ. 1.22 కోట్ల ఉపాధి నిధులతో 3.17 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణాన్ని ఉప ముఖ్యమంత్రి చేయించారు. ఈ రోడ్డు విద్యార్థులు, రైతులతో పాటు రోజువారీ వ్యాపారాలు నిర్వహించుకునే వందలాది మంది ప్రయాణ కష్టాలు తీర్చింది

సార్వత్రిక ఎన్నికలకి ముందు, తర్వాత పవన్ కళ్యాణ్ వచ్చిన వినతుల్లో అత్యధికంగా రోడ్ల కోసమే వచ్చాయి. గోతుల మయంగా ఉన్న రహదారుల్లో ప్రయాణం నరకప్రాయంగా మారిందని పిఠాపురం నియోజకవర్గ ప్రజలు పలు సందర్భాల్లో వినతిపత్రాలు అందజేశారు. గొల్లప్రోలు మండలం, వెన్నెపూడి గ్రామం నుచి జీఎస్టీ రోడ్డుకు వెళ్ల ప్రధాన రహదారి పూర్తిగా పాడై రెండు దశాబ్దాలు గడచింది. ఈ రోడ్డుతో సుమారు 3,800 మంది నిత్యం ప్రయాణ కష్టాలు అనుభవిస్తున్న దుస్థితి. ఈ క్రమంలో డి.సిఎం రూ.85 లక్షల పల్లెపండగ నిధులతో ఈ రోడ్డుకు మోక్షం కల్పించారు. 1.60 కిలోమీటర్ల మేర నిర్మించిన ఈ రోడ్డు వన్నెపూడి గ్రామస్తులతో పాటు పంట పొలాలకు వెళ్లే రైతులకు కూడా సౌకర్యం ఏర్పడింది. 15 ఏళ్ల క్రితం పాడైన గొల్లప్రోలు, తాటిపర్తి పుంత రోడ్డు పరిస్థితి అంతే. రూ. 1.46 కోట్లతో 2.90 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును నిర్మించగా, వందలాది మంది ప్రజలతో పాటు రైతులకి కూడా ప్రయాణ కష్టాలు తగ్గాయి. కొడవలి గ్రామం మధ్యన ఉన్న 370 మీటర్ల ప్రధాన రహదారిపై సిమెంటు రోడ్డు నిర్మాణం 4 వేల మందికి ఊరటనిచ్చింది.

రూ.3 కోట్లు వెచ్చించి నిర్మించిన 1,500 మీటర్ల సీసీ రోడ్లతో చిత్రాడ గ్రామంలోని ఈబీసీ కాలనీ వాసుల కష్టాలు తీరాయి. రోడ్లతో పాటు ఆధునిక డ్రైనేజీని నిర్మించారు. అదే చిత్రాడలో విద్యార్థుల భద్రత కోసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.50 లక్షలతో ప్రహరీ గోడ నిర్మించారు.

**పల్లెపండుగ 2.0లో డొంక రోడ్లకు ప్రాధాన్యత:** విబి జి రాం జి నిధులతో చేపట్టిన పల్లెపండగ 2.0 కార్యక్రమంలో అన్నదాతకు ప్రత్యేక స్థానం కల్పించారు. రైతులు పండించిన సరుకును రవాణా చేసేందుకు వీలుగా పంట పొలాల మధ్య డొంక రోడ్ల నిర్మాణం చేపట్టారు. పి.రాయవరం, బి.ప్రత్తిపాడు పుంత గ్రామాల్లో దాదాపు రూ. కోటికి పైగా వెచ్చించి మూడు కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్లు నిర్మించారు. తద్వారా దాదాపు 200 ఎకరాలకు పైగా పొలాల మధ్యకు రహదారి సౌకర్యం ఏర్పడింది. పిఠాపురం నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షలో భాగంగా కొత్త రోడ్ల నిర్మాణం, పాత రోడ్ల మరమ్మతులు తదితర అంశాలపై ఉపముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. నిర్మాణం జాప్యం జరిగిన 70 కిలోమీటర్ల పెండింగ్ రోడ్లు నిర్ణీత గడువు లోపే పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు.

# దుర్గమ్మకి వైభవంగా ఆషాఢం సారె



**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 5 ప్రభాతవార్త:** శ్రీ కనకదుర్గమ్మని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర, సారెలతో ఇంద్రకీలాద్రికి భక్తులు తరలి వచ్చారు. ఆషాఢ సారె 22వ రోజు బుధవారం శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో మహిళల రద్దీ విశేషంగా పెరిగింది. సాయంత్రం 5 గంటల వరకు 44 సారె బృందాలు రాగా, సదరు బృందాలలో 18904 మంది భక్తులు సారె సమర్పణకు వచ్చారు. సారె బృందాలకు ఉచిత దర్శనం, ఆశీర్వచనం అందించారు.

**శ్రీదుర్గమ్మకి విజయవాడ సిపి ఆషాఢం సారె:** బెజవాడ దుర్గమ్మకి విజయవాడ పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబు దంపతులు బుధవారం ఆషాఢం సారెను సమర్పించారు. ఆషాఢం సారెతో ఆలయానికి చేరుకున్న సిపి దంపతులకు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ వికె శీనా నాయక్, పాలకమండలి, ఆలయాధికారులు, వేదమంత్ర పఠనోచ్ఛారణతో మంగళవాయిద్యాలతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజాదికాలు జరిపిన అనంతరం 6వ అంతస్తులో శ్రీ అమ్మవారికి సారెను సమర్పించారు. ఈ సందర్భంగా సిపి దంపతులకు దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

**శ్రీదుర్గమ్మకి సెక్యూరిటి సిబ్బంది ఆషాఢం సారె:** అమ్మలగన్నమ్మ బెజవాడ శ్రీ దుర్గమ్మకి



ఆలయంలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది ఆషాఢం సారెను అంగరంగ వైభవంగా బుధవారం సమర్పించారు. ఆలయ సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న ఏజైల్ సెక్యూరిటి సిబ్బంది వైభవోపేతంగా శ్రీ అమ్మవారి రూపును తలపై పెట్టుకుని ఆషాఢం సారెను ఊరేగింపుగా ఆలయానికి తీసుకురాగా అక్కడ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ వికె శీనా నాయక్, వేదపండితులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి సన్నిధికి తీసుకెళ్లగా అక్కడ ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. ఆషాఢం సారెను 6వ అంతస్థులోని శ్రీ అమ్మవారికి సారెను సమర్పించారు. ఈ సందర్భంగా వారికి దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

**భక్తుల విరాళాలు:** శ్రీదుర్గమ్మకి బుధవారం మొత్తం 4గురు దాతలు విరాళాలు అందించారు. విజయవాడకు చెందిన నూతంకి అజయ్ కుమార్ దంపతులు రు.1,23,456ల విరాళాన్ని అందించారు. అలాగే విజయవాడకు చెందిన సాయిసుమ, హేమచంద్ర దంపతులు రు,1లక్ష విరాళాన్ని బుధవారం నిత్యాన్నదాన పథకానికి విరాళంగా అందించారు.

విజయవాడకు చెందిన పి యుగంధర్ దంపతులు రు.1,01,116ల విరాళం నిత్యాన్నదాన పథకానికి అందించారు. వేద రక్షణ ట్రస్ట్‌కు రు.1లక్ష విరాళాన్ని హైదరాబాద్‌కు చెందిన జిబి శాస్త్రి, గొల్లపూడి ప్రశాంతి, సక్కుబాయి, చరిత్ అవీష్కర్ కుటుంబ సభ్యులు లక్ష్మీ నాగ అపరాజిత లు అందించారు. ఆయా దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.




## అమరావతి పుస్తకం కాదు... ఆంధ్రుల ఆత్మగౌరవానికి చిరునామా

### కేంద్ర మంత్రి ఖట్టర్‌కు 'అమరావతి' పుస్తకం అందజేసిన ఎంపిల బృందం

**విజయవాడ, ఆగస్టు 5 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి చరిత్ర, ప్రజల పోరాటం, పునర్నిర్మాణ సంకల్పాన్ని ప్రతిబింబించే 'అమరావతి: ప్రజలచే నిర్మించబడింది... విధిచే రక్షి ంచబడింది' పేరుతో రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను కేంద్ర విద్యుత్, గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మోహన్‌లాల్ ఖట్టర్‌కు ఎపి కూటమి ఎంపీల బృందం బుధవారం మర్యాదపూర్వకంగా అందజేసింది. పార్లమెంట్‌లోని మంత్రి ఖట్టర్ కార్యాలయంలో విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలోని ఎంపిల బృందం బుధవారం ఆయనను కలిసి అమరావతి నిర్మాణ గాథను ప్రతిబింబించే ఈ కాఫీ టేబుల్ బుక్‌ను అందించింది. ఈ సందర్భంగా విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం, రైతులు- మహిళలు సాగించిన 1,631 రోజుల ఉద్యమం, 2024 జూన్ 2న అమరావతిని రాష్ట్ర రాజధానిగా పునరుద్ధరించిన చారిత్రక నిర్ణయం వంటి అంశాలను ఈ పుస్తకం కళ్లకు కట్టినట్లు వివరిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ఎన్‌డియే ప్రభుత్వ సహకారంతో అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా, సంపద సృష్టి, ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ఎంపిల బృందం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చిన్ని పేర్కొన్నారు. విజయవాడ ప్రాంతంలోని పలు సమస్యలను సైతం కేంద్రమంత్రి ఖట్టర్ దృష్టికి ఎంపి చిన్ని తీసుకువెళ్లారు దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు చిన్ని తెలిపారు.

## సహకార బ్యాంకింగ్‌లో సంస్కరణలు

- రుణ పర్యవేక్షణా విధానం నవీకరణ
- రుణాల వడ్డీ రేట్లకు ఏకీకృత నియంత్రణ
- ఫ్రేమ్‌వర్క్ అమలుకు మార్గదర్శకాలు
- రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** సహకార రంగంలో గత 18 సంవత్సరాలుగా వచ్చిన నిర్మాణాత్మక, నియంత్రణ మార్పులకు అనుగుణంగా గ్రామీణ సహకార బ్యాంకుల రుణ పర్యవేక్షణ విధానాన్ని నవీకరించేందుకు సంస్కరణలు అమలు చేయాలని రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. సహకార బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ చర్యలను ప్రకటించింది. ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) ముగింపు సమావేశంలో బుధవారం ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వీటివి వరాలను వెల్లడించారు. రుణరేట్లలో పారద ర్శకతను మెరుగుపరచడం, వినియోగదారుల రక్షణను పెంపొందించడం కోసం, అన్ని నియంత్రిత సంస్థలలో రుణాలపై వడ్డీ రేట్ల కోసం ఒక ఏకీకృత నియంత్రణ చట్రాన్ని కూడా ప్రతిపాదించినట్లు తెలిపారు. సహకార బ్యాంకింగ్ రంగం కోసం తీసుకుం టున్న చర్యలలో భాగంగా, లైసెన్సింగ్ ఫ్రేమ్ వర్క్‌పై గతంలో విడుదల చేసిన చర్చా పత్రంపై అందిన అభిప్రాయాల ఆధారంగా, పట్టణ సహకార బ్యాంకుల (యూసీబీ) లైసెన్సింగ్‌ను పునఃప్రారంభించేందుకు ముసాయిదా మార్గద ర్శకాలను జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా, 2008లో చివరిసారిగా సవరించబడిన గ్రామీణ సహకార బ్యాంకుల రుణ పర్యవేక్షణ ఏర్పాటుపై సమగ్ర సమీక్ష చేపట్టిన అనంతరం కేంద్ర బ్యాంకు ముసాయిదా ఆదేశాలను కూడా జారీ చేస్తుందన్నారు. సంవత్సరాలుగా పొందిన అనుభవంతో పాటు, ప్రస్తుత వ్యవస్థను అమలులోకి తెచ్చినప్పటి నుండి బ్యాంకింగ్ రంగంలో జరిగిన పరిణామాలను కూడా ఈ సమీక్ష పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. గత 18 ఏళ్లుగా ఈ రంగంలో వచ్చిన నిర్మాణాత్మక మరియు నియంత్రణ మార్పులకు అనుగుణంగా గ్రామీణ సహకార బ్యాంకుల రుణ పర్యవేక్షణ విధానాన్ని నవీకరించడమే లక్ష్యంగా వెల్లడించారు. దీనికి అదనంగా, అన్ని నియంత్రిత సంస్థలలో రుణాలపై వడ్డీ రేట్లను నియంత్రించే నియంత్రణ విధానాన్ని సమన్వయం చేసి, ప్రామాణీక రించాలని నిర్ణయించినట్లు వివరించారు. యూసీబీ లైసెన్సింగ్‌పై చర్చలో వచ్చిన అభిప్రాయాల ఆధారంగా, పట్టణ సహకార బ్యాంకుల లైసెన్సింగ్‌ను పునఃప్రారంభించడానికి ఆర్‌బిఐ ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేస్తుందని మల్హోత్రా పేర్కొన్నారు. రుణ రేట్లలో పారదర్శకతను మెరుగుపరచడం, రుణ విధానాలలో మరింత స్థిరత్వాన్ని నిర్ధారించడం, వినియోగదారుల రక్షణను బలోపేతం చేయడం ఈ చర్య యొక్క లక్ష్యంగా పేర్కొన్నారు.

# ఎర్రసముద్రంలో కార్గోనౌకపై దాడి

### సముద్రంలో మునిగిపోయిన నౌక.. భారత్ నావికులు సురక్షితం

**సనా, ఆగస్టు 5:** యెమెన్ తీరానికి సమీపంలోని ఎర్ర సముద్రంలో భారత్‌కు చెందిన కార్గో నౌకపై ప్రాజెక్టైల్‌తో దాడి జరగడంతో నౌక బోల్తా పడి సముద్రంలో మునిగిపోయింది. ఈ ఘటనలో నౌకలో ఉన్న మొత్తం 14 మంది సిబ్బందిని యెమెన్ కోస్ట్ గార్డ్ సురక్షితంగా రక్షించింది. వారిలో 13 మంది భారతీయ నావికులు ఉన్నారు. రక్షించిన సిబ్బందిని మోఖా పోర్టుకు తరలించారు. భారత్‌కు చెందిన వాణిజ్య నౌక ఎంఎస్‌వి ఫైజ్ నూర్ ఒలియాపై జరిగిన దాడిని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. ఈనెల 4న యెమెన్ తీరానికి సమీపంలోని ఎర్ర సముద్రంలో నౌక మునిగిపోయిందని విదేశాంగశాఖ వెల్లడించింది. నౌకలో ఉన్న 13 మంది భారతీయులను సురక్షితంగా రక్షించినట్లు తెలిపింది. సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని, నౌక సిబ్బంది భద్రత కోసం యెమెన్ అధికారులతో సమన్వయం చేస్తోందని లీనితి పేర్కొంది. సిబ్బందిని సురక్షితంగా రక్షించినందుకు యెమెన్ అధికారులకు భారత ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది.

ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకలపై వరుసగా జరుగుతున్న దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని విదేశాంగశాఖ తెలిపింది. అంతర్జాతీయ జలమార్గాల్లో స్వేచ్ఛాయుత, ఎలాంటి ఆటంకాలు లేని నౌకాయానం, వాణిజ్యం కొనసాగేందుకు పరిస్థితులను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని స్పష్టం చేసింది. భారతీయ

**నావికుల భద్రతపై కేంద్రం దృష్టి**

కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ఈ ఘటనపై స్పందించారు. ఈ ప్రాంతంలో ఉన్న భారతీయ నావికుల భద్రతకు తక్షణ చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ మారిటైమ్ అడ్మినిస్ట్రేషన్‌ను ఆదేశించినట్లు తెలిపారు. అన్ని సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకుంటూ భారతీయ నావికుల భద్రతను నిర్ధారించాలని, రక్షించిన సిబ్బందికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు.

వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖం డించింది. అంతర్జాతీయ సముద్ర రవాణా భద్ర తను కాపాడటంతో పాటు ప్రపంచ వాణిజ్యానికి ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని పక్షాలు తమ అంతర్జాతీయ బాధ్యతలను పాటించాలని విదేశాంగశాఖ పిలుపునిచ్చింది.

### పెట్టుబడుల మోసం కేసులో పట్టుబడ్డ విశాఖ రాథోడ్

## దుబాయ్ నుంచి భారత్‌కు తరలించిన సిబిఐ

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** కోట్లాది రూపాయల పెట్టుబడుల మోసం కేసులో మూడేళ్లుగా పరారీలో వున్న వాంటెడ్ క్రిమినల్ విశాఖ రాథోడ్ ఎట్టకేలకు పట్టుబడింది. ఈ కేసులో ఈమె భర్త అవినాష్ రాథోడ్‌ను ఇంతకు ముందే దుబాయ్ నుంచి తరలించగా తాజాగా విశాఖ రా థోడ్‌ను ఇదే క్రమంలో దుబాయ్‌లో పట్టుకుని భారత్‌కు తీసుకువచ్చారు. దీంతో ఈ కేసు విచారణ వేగం పుంజుకోనుంది. మహారాష్ట్రలోని పూ ణెకు చెందిన అవినాష్ రాథోడ్, విశాఖరాథోడ్ దంపతులు 2023లో పెట్టుబడుల పేరిట దేశ వ్యాప్తం గా అనేక మందిని 88కోట్ల రూపాయలకు పైగా మోసం చేశారు. తాము సూ చించిన కంపెనీల్లో పెట్టుబడులు పెడితే దండిగా లాభాలు వస్తాయని నమ్మించి వందలాది మ ందిని వీరు నిం డా ముంచారు. ఈ దంపతులు చెప్పినట్లుగా పెట్టుబడులు పెట్టిన వారు నిండా మునిగిన తరువాత పూణెలోని చతుర్శ్రింగి పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీని తరువాత ఈ అవినాష్ రాథోడ్, విశాఖ రాథోడ్ దంపతులు పారిపోయారు. వీరి కోసం దేశ వ్యాప్తంగా గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ కేసు తీవ్రత దృష్ట్యా సిబిఐ రంగంలో దిగింది. చివరకు వీరు దుబాయ్‌లో వున్నట్లు సమాచారం అందుకు న్న సిబిఐ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. అనంతరం గత ఏప్రిల్ నెలలో అవినాష్ రాథోడ్‌ను విదేశాంగ శాఖ సహకారంతో దుబాయ్‌లో అ రెస్టు చేసి భారత్‌కు తరలించారు. తాజాగా వారం రోజుల విశాఖ రాథోడ్‌ను కూడా దు బాయ్ నుంచి అరెస్టు చేసి తీసుకువచ్చారు. వీరు దోచిన డబ్బులను తమ సొంత అవసరాలకు వాడుకున్నట్లు మహారాష్ట్ర పోలీసులు తేల్చారు.

# కృష్ణ-పృథ్వీ సంచలనం



**న్యూఢిల్లీ:** భారత జంట కృష్ణ గరగ ప్రసాద్-పృథ్వీ కృష్ణమూర్తి రాయ్ కొరియా మాస్టర్స్‌లో అతిపెద్ద సంచలనం సృష్టించారు. పురుషుల డబుల్స్ పోటీలో అగ్రశ్రేణి థాయ్ జంట చలోఎంపోన్ చరోయెన్‌కిటమోర్న్-వొర్రాపోల్ థోంగ్సా ంగాను ఓడించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. ఈ ఈవెంట్‌లో పోటీపడిన సీడింగ్ లేని ఈ భారత జంట, 42 నిమిషాల్లో జరిగిన పోరులో 21-16, 21-18 తేడాతో విజయాన్ని నమోదు చేసింది. దీంతో ఈ జోడీ ఇప్పుడు తమ రెండో రౌండ్‌కు చేరుకుంది. ఇక మిగిలిన భారత బృందానికి మిశ్రమ ఆరంభం లభించింది. పురుషుల డబుల్స్ మొదటి రౌండ్‌లోనే దొడ్డవరపు అచ్యుతాదిత్యరావు-పోచన అర్జున్‌రెడ్డి ద్వయం కొరియాకు చెందిన చోయ్ సోల్ గ్యూ-మలేషియాకు చెందిన గో వి షెమ్‌ల చేతిలో 3-21, 10-21 తేడాతో ఓడిపోయి టోర్నమెంట్ నుండి నిష్క్రమించారు. మహిళల డబుల్స్‌లో, జపాన్‌కు చెందిన రెండో సీడెడ్ జోడీ రిరినా హిరామోటో-కోకోనా ఇషికావాల చేతిలో 15-21, 13-21 తేడాతో ఓటమి పాలైన ప్రియా కొంజెంగ్‌బామ్, శృతి మిశ్రాలు కూడా టోర్నమెంట్ నుండి నిష్క్రమించారు. పురుషుల సింగిల్స్ క్వాలిఫైయర్స్‌లో, తుషార్ సువీర్ కెనడాకు చెందిన శౌర్య గుల్లయ్యపై 21-15, 21-12 తేడాతో ఘనవిజయంతో ప్రారంభించాడు, కానీ తదుపరి క్వాలిఫైయింగ్ రౌండ్‌లో జపాన్‌కు చెందిన షోగో ఒగావా చేతిలో 10-21, 17-21 తేడాతో ఓడిపోవడంతో మెయిన్ డ్రాకు అర్హత సాధించలేకపోయాడు.

# కొరియా మాస్టర్స్.. తొలి రౌండ్‌లో తన్వి గెలుపు




**న్యూఢిల్లీ:** భారత్ టీనేజ్ షట్లర్ తన్వి శర్మ చైనాకు చెందిన యువాన్ అన్ క్విని ఓడించి కొరియా మాస్టర్స్ 2026 రెండవ రౌండ్‌లోకి ప్రవేశించగా, పురుషుల సింగిల్స్‌లో ఇజ్రాయెల్‌కు చెందిన డానిల్ దుబోవెంకో చేతిలో మాజీ ప్రపంచ ఛాంపియన్ భారత్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్‌తో ఓటమితో టోర్నీ నుండి నిష్క్రమించాడు. 17 ఏళ్ల మూడో సీడ్ టీనేజ్ క్రీడాకారిణి తన్వి బుధవారం ఆసన్‌లో జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌కు చేరుకోవడానికి చైనాకు చెందిన యువాన్ అన్ క్విని 21-16, 21-15 తేడాతో ఓడించింది. చైనీస్ తైపీకి చెందిన పై యుపోను 21-15, 21-14 తేడాతో ఓడించిన శ్రియాంశి వాలిశెట్టితో ఈ భారతీయ టీనేజర్ తదుపరి తలపడనుంది. మహిళల సింగిల్స్‌లో కూడా భారత్ మరో విజయాన్ని నమోదు చేసింది. మాన్సీ సింగ్ వెనుకబడినప్పటికీ పుంజుకుని దక్షిణ కొరియాకు చెందిన కిమ్ జూ యున్‌ను 14-21, 21-19, 21-9 తేడాతో ఓడించింది. ఇక పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఇజ్రాయెల్‌కు చెందిన డానిల్ దుబోవెంకో చేతిలో 22-20, 21-14, 21-12 తేడాతో ఓడిపోవడంతో, కిదాంబి శ్రీకాంత్ కొరియా మాస్టర్స్ 2026 ప్రయాణం తొలి అడుగులోనే ముగిసింది. శ్రీకాంత్ తన లయను కనుగొనడానికి చాలా ఇబ్బంది పడి పునరాగమనం చేయలేకపోయాడు, దీంతో దుబోవెంకో ఈ పోటీని సునాయాసంగా ముగించాడు. ఈ ఓటమితో సూపర్ 300 ఈవెంట్‌లో శ్రీకాంత్ ప్రస్థానం ముగియగా, భారత పురుషుల సింగిల్స్ ఆశలకు గట్టి దెబ్బ తగిలింది.

## వన్డే ప్రపంచకప్..
# ఫిబ్రవరి 22 నుండి క్వాలిఫైయర్స్ మ్యాచ్‌లు
## అక్టోబరు 4 నుండి మెయిన్ వరల్డ్ కప్

**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది సౌతాఫ్రికా వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక 2027 వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్‌కు సంబంధించి ఐసీసీ కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఈ టోర్నీకి అర్హత సాధించేందుకు నిర్వహించే క్వాలిఫైయర్స్ మ్యాచ్‌ల తేదీలను ఐసీసీ బుధవారం అధికారికంగా ప్రకటించింది. 10 జట్లు పాల్గొనే ఈ క్వాలిఫైయర్ రౌండ్ 2027 ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 మధ్య జరగనుంది. ఈసారి జరగబోయే వన్డే ప్రపంచకప్‌ను ఐసీసీ సరికొత్త ఫార్మాట్‌లో నిర్వహించబోతోంది. ఈ మెగా టోర్నీలో మొత్తం 14 జట్లు పోటీపడనున్నాయి. క్వాలిఫైయర్స్ పాయింట్ల పట్టికలో రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే జట్ల మధ్య సూపర్ సిరీస్ పోరు జరుగుతుంది. ఇది ప్రపంచకప్ మొదటి రౌండ్‌గా పరిగణించబడుతుంది. ఈ రౌండ్‌లో విజయం సాధించిన జట్లు ఆ తర్వాత టాప్12 లోకి అడుగుపెడతాయి. ఈసారి వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్ మూడు ఆఫ్రికన్ దేశాలు సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా నిర్వహించనున్నాయి. టోర్నీలోని



మొత్తం మ్యాచ్‌లను 12 వేర్వేరు స్టేడియంలలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. క్వాలిఫైయర్ రౌండ్‌లో మొత్తం 10 జట్లు పాల్గొంటాయి.

సెప్టెంబర్ 30, 2026 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో చివరన ఉండే రెండు ఫుల్ మెంబర్ జట్లు (ఆతిథ్య దేశాలైన సౌతాఫ్రికా, జింబాబ్వేలు మినహా) ఈ క్వాలిఫైయర్‌లో ఆడాల్సి ఉంటుంది. వీరితో పాటు సిడబ్ల్యూసి లీగ్ 2లో టాప్4 లో నిలిచిన జట్లు, అలాగే వరల్డ్ కప్ క్వాలిఫైయర్ ప్లేఆఫ్స్ లో టాప్4 లో నిలిచిన జట్లు కలసి మొత్తం 10 జట్లు ఈ క్వాలిఫైయర్స్ లో తలపడతాయి. మెయిన్ ప్రపంచకప్ మ్యాచ్‌లు 2027 అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 వరకు జరగనున్నాయి.



## శ్రీలంక మ్యాచ్‌లో..
# అత్యధిక వికెట్ల హీరోలు

**న్యూఢిల్లీ:** టీమిండియా ఈ నెల 15 నుంచి శ్రీలంకలో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో తలపడనుంది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో భారత్‌కు ఈ సిరీస్ అత్యంత కీలకంగా మారింది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో నిలవాలంటే శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో టీమిండియా ఈ సిరీస్‌ను ఖచ్చితంగా గెలవాల్సి ఉంటుంది. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ ప్రస్తుతం ఐదో స్థానంలో, శ్రీలంక ఆరో స్థానంలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్, శ్రీలంక టెస్ట్ చరిత్రలో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్ల వివరాలు ఆసక్తికరంగా మారాయి. భారత్, శ్రీలంక మధ్య 1982 నుంచి టెస్ట్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఈ రెండు దేశాల మధ్య జరిగిన టెస్ట్ సిరీస్ చరిత్రలోనే అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా శ్రీలంక స్పిన్ దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆయన భారత్‌పై 22 టెస్టుల్లో ఏకంగా 105 వికెట్లు పడగొట్టి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. భారత మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే 18 టెస్టుల్లో 74 వికెట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ 11 మ్యాచ్‌ల్లో 62 వికెట్లతో మూడో స్థానంలో నిలిచాడు. నాలుగో స్థానంలో హర్భజన్ సింగ్ (53 వికెట్లు), ఐదో స్థానంలో కపిల్ దేవ్ (45 వికెట్లు) ఉన్నారు. యాక్టివ్ ప్లేయర్లలో ఒక్కడే ఉండటం విశేషం. ఈ హెవీవెయిట్ బౌలర్ల జాబితాలో ప్రస్తుతం ఆడుతున్న ఆటగాళ్లలో భారత స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ఒక్కడే చోటు దక్కించుకోవడం విశేషం. 37 ఏళ్ల జడేజా ఇప్పటివరకు శ్రీలంకపై 7 టెస్టులాడి 33 వికెట్లు పడగొట్టి ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. రాబోయే లంక పర్యటనకు జడేజా భారత జట్టులో ఎంపికయ్యాడు. ఈ జాబితాలో ఆరో స్థానంలో ఇషాంత్ శర్మ (36 వికెట్లు), ఏడో స్థానంలో శ్రీలంక మాజీ స్పిన్నర్ అజంతా మెండిస్ (34 వికెట్లు), తొమ్మిదో స్థానంలో రంగన హేరత్ (33 వికెట్లు), పదో స్థానంలో చమిండ వాస్ (30 వికెట్లు) నిలిచారు.


# వెస్టిండీస్ గడ్డపై విధ్వంసం
## పట్టు బిగించిన పాకిస్థాన్

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌పై అబ్దుల్లా షఫీక్ 160 పరుగులతో చరిత్ర సృష్టించాడు. 49 ఏళ్ల తర్వాత కరేబియన్ గడ్డపై పాక్ బ్యాటర్ 150 ప్లస్ స్కోరు సాధించాడు. బాబర్ ఆజంతో 183 పరుగుల భాగస్వామ్యం, పాక్ ఆధిక్యంతో పట్టు బిగించడంతో విండీస్ ఓటమి అంచున నిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు కోల్పోయింది. క్వీన్స్ పార్క్ ఓవల్ మైదానంలో వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్ మూడో రోజు బుధవారం పాకిస్థాన్ జట్టు అత్యంత బలమైన స్థితికి చేరుకుంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ తన రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 60 పరుగుల స్వల్ప ఆధిక్యంతో 6 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. కరేబియన్ గడ్డపై వెస్టిండీస్‌పై టెస్టుల్లో 150 కంటే ఎక్కువ పరుగులు సాధించి ఏకంగా 49 ఏళ్ల క్రితం నాటి రికార్డును అబ్దుల్లా షఫీక్ తిరగరాశాడు. పాకిస్థాన్ ఇన్నింగ్స్ ప్రారంభంలో ఓపెనర్లు అజాన్ అవైస్ (55), ఇమామ్ ఉల్ హక్ (14) కలసి 98 పరుగులు జోడించి అవుట్ అయ్యారు. మూడో వికెట్‌కు బ్యాటింగ్‌కు వచ్చిన షఫీక్, కెప్టెన్ బాబర్ ఆజమ్‌తో కలిసి కొండంత భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు ఏకంగా 183 పరుగులు జోడించారు. కెప్టెన్ బాబర్ ఆజం ఎంతో నిలకడగా ఆడి సెంచరీ దిశగా సాగినప్పటికీ, బ్రాండన్ కింగ్ వేసిన అద్భుతమైన త్రోకి 88 పరుగుల వద్ద రనౌట్ అయ్యాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా అబ్దుల్లా షఫీక్ చివరి వరకు నిలబడి 160 రన్లతో పాకిస్థాన్‌ను 387 పరుగుల మార్కుకు చేర్చాడు ఈ మ్యాచ్‌ను గెలిచి రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1 తో సమం చేసే అవకాశాన్ని పాకిస్థాన్ చేజిక్కించుకుంది. పాక్ సాధించిన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ ఆటగాళ్లు పాక్ బౌలర్ల ధాటికి నిలవలేకపోయారు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ 6 వికెట్ల నష్టానికి కేవలం 103 పరుగులు మాత్రమే చేసింది. ప్రస్తుతం విండీస్ చేతిలో 4 వికెట్లు మాత్రమే ఉండగా, కేవలం 60 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉండి ఓటమి అంచున నిలిచింది. అంతకు ముందు తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 344 పరుగులు చేసింది.





# ఆర్‌బిఐ రెపో రేటు యథాతథం



## 5.25 శాతంగానే కొనసాగింపు

**ముంబయి, ఆగస్టు 5:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటి సమావేశం అనంతరం రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగిస్తూ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ఎంపీసీ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటును 5 శాతం, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్), బ్యాంక్ రేట్లను 5.5 శాతం వద్ద కొనసాగించింది. ద్రవ్య విధాన వైఖరినితటస్థలంగానే కొనసాగించింది.16 నెలల తర్వాత వినియోగదారుల ధరల సూచీ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్ష్యమైన 4 శాతాన్ని దాటి జూన్‌లో 4.4 శాతానికి చేరి ఆర్‌బీఐ అంచనాల కంటే 30 బేసిస్ పాయింట్లు తక్కువగా ఉందని పేర్కొంది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయికి చేరి, అనంతరం క్రమంగా తగ్గుముఖం పడుతుందని ఎంపీసీ అంచనా వేసింది.2026-27 ఆర్థిక సంవత్సరానికి సీపీఐ ద్రవ్యోల్బణ అంచనాను 10 బేసిస్ పాయింట్లు తగ్గించి 5 శాతానికి సవరించింది. త్రైమాసికాల వారీగా రెండో త్రైమాసికంలో 4.7 శాతం, మూడోత్రైమాసికంలో 5.9 శాతం, చివరి త్రైమాసికంలో 5.5 శాతం, 2027-28 తొలి త్రైమాసికంలో 5.3 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. అలాగే 2026-27లో కోర్ ద్రవ్యోల్బణం 4.3 శాతంగా ఉండనుందని, విలువైన లోహాలను మినహాయించిన కోర్ ద్రవ్యోల్బణం 4.3 శాతం కంటే తక్కువగానే కొనసాగే అవకాశముందని తెలిపింది.దేశీయ డిమాండ్ బలంగా కొనసాగడం, ఆర్థిక కార్యకలాపాలు అంచనాల కంటే మెరుగ్గా ఉండటంతో 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 10 బేసిస్ పాయింట్లు పెంచి 6.7 శాతానికి సవరించింది. దేశ ఆర్థిక వ్యవస్థకు పలు ప్రమాదాలు ఉన్నాయని గవర్నర్ సంజయ్ మల్హోత్రా హెచ్చరించారు. దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాల లోపం, అసమాన వర్షపాతం, అంతర్జాతీయ ముడి చమురు ధరల అస్థిరత, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ప్రధాన దేశాల ఆర్థిక పరిస్థితుల బలహీనత, ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, గ్లోబల్ వాణిజ్య విధానాలపై అనిశ్చితి వంటి అంశాలు ప్రధాన సవాళ్లుగా పేర్కొన్నారు.ప్రస్తుతం ద్రవ్యోల్బణం పెరుగుదల ప్రధానంగా ఆహార, ఇంధన సరఫరా సంబంధిత ఒత్తిళ్ల వల్లేనని, వృద్ధి రేటు కూడా ఆశించిన స్థాయిలో లేదని, పరిస్థితులపై మరింత స్పష్టత వచ్చిన తర్వాతే ద్రవ్య విధానంలో మార్పులపై నిర్ణయం తీసుకుంటామని గవర్నర్ తెలిపారు. ద్రవ్యోల్బణం, వృద్ధి పరిస్థితుల పరిణామాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైతే భవిష్యత్తులో విధాన రేట్లను పునఃసమీక్షించే అవకాశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# రెపోరేట్ల ఎఫెక్ట్... లాభాల్లో ముగిసిన మార్కెట్లు



**ముంబయి, ఆగస్టు 5:** భారతీయ రిజర్వుబ్యాంకు రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగించడంతో పాటు తటస్థ ద్రవ్య విధానాన్ని కొనసాగించడంతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు బుధవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 6.7 శాతానికి పెంచడం, ద్రవ్యోల్బణ అంచనాను 5 శాతానికి తగ్గించడం ఇన్వెస్టర్లలో సానుకూల భావనను పెంచింది. ప్రపంచ మార్కెట్లలో బలమైన ధోరణి, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు, ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టడం కూడా మార్కెట్లకు మద్దతు ఇచ్చాయి.ఎస్అండ్‌పీ బీఎస్ఈ సెన్సెక్స్ 152.05 పాయింట్లు పెరిగి 78,581 వద్ద ముగియగా, నిఫ్టీ50 సూచీ 9.75 పాయింట్లు లాభపడి 24,624.65 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్ 3.23 శాతం, లార్సెన్ అండ్ టుబ్రో 1.68 శాతం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 1.18 శాతం చొప్పున పెరిగి సూచీకి ప్రధాన మద్దతు అందించాయి.బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.34 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.70 శాతం చొప్పున లాభపడ్డాయి. బీఎస్ఈలో 2,330 షేర్లు లాభపడగా, 1,911 షేర్లు నష్టపోయాయి. 216 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 1.33 డాలర్లు పెరిగి 80.69 డాలర్లకు చేరుకుంది. భారత 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 6.816 శాతం నుంచి 6.787 శాతానికి తగ్గింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 95.28 నుంచి 95.15 వద్ద బలపడింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ ధర 1.31 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,46,186కు చేరాయి. అమెరికా 10 ఏళ్ల బాండ్ యీల్డ్ 4.612 శాతానికి దిగివచ్చింది. భారతి ఎయిర్‌టెల్ సమీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 41.63 శాతం పెరిగి రూ.8,424.29 కోట్లకు చేరడంతో షేరు 0.40 శాతం లాభపడింది. ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ 7.60 శాతం, క్యాస్ట్రోల్ ఇండియా 2.40 శాతం, స్నోమాన్ లాజిస్టిక్స్ 2.76 శాతం, గోద్రేజ్ ప్రాపర్టీస్ 3.22 శాతం, శిల్పా మెడికేర్ 12.93 శాతం, దీపక్ నైట్రైట్ 0.37 శాతం చొప్పున పెరిగాయి. మరోవైపు ప్రోటియన్ ఈగవర్నెన్స్ టెక్నాలజీస్ 8.22 శాతం, కళ్యాణ్ జ్యువెలర్స్ ఇండియా 3.70 శాతం, ఓఎన్‌జీసీ 0.74 శాతం చొప్పున నష్టపోయాయి.




# క్లోజింగ్ ఆక్షన్‌లో ఎన్ఎస్ఇదే ఆధిపత్యం

**ముంబయి,ఆగస్టు 5:** మార్కెట్ ముగింపు ధర నిర్ణయానికి ఇటీవల అమల్లోకి వచ్చిన క్లోజింగ్ ఆక్షన్ సెషన్‌లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఆగస్టు 5న సీఏఎస్‌లో ఎన్ఎస్ఈ రూ.1,383.8 కోట్ల టర్నోవర్ నమోదు చేసి 99.1 శాతం మార్కెట్ వాటాను దక్కించుకుంది. బీఎస్ఈలో రూ.12.5 కోట్ల టర్నోవర్ నమోదై 0.9 శాతం వాటా మాత్రమే లభించింది. రెండు ఎక్స్ఛేంజ్‌ల కలిపి టర్నోవర్ రూ.1,396.3 కోట్లుగా నమోదైంది.సీఏఎస్ ప్రారంభమైన తొలి రోజున ఎన్ఎస్ఈలో రూ.1,276.2 కోట్లు, బీఎస్ఈలో రూ.10.8 కోట్ల టర్నోవర్ నమోదవగా ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, భారతి ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, టీసీఎస్, సీజీ పవర్, యాక్సిస్ బ్యాంక్ షేర్లలో అధిక లావాదేవీలు జరిగాయి. ఈ 10 షేర్లే ఎన్ఎస్ఈ క్లోజింగ్ ఆక్షన్ టర్నోవర్‌లో సుమారు 30 శాతం వాటా కలిగి ఉండటం విశేషం.సెబీ సవరించిన ముగింపు ధర నిర్ణయ విధానంలో తొలి దశగా క్లోజింగ్ ఆక్షన్ సెషన్‌ను అమలు చేసింది. గతంలో అమలులో ఉన్న వాల్యూమ్ వెయిటెడ్ యావరేజ్ ప్రైస్ విధానానికి బదులుగా, కొనుగోలు-అమ్మకాల ఆర్డర్లకు సమతుల్య ధరను నిర్ణయించే వేలం విధానంలో ముగింపు ధరను ఖరారు చేస్తున్నారు. నిఫ్టీ50, సెన్సెక్స్ ముగింపు స్థాయిల్లో కనిపించిన వ్యత్యాసం పూర్తిగా మార్కెట్ శక్తుల ప్రభావమేనని, సాంకేతిక లోపాలు కారణం కాదని స్పష్టం చేశాయి. ప్రస్తుతం ఈ విధానం ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌కు అనుబంధంగా ఉన్న అర్హత గల నగదు మార్కెట్ షేర్లకు వర్తిస్తుండగా, దశలవారీగా మరిన్ని సెక్యూరిటీలకు విస్తరించాలని సెబీ యోచిస్తోంది.

## ఎయిర్ ఇండియాకు కొత్త సిఇఒగా
# టెవోల్డే గెబ్రెమారియం
## విస్తరణకు సిద్ధమైన టాటా గ్రూప్ సంస్థ..
## క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో నియామకం

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** టాటా గ్రూప్‌కు చెందిన ఎయిర్ ఇండియా కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ), మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ మాజీ అధినేత టెవోల్డే గెబ్రెమారియంను నియమించింది. సంస్థ పునరుద్ధరణ ప్రక్రియను పూర్తి చేసి, అంతర్జాతీయ స్థాయిలో వేగవంతమైన విస్తరణ దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. బుధవారం జరిగిన డైరెక్టర్ల బోర్డు సమావేశంలో గెబ్రెమారియం నియామకానికి ఆమోదం తెలిపినట్లు ఎయిర్ ఇండియా వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా పలువురు ప్రముఖ విమానయాన నిపుణులను పరిశీలించిన అనంతరం ఆయనను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపింది.టాటా గ్రూప్‌కు ఎయిర్ ఇండియా తిరిగి వచ్చిన తర్వాత సంస్థ పునరుద్ధరణ కార్యక్రమాలకు నాయకత్వం వహించిన క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో గెబ్రెమారియం బాధ్యతలు చేపట్టనున్నారు.ఎయిర్ ఇండియా ఛైర్మన్, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మాట్లాడుతూ విల్సన్ నాయకత్వంలో సంస్థ స్థిరీకరణ, విలీన ప్రక్రియ, భారీ విమానాల కొనుగోలు వంటి కీలక కార్యక్రమాలు పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం సంస్థ వృద్ధి, విస్తరణకు సంబంధించిన అమలు దశలోకి ప్రవేశించిందని, ప్రపంచ స్థాయి విమానయాన సంస్థను నిర్మించడంలో గెబ్రెమారియం అనుభవం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.






# వచ్చే రెండేళ్లలో ప్లాస్టిక్ కరెన్సీ!

**ముంబయి, ఆగస్టు 5:** భారతదేశంలో 2028 ఆర్థిక సంవత్సరానికి పాలిమర్ కరెన్సీ నోట్లను చలామణీలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ద్రవ్య విధాన సమీక్ష తర్వాత మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం పాలిమర్ నోట్లపై క్షేత్రస్థాయి పరీక్షలు కొనసాగుతున్నాయని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. మార్కెట్ లోకి తీసుకురాకముందు పాలిమర్ నోట్ల పనితీరును పూర్తిగా పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పరీక్షల ఫలితాలను విశ్లేషించిన తర్వాత విస్తృతస్థాయిలో చలామణీ చేసే అంశంపై తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఇటీవల రూ.10, రూ.20 విలువ ఉన్న పాలిమర్ నోట్ల క్షేత్రస్థాయి పరీక్షలకు ఆర్బీఐ ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపింది. పాలిమర్ నోట్లను నకిలీ చేయటం చాలా కష్టం పైలెట్ ప్రాజెక్ట్ లో భాగంగా ఒక్కో విలువలో 100కోట్ల నోట్లు విడుదల చేసి అవి ఎంత కాలం మన్నుతాయి, భారత వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉంటాయా అన్నది పరిశీలించనున్నారు. అయితే ప్రస్తుతం మనదేశంలో కాగితపు కరెన్సీ చెల్లుబాటులో ఉంది. సాధారణంగా కాగితపు కరెన్సీ తో పోలిస్తే పాలిమర్ కరెన్సీ ఎక్కువ కాలం మన్నుతాయి. వీటిలో ట్రాన్స్పరెంట్ విండోలు, అధునాతనమైన భద్రతా ఫీచర్లు ఉండటం కారణంగా వీటిని నకిలీ చేయటం చాలా కష్టం.

# ద్రవ్యోల్బణ అంచనాను 5 శాతానికి తగ్గించిన ఆర్‌బిఐ

**న్యూఢిల్లీ:** రిజర్వుబ్యాంకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణ (సీపీఐ) అంచనాను 10 బేసిస్ పాయింట్లు తగ్గించి 5 శాతానికి సవరించింది. జూన్‌లో ప్రకటించిన 5.1 శాతం అంచనాను తాజా ద్రవ్య విధాన సమీక్షలో 5 శాతానికి తగ్గించింది. అదే సమయంలో రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగించింది.ఆర్‌బీఐ తాజా అంచనాల ప్రకారం తొలి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 5.3 శాతం, రెండో త్రైమాసికంలో 4.7 శాతం, మూడో త్రైమాసికంలో 5.9 శాతం, నాలుగో త్రైమాసికంలో 5.5 శాతంగా




వాణిజ్యం

ఉండే అవకాశం ఉంది. ద్రవ్య విధాన కమిటీ నిర్ణయాలను ప్రకటించిన ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, ఈ ఏడాది ద్రవ్యోల్బణ అంచనాను 5 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. జూన్ నెలలో ద్రవ్యోల్బణం పెరగడానికి ప్రధానంగా ఆహార, ఇంధన ధరల పెరుగుదల కారణమని చెప్పారు.ఆహార, ఇంధన ధరలను మినహాయించి లెక్కించే కోర్ ఇన్‌ఫ్లేషన్ మే, జూన్ నెలల్లో 3.9 శాతం వద్ద స్థిరంగా కొనసాగిందని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కోర్ ఇన్‌ఫ్లేషన్ 4.3 శాతంగా ఉండొచ్చని ఆర్‌బీఐ అంచనా వేసింది.అయితే ద్రవ్యోల్బణంపై పలు అనిశ్చితులు కొనసాగుతున్నాయని గవర్నర్ హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం సమయం, భౌగోళిక పంపిణీలో మార్పులు వచ్చే అవకాశం ఉందని, ఇది ఆహార ధరలపై ప్రభావం చూపవచ్చని తెలిపారు.

Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | గురువారం 05 ఆగస్టు 2026 | I

## భట్నవిల్లిలో 'ఇంటింటి ప్రచారం' జన నీరాజనాల మధ్య ప్రతి ఇంటా మమేకమైన ఎమ్మెల్యే ఆనందరావు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు5,ప్రభాతవార్త.** ప్రజా క్షేమమే పరమావధిగా, రాష్ట్ర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అమలాపురం నియోజకవర్గ శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు స్పష్టం చేశారు.నియోజకవర్గం లో ఉపందుకున్న ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన భట్నవిల్లి గ్రామంలో విస్తృతంగా పర్యటించి, పల్లె పల్లెనా ప్రజలతో నేరుగా మమేకమయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి గత రెండేళ్ల కూటమి సుపరిపాలనలో ప్రజలకు చేకూరిన సంక్షేమ ఫలాలను, గ్రామంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వివరించారు. స్థానికులు తెలిపిన విన్నపాలు, ఎదుర్కొంటున్న సమస్యలను ఓపికగా ఆలకించిన ఆయన, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా సంస్కరణలు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజాభివృద్ధి, మరియు విద్యా, సమాచార సాంకేతిక శాఖల మంత్రి లోకేష్ నాయకత్వం కలసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయని కొనియాడారు.ఎక్కడా పక్షపాతం లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ పారదర్శకంగా పథకాలు అందుతున్నా యన్నారు.ప్రజలు చూపుతున్న అభిమానం, ప్రభుత్వంపై ఉన్న చెక్కుచెదరని నమ్మకమే తమకు నిరంతరం కష్టపడి పనిచేసేందుకు కొండంత బలాన్ని ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ పర్యటనలో స్థానిక కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు. డిసిఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఆముడా చైర్మన్ అల్లాడి సోంబాబు,రాష్ట్ర తెలుగు దేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి పెచ్చెట్టి విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ అదికార జయలక్ష్మి, నామాడి తారక్,మట్టా మహాలక్ష్మి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## పొగాకు రైతులకు అండగా ఉంటాం
## మాజీ సీఎం వైఎస్ జగన్



**దేవరపల్లి, ఆగస్టు 5( ప్రభాతవార్త ):** పొగాకు రైతుల సమస్యలను తెలుసుకుని వారికి భరోసా కల్పించేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు బుధవారం తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో పర్యటించారు. దేవరపల్లి పొగాకు బోర్డు ప్రాంగణంలో నిర్వహించిన పొగాకు రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.దేవరపల్లి శివ కళ్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న జగన్‌మోహన్‌రెడ్డి అక్కడి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి భారీ ర్యాలీగా టొబాకో బోర్డు వరకు వెళ్లారు. అనంతరం పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేలం ప్రక్రియ, మార్కెట్ పరిస్థితులు, పొగాకు ధరలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. అక్రమాలను ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు నమోదు చేసి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని విమర్శించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని ఆయన పేర్కొన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. పొగాకు రైతులకు సాగు వ్యయం పెరుగుతుండగా ఆదాయం మాత్రం తగ్గిపోతోందని అన్నారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో పొగాకు కిలోకు రూ.289 వరకు ధర లభించగా, ప్రస్తుతం కేవలం రూ.236 మాత్రమే వస్తోందని తెలిపారు.ఈ ఏడాది పండిన మొత్తం పొగాకులో ప్రభుత్వం సుమారు 12 శాతం మాత్రమే కొనుగోలు చేసిందని ఆయన ఆరోపించారు. దాదాపు 83 మిలియన్ కిలోల ఉత్పత్తి నమోదైనా, కొనుగోలు మాత్రం సుమారు 10 మిలియన్ కిలోలకే పరిమితమైందని పేర్కొన్నారు. దీంతో రైతులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు.గిట్టుబాటు ధర లేక వెంకటేశ్వరరావు అనే పొగాకు రైతు ఆత్మహత్య చేసుకున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని, ఆ కుటుంబాన్ని కనీసం పరామర్శించలేదని జగన్ విమర్శించారు. మార్కెట్‌ను నియంత్రించి రైతులకు న్యాయమైన ధర అందించాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని అన్నారు.పొగాకు రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా నేరుగా పొగాకు కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గుర్తించి మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేసి వారికి అండగా నిలిచిందని గుర్తు చేశారు. తిరిగి అవకాశం వస్తే రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే చర్యలు చేపడతామని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## 12 లక్షల విలువైన
# 24 కిలోల గంజాయి స్వాధీనం
## ఇద్దరు నిందితుల అరెస్ట్



**మోతుగూడెం ఆగస్టు:5 ప్రభాతవార్త.** మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సందర్భంగా ఒడిశా రాష్ట్రంలోని పసుపులంక ప్రాంతం నుండి అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మోతుగూడెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారుఅరెస్టు చేసిన నిందితులు పిల్లి లీల కృష్ణఆపులూరి విజయ్ కుమార్ ఇద్దరూ గుంటూరు జిల్లా వినుకొండకు చెందినవారు నిందితులు ఒడిశా రాష్ట్రంలోని పసుపులంక నుండి గంజాయిని అక్రమంగా తీసుకువెళ్తుండగా మోతుగూడెం ఎస్ఐ అబ్దుల్ నాసిర్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ టి. రాజేశ్వరరావు మరియు స్టేషన్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి వారిని పట్టుకుని వారి వద్ద నుండి 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు (పన్నెండు లక్షలు) ఉంటుందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చెస్తున్నమన్నారు. ఈ సందర్భంగా మోతుగూడెం పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్సై నషిర్ హుస్సేన్ తెలిపారు.

## ఆదిత్య యూనివర్సిటీ లో "డిజైన్ యువర్ డెస్టినీ" కెరీర్ గైడెన్స్ సెమినార్



**గండేపల్లి. ఆగస్టు 5. ప్రభాతవార్త** ఆదిత్య యూనివర్సిటీ, సూరంపాలెం లో పెట్రోలియం ఉ మైనింగ్ విభాగం ఆధ్వర్యంలో "డిజైన్ యువర్ డెస్టినీ" అనే అంశంపై కెరీర్ గైడెన్స్ సెమినార్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో (2014 బ్యాచ్) పూర్వ విద్యార్థులు పి.టి. వెంకటేష్, అసిస్టెంట్ డ్రిల్లర్ (అబుదాబి), ఆర్. అభిలాష్, సేఫ్టీ హెడ్ (దుబాయ్), అలాగే ఐ. దినేష్, సీఈఓ ఉ ఫౌండర్, డెస్టినీ ఇన్నోవేషన్ హబ్ ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. వారు పెట్రోలియం మరియు మైనింగ్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం మరియు కెరీర్ ప్రణాళికపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు.ఈ సందర్భంగా ప్రో వైస్ చాన్సలర్ (ఈ ఉ ఎస్) డా. ఎ. రమేష్ , డీన్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డా. జి. శ్రీదేవి , పెట్రోలియం ఉ మైనింగ్ విభాగాధిపతి చిన్న సుబ్బారావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ .. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉన్నత లక్ష్యాన్ని సాధించవచ్చు అని సూచించారు.ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అతిథులను జ్ఞాపికలతో సత్కరించి కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు.

## జీఎంసీ బాలయోగి స్టేడియం రోడ్డులో
# ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్



**యానాం, ఆగస్టు 5: (ప్రభాతవార్త)** యానంలోని జీఎంసీ బాలయోగి స్టేడియం రోడ్డులో ఉన్న చిన్నారుల పార్కు సమీపంలోని డ్రైనేజీ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. మ్యాన్‌హోల్‌కు అమర్చిన ఇనుప గ్రిల్ పూర్తిగా విరిగి పక్కకు పడిపోవడంతో పెద్ద గుంత బహిర్గతమైంది. డ్రైనేజీలో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపించడమే కాకుండా ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రతిరోజూ చిన్నారులు, వాకర్లు, వాహనదారులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంత స్పష్టంగా కనిపించక ప్రమాదం సంభవించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే దెబ్బతిన్న ఇనుప గ్రిల్‌ను మార్చి, డ్రైనేజీని శుభ్రపరిచి ప్రజలకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## వాడపల్లి క్షేత్రంలో వరుణ యాగ మహోత్సవం..

### సకాలంలో వర్షాలు....లోక కళ్యాణార్థం : చైర్మన్, ముదునూరి,డిప్యూటీ కమిషనర్ ఈఓ, నల్లం.



**ఆత్రేయపురం, ఆగస్టు 05,(ప్రభాత వార్త)** ప్రకృతిలో సమతుల్యత సాధించడానికి, సమృద్ధిగా వర్షాలు కురిసేందుకు ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, పంటలు సమృద్ధిగా పండాలని, సమస్త లోకానికి శ్రేయస్సు కలగాలని ఆకాంక్షిస్తూ వాడపల్లి దేవస్థానం నందు వరుణ యాగ మహోత్సవాన్ని నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ ఈఓ నల్లం సూర్య చక్రధరరావు లు తెలిపారు.కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో పండితులుఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంతో వరుణసూక్త సహిత వరుణ జప పూర్వక వరుణ యజ్ఞాన్ని ఘనంగా ప్రారంబించారు.వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వరుణ యాగ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణం నిర్వహించారు. అనంతరం వరుణ మండపారాధన, వరుణ సూక్త పారాయణం, వరుణ జపం, వరుణ యజ్ఞం పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. యజ్ఞ కార్యక్రమం అనంతరం మహాస్నపన తిరుమంజనం, విశేష అర్చన, చతుర్వేద పారాయణం, నీరాజనం కార్యక్రమాలు భక్తిపూర్వకంగా నిర్వహించారు. యజ్ఞంలో పాల్గొన్న భక్తులు దేశ ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, పంటల సమృద్ధి, లోకకల్యాణం కోసం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించాయి. భక్తులు భక్తి భావంతో పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. స్వామివారి సేవలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, అదిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆదివాసి దినోత్సవాన్ని ప్రత్యేక ఆకర్షణగా నిర్వహించాలి

### కలెక్టర్ దినేష్ కుమార్




**రంపచోడవరం, ఆగస్టు 5 ప్రభాతవార్త:** ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని వైవిధ్యభరితంగా, గిరిజన సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించేలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐటిడీఏ సమావేశ మందిరంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రంపచోడవరం ప్రాంతం గిరిజన సంస్కృతికి నిలయమని పేర్కొన్న కలెక్టర్, సాధారణ వేడుకలకు పరిమితం కాకుండా గిరిజన జీవన విధానం, సంప్రదాయాలు, చరిత్ర, కళలు, ఆహార సంస్కృతిని ప్రతిబింబించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆధారిత కార్యక్రమాలతో ఆదివాసి దినోత్సవాన్ని ప్రత్యేకంగా నిర్వహించాలని చెప్పారు. రంప విప్లవ చారిత్రక ప్రదర్శన, అమరవీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని చాటే సాంస్కృతిక రూపకాలు, కొమ్ము డాన్స్, సంప్రదాయ గిరిజన నృత్యాలు, జానపద కళారూపాలు, యువత సాంస్కృతిక ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణలుగా ఉండాలని సూచించారు. గిరిజన సంప్రదాయ వంటకాల ప్రదర్శన, ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేసి స్థానిక మహిళా సంఘాలకు ప్రాధాన్యం కల్పించాలని ఆదేశించారు. అధికారులు, విద్యార్థులు, యువత కోసం క్రీడా పోటీలు నిర్వహించడంతో పాటు గిరిజన సంప్రదాయ క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమాల నిర్వహణలో గిరిజన సంఘాల ప్రతినిధులను భాగస్వామ్యం చేయడంతో పాటు శుభ్రత, భద్రత, తాగునీరు, వైద్య సేవలు తదితర ఏర్పాట్లను అన్ని శాఖలు సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, ఓఎస్డీ జావలి, డీఎఫ్‌వో శివకుమార్ గంగల్, ఆర్డీవో కె. స్వాతి, జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఎస్డీపీఓ అస్రఫ్ అలీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు ఉత్తమ ఆహారం : సిడిపిఓ వెంకటలక్ష్మి



**శంఖవరం ఆగస్టు 5 ప్రభాతవార్త** తల్లిపాలే బిడ్డకు ఉత్తమ ఆహారమని పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలే పట్టించాలని సిడిపిఓ పర్వత వెంకటలక్ష్మి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బుధవారం మండలంలోని కత్తిపూడిలో గల అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలు బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల ఏడవ తేదీ వరకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీలకు, బారింతలకు, పిల్లల తల్లు లకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది తెలిపారు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, తల్లిపాలే ఆహారమని, పశువుల పాలు, ఇతర పానీయాలు డబ్బా పాలు పట్టరాదన్నారు పుట్టిన గంటలోపే తల్లిపాలు ప్రారంభించాలని, తల్లిపాలు బిడ్డకు ఉత్తమ ఆహారమని పేర్కొన్నారు. తల్లిపాల వలన బిడ్డకు ఎటువంటి వ్యాధులు దరి చేరకుండా బిడ్డకు కావలసిన నీరు , పోషకాలు అన్ని తల్లిపాలలోనే లభిస్తాయని ఉద్యోగానికి వెళ్లే మహిళలు శుభ్రమైన పాత్రలో పాలు నిల్వ చేసి ఫ్రిజ్లో ఉంచి 24 గంటల్లో ఉపయోగించవచ్చుని.కప్పు లేదా చెంచాతో బిడ్డకు తాగించాలన్నారు. తల్లిపాలు వలన బిడ్డకు శక్తి పెరగడమే కాకుండా తల్లికి కూడా ప్రయోజనాలు చేకూరుతాయని పాల ఉత్పత్తికి శరీరం అదరపు క్యాలరీలు ఖర్చు చేస్తున్నారు దీనివలన గర్భధారణ సమయంలో పెరిగిన బరువును తగ్గిస్తుందని, తల్లికి కొన్ని రకాల క్యాన్సర్లు, దీర్ఘ కాలిక రోగాలు వచ్చే ప్రమాదం తగ్గిస్తుందని, అదేవిధంగా పాలు ఇచ్చే సమయంలో విడుదలయ్యే ఆక్సిటోసిన్ మరియు ప్రో లాక్టిన్ హార్మోన్లు తల్లిలో ఒత్తిడి ఆందోళన తగ్గించి ప్రశాంతతను ఇస్తాయని తెలిపారు పలు విషయాలను బోర్డుల ద్వారా ప్రదర్శించి తల్లులు వివరించారు ఈ కార్యక్రమం సూపర్వైజర్ బి. వి. రజని, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు

## ఆర్ఐగా బాధ్యతలు స్వీకరించిన ట్రైనీ ఐఏఎస్ ప్రియా



**గొల్లప్రోలు, ఆగస్టు 5,(ప్రభాత వార్త)** గొల్లప్రోలు మండల రెవెన్యూ కార్యాలయంలో ట్రైనీ ఐఏఎస్ అధికారిణి ప్రియా రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ) శిక్షణ నిమిత్తం బుధవారం బాధ్యతలు చేపట్టారు.క్షేత్రస్థాయిలో రెవెన్యూ పరిపాలన వివిధ విభాగాల పనితీరుపై అవగాహన పెంచుకునేందుకు గాను ఆమెకు ప్రభుత్వం ఈ శిక్షణను కేటాయించింది.ఈ శిక్షణలో భాగంగా ఆమె మూడు రోజుల పాటు పూర్తిస్థాయిలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ) బాధ్యతలను పరిశీలిస్తారు.అనంతరం ఈ నెల 12వ తేదీ వరకు మండలంలోని వివిధ రెవెన్యూ అంశాలు,భూ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ నిబంధనలపై ఆమె ప్రత్యేక శిక్షణ పొందనున్నారు.కాగా బుధవారం ఉదయం గొల్లప్రోలు రెవెన్యూ కార్యాలయానికి విచ్చేసిన ట్రైనీ ఐఏఎస్ ప్రియాకు స్థానిక తహసిల్దార్ వెంకట భాస్కర్ ఘనంగా స్వాగతం పలికారు. ఆమెకు పూలగుచ్ఛం (బొకే) అందజేసి కార్యాలయంలోనికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు."

## కలగా మిగిలిన శబరి వంతెన మరమ్మత్తులు . కనీసం గడ్డి -మట్టి తొలగించండి.

**చింతూరు ఆగస్టు 5 ప్రభాత వార్త.** చింతూరు వద్ద శబరి వంతెనకు మరమత్తుల సంగతి కలగా మిగిలింది . కనీసం వంతెన పైన మట్టి, ఇసుక పేరుకొని పోయి గడ్డి మొలిచింది. రోజు వివిధ శాఖల అధికారులు చూస్తున్నారు తప్ప మనకెందుకులె అనుకుంటున్నారు. ఇది జగమెరిగిన సత్యం. వంతెన పై గడ్డి పెరిగితే, మట్టి, ఇసుక పేరుకొని పోతే వచ్చిన నష్టం ఏమిటా?అని అలోచించుతున్నారా. వర్షం పడితే వంతెన పై నీళ్లు ఆగుతున్నాయి. వాహనాల రాకపోకల వల్ల పాదాచారులు, ద్విచక్ర వాహన దారులపై ఆ నీళ్లు చీమ్ముతున్నాయి. వంతెన పై వర్షపు నీరు క్రింద నదిలోకి జరిపోవటం కోసం ఏర్పాటు చేసిన ఏర్పాట్లు (హోల్స్ ) మట్టి, ఇసుక వల్ల పొడిపోయాయి. సో వర్షపు నీరు క్రిందకు జారదు. కీవలం ఏండకు ఆవిరి అవాలి తప్ప మరో మార్గం లేదు. కనీసం మొత్తం వంతెన పైన 5 ట్రక్కుల పైనే మట్టి, ఇసుక పేరుకొని పోయినాయి. నీరు ఆగటం వల్ల వంతెన జీవిత కాలం తగ్గుతుంది. సో అధికారులకు ఇవన్నీ తెలియక కాదు, పదిమంది ఉపయోగం ఉన్న కార్యక్రమం కావున అధికారులు స్పందించి మట్టి, ఇసుక, గడ్డి తొలగించాలని పాదాచారులు కోరుకుంటూ బుధవారం వంతెన పై ఉన్న గడ్డిని చింతూరుకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు చూపిస్తున్న దృశ్యం చూడవచ్చు. సో అధికారులు స్పందించి ఈ చిన్న సమస్య పరిష్కరించాలని కోరుతూ ప్రభాత వార్త ఈ కథనం.







## రెండేళ్ల కూటమి పాలన నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమం
## ఎమ్మెల్యే యనమల దివ్య



**తుని, ఆగష్టు 5,( ప్రభాతవార్త )** కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో తుని నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమం సాధించామని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు.కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై నమ్మకం, అభివృద్ధి సంక్షేమ పేరిట తుని నియోజకవర్గంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం కొనసాగుతుంది. ఇవాళ తుని పట్టణంలో ఏడు, ఎనిమిది వార్డుల ఇన్ చార్జ్ లు ఆధ్వర్యంలో దంతులూరి శ్రీనివాసరాజు, అల్లు రాజు ఆధ్వర్యంలో జరిగిన ఇంటింటికీ టీడీపీ కార్యక్రమానికి జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు యినుగంటి సత్యనారాయణ, టౌన్ టీడీపీ అధ్యక్షురాలు కుసుమంచి శోభారాణి సత్యనారాయణ లతో కలిసి విచ్చేసిన యనమల ప్రతి ఇంటికీ వెళ్ళి కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు.ఈసందర్భంగా తుని నియోజకవర్గంలో వందకోట్లకు పైబడి అభివృద్ధి పనులు చేపట్టామని తుని పట్టణంలో మరో 37 కోట్లకు పైగా అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేశామన్నారు ఇచ్చిన హామీ మేరకు అమృత పథకం కింద ఇంటింటికీ మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు.గత ప్రభుత్వ హయాంలో శానిటేషన్ భ్రష్టు పట్టిందని మెరుగైన శానిటేషన్ కోసం ప్రతి వార్డులో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించామని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు మోతుకూరి వెంకటేష్, గవర కార్పోరేషన్ డైరెక్టర్ మల్ల గణేష్, గాంధీ సత్రం చైర్మన్ కుండల రామకృష్ణ,,కుక్కడపు బాలాజీ వార్డు నాయకులు అల్లు కర్రి శివ, దేశంశెట్టి సత్తిబాబు, దండెం నాగు,అద్దేపల్లి బాలాజీ, దంతులూరి శివరామకృష్ణరాజు, దమ్ములూరి సూరిబాబు, వాడపల్లి రాము,సూరి,జట్ల శ్రీను,ఏనుగుల నారాయణ రావు,శ్రావణి సాయి, తదితరులు పాల్గొన్నారు

# అనంతబాబు బెయిల్ పిటిషన్ రద్దు

**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 5 (ప్రభాతవార్త)** సాక్షులను ప్రభావితం చేసి ప్రలోభాలకు గురిచేసిన కేసులో వైఎస్ఆర్సిపి ఎమ్మెల్సీ అనంత బాబు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునేద్ అహ్మద్ మౌలానా రద్దు చేశారు. బుధవారం కోర్టులో బెయిల్ పై విచారణ జరిగింది. వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో ముద్దాయిగా ఉన్నటువంటి అనంత బాబుకు సాక్షులను బెదిరించి సుప్రీంకోర్టు ఇచ్చిన వేలు నిబంధనలు ఉల్లంఘించారని హత్య కేసులో బెయిల్ రద్దు చేయడం జరిగింది. హత్య కేసులో సాక్షులను నిర్బంధించి బెదిరించి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు బలవంతంగా ప్రోలోబ పెట్టి తమకు అనుకూలంగా సుబ్రహ్మణ్యం హత్య కేసులో సాక్ష్యం చెప్పాలని బెదిరించిన కేసులో సుమారు నలుగురు సాక్షుల నుంచి నాలుగు లక్షల రూపాయలు పోలీస్ వారికి స్వాధీనం చేయడం జరిగినది. అలాగే నాలుగో ముద్దాయిగా ఉన్న వ్యక్తి వద్ద నుంచి పాతికవేల రూపాయలు ఒప్పుదల స్టేట్మెంట్ ద్వారా స్వాధీనం చేసుకోవడం అయినది. సాక్షలను ప్రభావితం చేసి ప్రలోభాలకు గురి చేశారని సర్పవరం పోలీసులు పెట్టిన కేసులో ప్రథమ ముద్దాయిగా ఉన్నటువంటి అనంత బాబు రెండోసారి జిల్లా న్యాయమూర్తి కోర్టులో వేసుకున్న బెయిల్ కూడా డిస్మిస్ చేస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలు ఇవ్వడం జరిగినది. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాల సుబ్బారావు వారించారు.

## చీలమండ, పాదల సమస్యలకు యశోద ఆసుపత్రి లోసంక్లిష్ట శస్త్రచికిత్సలు

### ఎముకల వైద్యులు ఆదిత్య సోమయాజి వెల్లడి




**కాకినాడ రూరల్, ఆగస్ట్ 5 (ప్రభాతవార్త):** వయసు పైబడటం వల్లే సంభవించే పాదం, చీలమండ మడమ నొప్పులకు యశోద ఆసుపత్రి లో కీ రోల్ సర్జరీ ద్వారా శాశ్వత పరిష్కారం అవుతుందని యశోద ఆసుపత్రి ఎముకల వైద్యులు ఆదిత్య సోమయాజి వెల్లడించారు. బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో డాక్టర్ ఆదిత్య మాట్లాడుతూ పాదాల సంరక్షణలో ఆధునిక వైద్య అద్భుతాలు సాధించడం జరిగిందని, భుజం, మోకాలి పాదం చీలమండ సమస్యలు, పుట్టుకతో వచ్చే పోలియో సంబంధించిన సమస్యలను కీ రోల్ సర్జరీ ద్వారా నయం చేయవచ్చని పేర్కొన్నారు. తరచుగా కాలు బెణకడం, పాదాల ఆకృతి దెబ్బతినడం, ఆటల్లో తగిలే గాయాలు, మరీ ముఖ్యంగా మధుమేహం వల్ల తలెత్తే సమస్యలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో శాశ్వత వైకల్యం బారినపడే ప్రమాదం ఉందని , వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యులను సంప్రదిస్తే పెనుముప్పును సులభంగా నివారించవచ్చు అన్నారు. వైద్యవిజ్ఞానం సాధించిన ప్రగతితో పాదం, మడమ చికిత్సల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయాని ,అధునాతన స్కానింగ్ విధానాలతో వ్యాధి మూలాలను కచ్చితంగా పసిగట్టి, అత్యుత్తమ వైద్యం అందించే సాంకేతికత ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలుకుతూ, పెద్ద కోతలు లేకుండానే ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేసి ఫలితంగా బాధితులు తీవ్రమైన నొప్పికి గురికాకుండానే అతి త్వరగా కోలుకోవడం జరుగుతుందన్నారు. ఆరోగ్యకరమైన పాదాలే చురుకైన జీవనానికి ఆధారమని,ఫుట్ అండ్ యాంకిల్ విభాగంలో విశేష అనుభవం సాధించిన సిటీ యశోద ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ ప్రముఖ ఎముకల వైద్యులుఆదిత్య సోమయాజి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి సీనియర్ ఎగ్జిక్యూటివ్ వి. సాయికిరణ్ పాల్గొన్నారు .

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం.

**పిఠాపురం, ఆగస్టు 5 ( ప్రభాతవార్త )** పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రథమ సంవత్సరంలో చే రే విద్యార్థులకు క్యాప్ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుభాషిణి తెలిపారు. వెబ్ ఆప్షన్ 19వ తేదీ వరకు ఇచ్చుకోవాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ తెలియజేశారు. విద్యార్థులకు కళాశాల కార్యాలయంలో ఉన్నాయి ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించడం జరిగిందని ఆమె తెలిపారు. పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ జువాలజీ, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిఏ ఎకనామిక్స్, కోర్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంటర్మీడియట్ లేదా తక్షమాన పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు డిగ్రీ లో ప్రవేశానికి అర్హులని ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రభాత వార్త
## న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెటవర్క్‌ను మరింత పట్టిష్టవంతంగా చేయాలనుకుంటోంది. పాఠకులకు మరింత తాజా వార్తలను అందించేందుకు తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో విలేకరుల యంత్రాంగాన్ని విస్తృతపరచాలని నిర్ణయించింది. ఆసక్తి గల వారికి న్యూస్ కంట్రిబ్యూటర్లయ్యే సదవకాశం కల్పిస్తోంది."

అభ్యర్థులకు కావలసిన అర్హతలు
- 35 ఏళ్ళ లోపు వయస్సు
- స్థానికంగా నివాసం
- ఇంటర్, డిగ్రీ
- ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన

న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలసిన కేంద్రాలు
రాజానగరం, రంగంపేట, రాయవరం, మండపేట, కోరుకొండ, కొవ్వూరు, నిడదవోలు, తాళ్ళపూడి, ఉండ్రాజవరం, నల్లజర్ల, రాజమహేంద్రవరం

ఇంటర్వ్యూలకు ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటాతో సంప్రదించగలరు.

'వార్త' యూనిట్ కేంద్రం, రాజమహేంద్రవరం
వివరములకు: 9666685998, 8096661682
నెంబర్లను సంప్రదించగలరు

## రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జాన్ వెస్లీ పుట్టినరోజు వేడుకలు:



**జగ్గంపేట ఆగస్టు 5 (ప్రభాత వార్త)** జగ్గంపేటలో వైయస్సార్ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కుందా జాన్ వెస్లీ పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన నివాసంలో జాన్ వెస్లీ అభిమానులు వైసిపి నాయకులు ఆయా పాస్టర్లు ఆధ్వర్యంలో భారీ కేకులు కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా యువత ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించి జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రోగులకు పండ్లు పాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన అభిమానులు రక్తదాన శిబిరంలో తమ రక్తాన్ని దానం చేసి జాన్ వెస్లీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జాన్ వెస్లీ చిన్నప్పటినుండి ఎంతో కష్టపడి వచ్చి నేడు ఈ స్థాయికి ఎదిగారని కష్టాల్ని తగ్గ ఫలే అని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మైనారిటీ రాష్ట్ర అధ్యక్షులు బొల్లవరపు జాన్ వెస్లీ, జిల్లా అధ్యక్షులు జాషువా గిరి. జగ్గంపేట స్థానిక దైవజనులు హెచ్ హెచ్ డైరెక్టర్ జార్జ్ బాబు.దారా ప్రసాద్. మేరా పీటర్. జుత్తుక నాగేశ్వరరావు. సాదే సురేంద్ర. తదితర దైవజనులు పాల్గొన్నారు

## బ్లైండ్ హాస్టల్ కు డ్రీమ్ వే స్కూల్ వితరణ.



**తాళ్లరేవు, ఆగస్టు 5 (ప్రభాతవార్త):** ఇతరులకు సహాయం చేయాలనే ఆలోచన విద్యార్థి దశ నుంచి ఉండాలని డ్రీమ్ వే స్కూల్ అధినేత కొప్పాడి మోహన్ కుమార్ పిలుపునిచ్చారు. ఆ విద్యార్థులంతా ఒక్కటయ్యారు. రావులపాలెం లో ఉన్న శుభోదయ బ్లైండ్ హాస్టల్ కు సహాయం చేయాలని నిశ్చయించుకున్నారు. ఈ మేరకు తాళ్ళరేవు మండలం కోరంగి పంచాయతీ సీతారామపురం డ్రీమ్ వే స్కూల్ విద్యార్థులంతా చందాలుగా రూ. 10వేలు పోగు చేశారు. దీనికి స్కూల్ అధినేత మోహన్ కుమార్ రూ.2 వేల రూపాయలను జోడించారు. మొత్తంగా రూ.12 వేల ను శుభోదయ బ్లైండ్ స్కూల్ కరస్పాండెంట్ ఈశ్వరరావుకు డ్రీమ్ వే స్కూల్ తరఫున బుధవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల చూపిన ఔదార్యాన్ని ఉపాధ్యాయులు అభినందించారు.

## తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా



**తాళ్లరేవు ఆగస్టు 5 (ప్రభాతవార్త):** తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా అని సిడిపిఓ వై. శ్రీదేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించిన తల్లుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రు పాలు బిడ్డకు ఇవ్వాలన్నారు. తల్లి సరైన పోషకాహారం తీసుకుంటే బిడ్డకు సరిపడా పాలు ఉత్పత్తి అవుతాయన్నారు.2 సంవత్సరాల వరకు బిడ్డకు కేవలం తల్లిపాలే ఇవ్వాలని తెలిపారు. ఈ రెండు సంవత్సరాల లోపు బిడ్డకు మెదడు అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఇందిరా కుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్ కనక రత్నం, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తల్లులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ




**మామిడికుదురు.ఆగస్టు 05(ప్రభాతవార్త)** లూటుకుర్రు గ్రామంలో బుధవారం రైతులకు ప్రకృతి వ్యవసాయం,నానో ఎరువుల వినియోగం,నూతన సాగు పద్ధతుల పై మండల వ్యవసాయఅధికారి ఎన్ వి సత్యనారాయణ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. భూసార పరీక్షల నిర్వహించుకుని వాటి ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి జేఏన్ వి వి మనోహర్ కృష్ణ రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఆత్మా ఛైర్మన్ ఆరుమెల్లి సత్యసాయిబాబా మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని పట లో అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త ఎమ్.నందకిశోర్ మాట్లాడుతూ వరిలో సమగ్ర సస్య రక్షణ మరియు నానో ఎరువుల గురించి వివరించారు.మామిడికేద్ర వరి పరిశోధనా ప్రధాన శాస్త్రవేత్త పి.రాధిక మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వలన ఉష్ణోగ్రతలు పెరిగి వరి పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.శాస్త్రవేత్త జి. రమేష్ బాబు వరిలో కలుపు యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఏపిఏస్ రాజశేఖర్,మాజీ సర్పంచ్ తాతకాపు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బోనం సత్య నాగేశ్వరావు,నీటి సంఘం అధ్యక్షులు మద్దాల తమ్మన్న , ఆత్మా కమిటి సభ్యులు చెల్లింగి శిరీష,విల్ల శ్రీ రామారావు,తెలగారెడ్డి నాగేశ్వరావు రైతులు అడబాల పెద్దిరాజు , కడలి వెంకటేశ్వరులు ఏఈఓ కె.స్వాతి రమాదేవి, శివరామ కృష్ణ మరియు గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులు డి.ఉమా మహేశ్వర ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## ముగిసిన అర్బయాన్ కార్యక్రమాలు.



**మామిడికుదురు.ఆగస్టు 05(ప్రభాతవార్త)** ముస్లిం ఆరాధ్యదైవం హజ్రత్ ఇమామ్ హుస్సేన్ తోపాటు ఆయన పరివార సభ్యులు కర్బలా పుణ్య భూమిలో అమరత్వం పొంది 40 రోజులు పూర్తి అయిన సందర్భంగా ప్రతీ ఏటా జరుపుకునే అర్బయీన్ కార్యక్రమాలు సోమవారం నుంచి ప్రారంభమై బుధవారంతో ముగిసాయి.ఈ సందర్భంగా నగరం పంజేషా నుండి షహజాదే అలీ అస్గర్ ఊయలను తీసి నౌహాలు ఆలపిస్తూ మాతం చేస్తూ మంజిలే కర్బలా కు తీసుకువచ్చారు. అనంతరం మజ్లిస్ జరిగింది.ఈ మజ్లిస్ లో మౌలానా సయ్యద్ అంబర్ ఆబిదీ ఆనాడు కర్బలా పుణ్య భూమిలో ఆరు నెలల పసికందు అలీ అస్గర్ వీర మరణం పొందిన సంఘటనను భక్తులకు వివరించారు.భక్తులు కన్నీటి పర్యంతమయ్యారు.గురుహే తాజ్ దారే పురాత్ భక్త బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు,మహిళలు పాల్గొన్నారు.సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో పాటు స్థానికులు ఆలు భక్త బృందాల ఆధ్వర్యంలో భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు.

## ఎలినో ప్రభావంపై శాస్త్రవేత్తలు రైతులకు శిక్షణ



**రాజవొమ్మంగి, ఆగస్టు 05, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం అప్పలరాజుపేటలో వ్యవసాయ శాఖ, ఆత్మ సంయుక్తంగా ఎలినో ప్రభావంపై రైతులకు శిక్షణ కార్యక్రమం బుధవారం ఏ. ఓ చక్రధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కె. వి. కె.పందిరిమామిడి శాస్త్రవేత్త డా. ప్రవీణ్ బాబు ఎల్నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ కాల వ్యవధి వరి రకాలు, పప్పు పంటలు సాగు చేయాలని సూచించారు. రైతు ఆత్మీయ రథసారధి శాస్త్రవేత్త డా. జోగారావు వరి పంటలో ఎరువులు, జీవ ఎరువుల వినియోగాన్నిపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాస్త్రవేత్త డా. పుష్పవతి జీడిమామిడి, మామిడి పంటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలను వివరించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శివశ్రీనివాస్, చక్రధర్, వి. ఏ. ఏ.లు, ఏపీసీ ఎన్ ఎఫ్. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ర్యాలి గ్రామ సచివాలయాన్ని సందర్శించి.. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి..కె.సురేష్ కుమార్



**ఆత్రేయపురం, ఆగస్టు 05,(ప్రభాత వార్త)** మండలంలోని ర్యాలి గ్రామ సచివాలయాన్ని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి..కె.సురేష్ కుమార్ ,ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజులు సందర్శించి స్థానిక సంక్షేమ పథకాలు, రికార్డులను పరిశీలించారు. అలాగే సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలోని ప్రతి శాఖ ఉద్యోగి పనితీరును, సంబంధిత శాఖలకు అవసరమైన సూచనలు చేశారు. ఆరోగ్య శాఖ సిబ్బంది (ఏఎన్ఎం)లకు సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తుగా ఫీవర్ సర్వేలు నిర్వహించాలని, గ్రామ ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య నియమాల, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.పంచాయితీ కార్యదర్శిని ఇంటి పన్ను, ఇతర పన్నులు వసూళ్ల పురోగతిపై, బకాయి పన్నులను సకాలంలో పూర్తిస్థాయిలో వసూలు చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయితీ కార్యదర్శులకు గ్రామంలోని మంచినీటి వాటర్ ట్యాంకుల్లో క్రమం తప్పకుండా క్లోరినేషన్ నిర్వహించాలని, ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్--2026 నిబంధనల ప్రకారం తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి విధానంపై గ్రామ ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. సాలిడ్ వేస్ట్ షెడ్లను సందర్శించి, అక్కడి నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. వర్మీ కంపోస్ట్ తయారీ ప్రక్రియను పరిశీలించి, క్లాప్ మిత్రాలకు, సంబంధిత సిబ్బందికి నిర్వహణపై తగిన సూచనలు చేసి, మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.వి.ఆర్.కె. రాజు,(పూర్తి అదనపు బాధ్యతలు) జిల్లా పంచాయితీ వనరుల కేంద్ర రిసోర్స్ పర్సన్ యు.చంద్రశేఖర్, పంచాయితీ కార్యదర్శి వి. నాగశ్రీ, గ్రామ సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రాలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు రూ. 4000 ఆర్థిక సాయం

### జిల్లా బాలల పరిరక్షణ అధికారి వెంకట్రావు



**పిఠాపురం, ఆగస్టు 5 ( ప్రభాతవార్త)** హెచ్ ఐ వి బాధిత కుటుంబాలు, అనాధలు, పాక్షిక అనాధలకు నెలకు రూ. 4000 చొప్పున ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని జిల్లా బాలల పరిరక్షణ అధికారి సిహెచ్ వెంకట్రావు తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకంలో బాధిత కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం చేయడం జరుగుతుందని తెలియజేశారు. పిఠాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు గారు కార్యాలయంలో బుధవారం బాధితులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబాల జీవన స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన రెండు కుటుంబాల దయనీయ పరిస్థితిని చూసి ఆయన చలించిపోయారు. బాధితులకు సాయం చేసే లక్ష్యంతో సామర్లకోట మండలం ఉండురు కే టి సి వ్యవస్థాపకులు ప్రవీణ్ చక్రవర్తికి విషయం తెలియజేయడంతో ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. ఒక్కొక్క కుటుంబానికి రూ. 10000 ఆర్థిక సాయం అందజేశారు. కేటీసీ పాఠశాలలో కేర్ టేకర్ గా ఒకరికి, హాస్టల్ సూపర్వైజర్ గా ఒకరికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఈ సందర్భంగా కేటీసీ విద్యాసంస్థల అధినేత ప్రవీణ్ చక్రవర్తికి బాలల పరిరక్షణ అధికారి సిహెచ్ వెంకట్రావు పిఠాపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ మోకా శ్రీకళ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల విభాగం కౌన్సిలర్ దుర్గారాణి ఐసిడిఎస్ సూపర్వైజర్ మానసా దేవి పాల్గొన్నారు.

## పిఠాపురంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

### కమిషనర్ ఎస్ టి వి రాజేశ్వరరావు



**పిఠాపురం, ఆగస్టు 5 ( ప్రభాతవార్త )** పిఠాపురం పురపాలక సంఘంలో గల 30 వార్డులలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరిచేందుకు శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టడం జరిగిందని పిఠాపురం మున్సిపల్ కమిషనర్ ఎస్ టి వి రాజేశ్వరరావు తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం సమయంలో 30 మంది సిబ్బందితో మూడు సచివాలయ ల పరిధిలో పారిశుద్ధ్య ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. కాలువలలో పూడిక తొలగించి ట్రాక్టర్లతో తరలించడంతోపాటు, రోడ్లను పరిశుభ్రంచేయడం జరుగుతుందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలతో పాడా పీడి శివరామ ప్రసాద్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టడం జరిగిందన్నారు. ప్రతిరోజు మూడు సచివాలయాల వంతున ఐదు రోజుల్లో పురపాలక సంఘం పరిధిలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పూర్తి చేస్తామని కమిషనర్ రాజేశ్వరరావు తెలిపారు.

## అమ్మపాలు అమృతం.. హెచ్. వి. లక్ష్మి



**రాజవొమ్మంగి, అగస్టు 05, ప్రభాతవార్త** అప్పుడే పుట్టిన శిశువుకి తల్లి మురిపాలు వెంటనే ఇవ్వాలని, అమ్మపాలు అమృతం అని జడ్డంగి ప్రభుత్వ ఆసుపత్రి పి. హెచ్. ఎన్. నీలాద్రి లక్ష్మి అన్నారు. చేరుకుంపాలెం అంగన్వాడీ కేంద్రంలో చేరుకుంపాలెం, మారేడుబాక పంచాయితీల స్థాయి తల్లిపాలు వారోత్సవ కార్యక్రమం సూపర్ వైజర్ వీరయ్యమ్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా వీరయ్యమ్మ మాట్లాడుతూ ఆరు నెలలు వరకూ శిశువుకి తల్లి పాలను పట్టించాలని అన్నారు. తల్లి పాలు పట్టే పద్ధతిని ఏ. ఎన్. యం. నూకరత్నం వివరించారు. సూపర్ వైజర్ వీరయ్యమ్మ, పి. హెచ్. ఎన్. నీలాద్రి లక్ష్మి, ఏ. ఎన్. యం. వి. నూకరత్నం, హెల్త్ అసిస్టెంట్ సింగిరెడ్డి పద్దరాజు, అంగన్వాడీ వర్కర్స్ కె. చిన్నతల్లి, బి. సునీత, డి. బుల్లమ్మ, కె. సూర్యకుమారి, వై. వరలక్ష్మి, పి. లక్ష్మి, బి. రత్నకుమారి, హెల్పేర్ సి. హెచ్. లక్ష్మి, ఆశ వర్కర్స్ బి. వెంకటలక్ష్మి, యం. కృష్ణకుమారి, స్థానికులు, తల్లులు పాల్గొన్నారు. రాజవొమ్మంగి లో బుధవారం అంగన్వాడీ వర్కర్ వెంకటలక్ష్మి అధ్యక్షతన సూపర్ వైజర్ వీరయ్యమ్మ ఆధ్వర్యంలో తల్లి పాలు వారోత్సవ ర్యాలీ జరిగింది. తల్లి పాలు ముద్దు.. డబ్బాపాలు వద్దు అంటూ నినాదాలు చేసారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఏ. ఎన్. యం రత్నకుమారి మాట్లాడుతూ అమ్మపాలలో అమృతం ఉంటుందన్నారు. పాలు ఇచ్చే తల్లులకు రోగాలు దరిచేరవని అన్నారు. సూపర్ వైజర్ వీరయ్యమ్మ, అంగన్వాడీ వర్కర్స్ వెంకటలక్ష్మి, చిన్ని కుమారి, రమణి, లక్ష్మి, పి. లక్ష్మి, సత్యవతి, నర్సివేణి, గౌరీపార్వతి, నూకరత్నం, వీరలక్ష్మి, ఏ. ఎన్. యం. సత్యవతి, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు. కిర్రాబు పంచాయితీ తాళ్ళపాలెంలో బుధవారం తల్లి పాలు వారోత్సవ కార్యక్రమం జరిగింది. హెచ్. వి. రమాబాయి తల్లి పాలు విశిష్టతను వివరించారు. 6 నెలలు వరకూ తల్లి పాలు ఇవ్వాలని యం. ఎల్. హెచ్. పి. భాగ్యలక్ష్మి అన్నారు. ఏ. ఎన్. యం. రాఘవ తల్లి పాలులో రోగ నిరోధక శక్తి ఉంటుందని అన్నారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ వరలక్ష్మి, పూర్ణిమ, సత్యవేణి, బేబీ కుమారి, సత్యమాంబ, స్థానికులు, తల్లులు పాల్గొన్నారు.

## రెండేళ్ల కూటమి పాలనలో నమ్మకం

### అభివృద్ధి -సంక్షేమం...



**ఆత్రేయపురం, ఆగస్టు,05,(ప్రభాత వార్త)** కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు ఆదేశాల మేరకు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో తొమ్మిదవ రోజు బుధవారం వెలిచేరు గ్రామంలో పదవ బూత్ లో. రెండేళ్ల-నమ్మకం- అభివృద్ధి -సంక్షేమం... ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమం వెలిచేరు సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి సత్యనారాయణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 10 వ బూత్ కన్వీనర్ నాగిరెడ్డి రాజు టిడిపి సీనియర్ నాయకులు కొప్పుల సత్యనారాయణ, జనసేన నాయకులు సత్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణహితం " పిఠాపురం" నియోజకవర్గం.

### సేవా సంస్థల విరాళాలతో మొక్కలు నాటే కార్య క్రమం



**పిఠాపురం, ఆగస్టు 5 ( ప్రభాతవార్త )** పిఠాపురం నియోజకవర్గాన్ని పచ్చని, పరిశుభ్రమైన పర్యావరణహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ, పిఠాపురం పురపాలక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో " గ్రీన్ పిఠాపురం " కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు పాడ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.వి శివరామ ప్రసాద్ ప్రభాతవార్తకు తెలిపారు. దీనిలో భాగంగా వ్యాపార సంస్థలు,వర్తక, వ్యాపార సంఘాలు,కాలనీల సంక్షేమ సంఘాలు,స్వచ్ఛంద సంస్థలు,విద్యాసంస్థలు, సేవా ట్రస్టులు,పరిశ్రమలు,స్వచ్ఛంద సంస్థలు,ముందుకు వచ్చి విరాళాల రూపంలో మొక్కలను అందించి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రీన్ పిఠాపురంలో భాగంగా ఒక మొక్కను రూ. 600 తో దత్తత తీసుకునే అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. విరాళాల ద్వారా నాటిన ప్రతి మొక్కకు ప్రత్యేక గుర్తింపు కార్డు ఇవ్వడంతో పాటు దాతల పేర్లను గ్రీన్ డానర్స్ బోర్డులో ప్రదర్శిస్తామని ఆయన చెప్పారు. మన పిఠాపురం- మన బాధ్యత అనే భావనతో ప్రతి ఒక్కరూ ఈ పర్యావరణ హి త యజ్ఞంలో ముందడుగు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## స్థానిక సమస్యలపై క్షేత్రస్థాయి పర్యటన... : ఎమ్మెల్యే దేవ...



**సఖినేటిపల్లి ఆగస్టు 5, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలంలో అంతర్వేదిపాలెం మర్లకొడప (గున్నాలు), అంతర్వేదికర దిండకొడప ప్రాంతాల్లో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ క్షేత్ర స్థాయిలో పర్యటించి, స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అంతర్వేదిపాలెం గ్రామంలోని చింతా వారి తూము, భీరా వారి గ్రూప్, కట్టా వారి గ్రూప్, మర్లకొడప ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే దేవ రహదారులు, విద్యుత్ సౌకర్యాలు, డ్రైనేజీతో పాటు ఇతర మౌలిక వసతుల సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అంతర్వేది కర గ్రామంలోని దిండకొడప ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే దేవ అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సరఫరా, రహదారుల సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండదని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ డైరెక్టర్ జి నరసింహారావు, గుబ్బల ఫణి, మలే నగేష్, పి కిషోర్, ఎన్డీఏ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రైస్తవులకు భద్రత కల్పించాలి :బాబురావు




**గోపాలపురం, ఆగష్టు 5 (ప్రభాతవార్త):** రాజ్యాంగం కల్పించిన హక్కులతో ప్రతి వ్యక్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలతో జీవించే అవకాశం ఉందని బొగ్గవరపు బాబురావు అన్నారు. తిరుగుడుమెట్ట గ్రామంలో సీఎఫ్ఆర్ఏ పాస్టర్ల సమావేశంలో భాగంగా బేతస్థ ప్రేయర్ టవర్‌లో బుధవారం దళిత క్రైస్తవుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాబురావు మాట్లాడుతూ, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 ప్రకారం ప్రతి వ్యక్తికి తనకు నచ్చిన మతాన్ని స్వీకరించే, ఆచరించే, ప్రచారం చేసే స్వేచ్ఛ ఉందన్నారు. ఆ హక్కులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. అయితే నేటి సమాజంలో కొన్నిచోట్ల క్రైస్తవులపై దాడులు జరగడం బాధాకరమని అన్నారు. అలాంటి ఘటనలను క్రైస్తవులు చట్టబద్ధంగా ఎదుర్కోవాలని, ప్రభుత్వం కూడా క్రైస్తవులకు తగిన రక్షణ కల్పించాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల విషయంలో ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. జీఎంపీఎఫ్ అధ్యక్షుడు గేల్లా ఎలీషా మాట్లాడుతూ, దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. విద్య, ఉపాధి, సంక్షేమ పథకాల ప్రయోజనాలు వారికి సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బేతస్థ సంఘ కాపరి మెప్పెల్లి జాన్ బాబు, సువర్ణరాజు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన పాస్టర్లు, దళిత క్రైస్తవులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు ఎలనినో ప్రభావ అవగాహన....




**సఖినేటిపల్లి ఆగస్టు 5, ప్రభుతు వార్త:** బి ఆర్ అంబేద్కర్ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం, తుఫాను ఆశ్రమ భవనం నందు మత్స్యశాఖ ఆధ్వర్యంలో బోటు ఓనర్లకు, కలాసీలకు, మత్స్యకారులకు, ఎలనినో ప్రభావం 2026-27 ప్రభావంపై అవగాహన, ప్రచార కార్యక్రమం నిర్వహించారు. రాజోలు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి అయిన సిహెచ్ గోపాలకృష్ణ, మాట్లాడుతూ ఎలనినో ప్రభావం రాబోయే సంవత్సరం వరకు ఉంటుందని, మత్స్యకారులందరూ తగు సూచనలు పాటిస్తూ, జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే విధంగా ట్రాన్స్పాండర్లను, ప్రతి బోటుకు ప్రభుత్వం కంపల్సరీ చేశిందని, త్వరలో ప్రతి బోటుకు అమరుస్తామని, అవి వేట సమయంలో ప్రమాదాలు జరిగితే, సమాచారం తెలుసుకోడానికి ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. నభ మిత్ర యాప్ ను అందరూ ఇన్స్టాల్ చేసుకొని, ఎప్పటికప్పుడు యాప్ అందరి సమాచారాన్ని తెలుసుకోవాలని వారికి తెలియజేశారు. ఈ యొక్క సదస్సుకు అంతర్వేది గ్రామ మత్స్య సహాయకులు, సాగరమిత్ర, గ్రామ పెద్దలు, మత్స్యకారులు హాజరయ్యారు.

## వర్షాభావ పరిస్థితులపై రైతుల అవగాహన

**యు.కొత్తపల్లి, ఆగస్టు 5 (ప్రభాతవార్త) :** వర్షాభావ పరిస్థితులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సీతారామ శర్మ అన్నారు. మండలంలోని రమణక్కపేటలో బుధవారం వ్యవసాయం పై వర్షాభావ ప్రభావంపై రైతు లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షాలు అతివృష్టి - అనావృష్టి గా ఉంటాయన్నారు. రైతులు వ్యవసాయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. భుసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకోవాలని సూచించారు. వరిలో కలుపు యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో రమణక్కపేట నీటి సంఘం అధ్యక్షులు రామకృష్ణా రెడ్డి, మండల వ్యవసాయాధికారి జోగిరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## పది రోజుల్లో ప్రజా సమస్యలు పరిష్కరించాలి



**గోకవరం:ఆగష్టు 5 ప్రభాత వార్త** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం డివిజన్ డెవలప్మెంట్ అధికారి వీణాదేవి, ఎంపీడీవో గోవింద్‌తో కలిసి గోకవరం మండలం గుమ్మలదొడ్డి గ్రామపంచాయతీలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామ పారిశుద్ధ్యం, శానిటేషన్‌తో పాటు ఇతర ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో విఏఓలు, ఐసిడిఎస్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంపీటీసీ సభ్యురాలు కోట సత్యవతి, మాజీ ఎంపీపీ ఈడి రత్నజ్యోతి అశోక్, మాజీ వార్డు సభ్యుడు అబ్బిరెడ్డి రాంబద్రం, కోట చిన్న సూరిబాబు, రాజకీయ నాయకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో గ్రామ పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలు, వీధి దీపాలు, డ్రైనేజీ తదితర అంశాల పై గ్రామస్తులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వాటిని పరిశీలించిన అధికారులు సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువు సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును తొలగించి ఎదురుగా ఉన్న అనువైన స్థలంలో ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఎస్సీ, బీసీ కాలనీల సెంటర్ పాయింట్‌లో జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్మించిన నీటి ట్యాంకు నుంచి ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా అందేలా ఎలక్ట్రికల్ ఏఈతో సమన్వయం చేసి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవోకు ఆదేశించారు. అదేవిధంగా డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించడం, ఎస్సీ పేట నుంచి ప్రధాన రహదారి వరకు కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం వంటి పనులను వెంటనే చేపట్టాలని పంచాయతీ అభివృద్ధి అధికారికి సూచించారు. సమావేశంలో ప్రస్తావించిన అన్ని ప్రజా సమస్యలను వారం నుంచి పది రోజుల్లోగా పూర్తిగా పరిష్కరించి, చేపట్టిన పనుల ఫొటోలతో కూడిన నివేదికను సమర్పించాలని ఎంపీడీవోతో పాటు సంబంధిత శాఖ అధికారులను రాజమహేంద్రవరం డివిజన్ డెవలప్మెంట్ అధికారి వీణాదేవి ఆదేశించారు

## ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం



**గోకవరం. ఆగష్టు 5 ప్రభాత వార్త** తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గుమ్మలదొడ్డి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పై బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం, గోకవరం మండలం రంప ఎర్రపాలెం గ్రామానికి చెందిన కాళ్ల వీర వెంకట సత్యనారాయణ (అలియాస్ బుజ్జి) ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా, అదే మార్గంలో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ తీవ్ర గాయాలతో ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు సమాచారం అందుకున్న గోకవరం మహిళ ఎస్సై నాగమణి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, స్థానికుల నుండి వివరాలు సేకరించారు అనంతరం పోస్ట్ మార్టం నిమిత్తం గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించి తదుపరి చర్యలు చేపట్టారు. డ్రైవర్ను అదుపులో తీసుకుని ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని తరలించే క్రమంలో కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు ఆందోళనకు దిగారు స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద నిరసన చేసేందుకు సిద్ధమవడంతో గోకవరం ఎస్సై నాగమణి ఘటన ప్రదేశానికి చేరుకుని నిరసనకారులతో మాట్లాడి సంబంధిత ఆర్టీసీ బస్సు యాజమాన్యంతో సంప్రదింపు జరపడంతో ఆందోళన సద్దుమణిగింది ఈ విషాద ఘటనతో రంప ఎర్రపాలెం గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.....

## ఏజెన్సీలో బంగారు వరలక్ష్మి కానుక 4 విశేషా స్పందన..

### బంగారు రూపులు కోసం తరలివచ్చిన మహిళలు.. లక్కీడ్రాలో గెలిపొందిన 160 మంది మహిళలకు ఉచితంగా వరలక్ష్మి రూపులు పంపిణీ..



**దేవీపట్నం ఆగస్టు 05 ప్రభాతవార్త :** ఏజెన్సీ ప్రాంతమైన పోలవరం జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరు పేట గ్రామం హైస్కూల్ గ్రౌండ్ లో బుధవారం నిర్వహించిన బంగారు వరలక్ష్మి కానుక -4కార్యక్రమానికి విశేషా స్పందన లభించింది. మండలంలోని గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. తౌలిత విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు, శ్రీమతి పద్మావతి దేవి గంగారత్నం దంపతులు వరలక్ష్మి దేవికి పూజ నిర్వహించి, జ్యోతి ప్రజ్వాలన చేసి లక్కీ డ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ ధ్యేయంగా, మహిళా మూర్తుల్లో హైందవ చైతన్యం తీసుకురావాలనే సంకల్పంతో, శ్రావణ మాసంలో మహిళలు ఎంతో సంతోషంగా వరలక్ష్మి పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో 2023 సంవత్సరంలో బంగారు వరలక్ష్మి కానుక కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమానికి మహిళల నుంచి విశేష స్పందన రావడంతో ఈ ఏడాది కూడా బంగారు వరలక్ష్మి కానుక -4 నిర్వహిస్తున్నామన్నారు. పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి మహిళకి బంగారు రూపు వచ్చే వరకు ఈ కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తూనే ఉంటానన్నారు. అనంతరం మండలానికి సంబంధించి లక్కీ డ్రాలో గెలిపొందిన 160మంది మహిళలకు కంబాల శ్రీనివాసరావు దంపతులు బంగారు వరలక్ష్మి రూపులు, పట్టు చీరలు ఉచితంగా పంపిణీ చేసారు. లక్కీ డ్రాలో గెలుపొందని 600 మంది మహిళలకు పట్టు చీరలు, పసుపు కుంకుమ పంపిణీ చేసారు.. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్దలు, మహిళలు పాల్గొన్నారు..

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర బంద్....



**సఖినేటిపల్లి ఆగస్టు 5, ప్రభాత వార్త:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు నియోజకవర్గం లో విజయవంతమైన ఏ బి వి పి రాష్ట్ర బంద్ ను ఆంధ్రప్రదేశ్ లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, డిమాండ్ చేస్తూ ఆగస్టు 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళాశాలల బంద్ కు ఏ బి వి పి రాష్ట్ర శాఖ పిలుపునిచ్చింది. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 6,800 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలి. కార్పొరేట్, ప్రైవేటు విద్యా వ్యాపారాన్ని అరికట్టి పేద విద్యార్థులకు నాణ్యమైన, ఉన్నతమైన విద్య అందుబాటులో ఉండాలి. 9 డిమాండ్లతో ఆగస్టు 5న రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్ కు ఏ బి వి పి పిలుపు ఇచ్చింది. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పోలిశెట్టి గణేష్, తాడి రవీంద్ర, విజయ్, అరుణ్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## వరద బాధిత ప్రజలపట్ల మీ సహకారం వెలకట్టలేనిది : టిడిపి



**వి.ఆర్.పురం,ఆగష్టు5,ప్రభాతవార్త** గోదావరి వరద బాధిత ప్రజలపట్ల మీ సహాయ,సహకారాలు వెలకట్టలేనివని, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటిడిఎ పిఒ శుభం నోక్వాల్ ల పనితీరుపట్ల జడ్.పి.టి.సి సభ్యులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాళ్ళ.రంగారెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షులు బొర్రా.నరేష్ కుమార్ లు పత్రికల ముఖంగా ప్రశంసించారు. ఈ మేరకు బుధవారం రంగారెడ్డి, నరేష్ కుమార్ లు ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడారు. గోదావరి వరదలు సంభవించిన నాటి నుండి ఇద్దరు అధికారులు తాము ఉన్నత స్థాయి అధికారులమనే విషయాన్ని పక్కనపెట్టి, ప్రజల్లో మమేకమై పనిచేశారని గుర్తు చేశారు. అంతే కాకుండా సదరు అధికారులు వరద సహాయక కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించటం అభినందనీయమన్నారు. వీరికి తోడు ఇద్దరు స్పెషల్ ఆఫీసర్లు తహసీల్దార్ సరస్వతి, మండల అభివృద్ధి అధికారి ఇమ్మాన్యుయేల్ తోపాటుగా, విద్యుత్, ఆర్.డబ్ల్యు.ఎస్, పోలీస్, ఫారెస్ట్, వైద్య ఆరోగ్య శాఖల పనితీరు బాగుందని వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాణాలను ప్రాణంగా పెట్టి, వరద గోదావరికి ఎదురొడ్డి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించిన మరపడవల కార్మికులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మరిన్ని వార్తలు 6లో

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

# విద్యుత్ వెలుగుల్లో వారపు సంత..

**మౌలిక వసతుల ఏర్పాటుతో వ్యాపారులు సంతోషం..**



**అంబాజీపేట, ఆగస్టు 5, (ప్రభాతవార్త):** అంబాజీపేట బుధవారం సంత విద్యుత్ కాంతులతో వెలిగిపోతుంది. అంబాజీపేట మాచవరం గ్రామపంచాయతీ పరిధిలోని కొర్లపాటివారిపాలెంలో సుమారు 150 ఏళ్ల క్రితం నుండి ప్రతీ బుధవారం వారపు సంత జరుగుతోంది. కూరగాయలు, మాంసాహారం, నిత్యవసర సరుకులు, గృహోపకరణ పరికరాలతో పాటు, పండ్లు-ఫలాలు, కూరగాయల నారు, విత్తనాలతో పాటు వివిధ రకాల వస్తువులు ఈ సంతలో విక్రయిస్తుంటారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే ఎంతో పేరు ప్రఖ్యాతులు సంతరించుకున్న అంబాజీపేట వారపు సంత కాలక్రమేణ సన్నగిల్లుతూ వస్తోంది. ఈ పోటీ ప్రపంచంలో కాలంతో పాటు పరిగెడుతున్న నేటి యువతకు వారపు సంతలు, రోజువారి సంతల గురించి పెద్దగా అవగాహన లేదు. ఆన్లైన్ కొనుగోలుకు అలవాటు పడిన యువతకు ఏ వస్తువు ఎక్కడ దొరుకుతుందో... ఎలా కొనుగోలు చేయాలో కూడా కనీస అవగాహన కూడా లేకుండా పోతోంది. అనాటి ప్రాచీనుల అవగాహనతో అన్ని రకాల వస్తువులు ఒకే చోట అమ్మకాలు జరిపేలా రూపొందించుకున్న ఆలోచనతో పుట్టిందే వారపు సంతలు, రోజువారి సంతలు. వారపు సంతలో కొనుగోలు చేసేందుకు ఉద్యోగులు, కార్మికులు, రైతులు, గృహస్తులు తమ తమ విధులను ముగించుకొని సంతకు వచ్చేసరికి చీకటి పడిపోవడంతో సరుకులు కొనుగోలు చేయలేకపోతున్నారు. అమ్మకానికి తెచ్చిన సరుకులు మిగిలిపోవటంతో వ్యాపారస్తులు అర్ధికంగా నష్టపోతున్నారు. ఇది గమనించిన వారపు సంత పాటదారుడు,పంచాయతీ కార్యదర్శి ఆలోచన చేసి దుకాణాలు ఏర్పాటు చేసే షెడ్లలో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. దీంతో సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా రాత్రి 9 గంటల వరకు సరుకులు దొరుకుతున్నాయి. అలాగే ఇతర వ్యాపార నిర్వాహకులు సైతం తమ తమ దుకాణాల వద్ద ఎలక్ట్రిక్ బల్బులను ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు నిర్వహించుకుంటున్నారు. పంచాయతీ కార్యదర్శి కె వి వి సత్యనారాయణ మాట్లాడుతూ సంతకు వచ్చే వ్యాపారులకు మౌలిక వసతులు ఏర్పాటులో భాగంగా నీటి అవసరం కోసం హ్యాండ్ పైపు వేయించామని, అలాగే పారిశుద్ధ పనులను చేపట్టి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

## తల్లి పాలే బిడ్డకు శ్రీ రామ రక్ష...



**సఖినేటిపల్లి ఆగస్టు 5, (ప్రభాత వార్త):** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెం గ్రామాలలో అంగన్వాడి కేంద్రాలలో తల్లి పాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజోలు ఐ సి డి ఎస్ సి డి పి ఒ ఇందిర పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన వెంటనే ముర్రే పాలు పట్టాలని బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, 6 నెలలు వచ్చిన సరిగా తల్లి పాలు ఇవ్వాలని, 7 నెల నుండి అనుబంధ ఆహారంతో పాటు తల్లి పాలు పట్టాలని, పాలిచ్చు తల్లులకు మంచి పోషక ఆహారంతో పాటు పరిశుభ్రత పాటించాలని తెలిపారు. తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని గోడ పత్రిక విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ విజయ భారతి, కే వెంకటలక్ష్మి, అనిత, గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## పశువులకు గర్భ కోశ వ్యాధి పరీక్షలు



**గండేపల్లి. ఆగస్టు 5. ప్రభాతవార్త** గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట లో పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు మండల పశు వైద్యాధికారి ప్రగడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టిడిపి నాయకులు కెవివి చౌదరి చేతుల మీదు గా ఈ కార్యక్రమం ప్రారంభించారు. పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డివిఎల్ డిఏ కాంతారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పశు కేంద్రీకృత విధానం ద్వారా పశువును చూసి కట్టించే విధానాన్ని తెలియజేసి, 30 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కెవివి రమేష్, ఎం సురేష్,నాయకులతో పశు వైద్యాధికారి శ్యాం ప్రసాద్, పశుసంవర్ధక శాఖ సహాయకులు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నిర్మూలనకు సహకరించాలి



**యు.కొత్తపల్లి, ఆగస్టు 5 (ప్రభాతవార్త) :** యువత మత్తు పదార్థాల అలవాటును వ్యసనంగా మార్చుకొని జీవితాలు, కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారని, అటువంటి మత్తు పదార్థాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరం ఎంతైనా ఉందని పిఠాపురం సిఐ శ్రీనివాస్ కోరారు. మండలంలోని ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్లో బుధవారం ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్తు పదార్థాల వలన కలిగే దుష్పరిణామాలను వీడియో ప్రదర్శన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాను అరికట్టేందుకు సహకరించాలన్నారు. వీటి అలవాటుతో యువత భవిష్యత్తును నాశనంతో పాటు, తల్లిదండ్రులు, సమాజానికి భారంగా మారుతున్నారన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఘనంగా టీడీ వ్యాక్సినేషన్

**విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్న వైద్య సిబ్బంది**



**గొల్లప్రోలు, ఆగస్టు 5,(ప్రభాత వార్త)** గొల్లప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) పరిధిలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు టీడీ (టెటనస్ డ డిప్తీరియా) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం అత్యంత విజయవంతంగా నిర్వహించారు. వైద్యాధికారి శాఖ ఆదేశాల మేరకు గొల్లప్రోలు,పిఠాపురం మండలం భోగాపురం,బి.ప్రత్తిపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆరోగ్య సిబ్బంది సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను సిబ్బంది అడిగి తెలుసుకున్నారు.అనంతరం ధనుర్వాతం, గొంతువాపు (డిఫ్తీరియా) వ్యాధుల బారి నుండి రక్షణ కల్పించేందుకు గాను 10 నుండి 16 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులందరికీ టీడీ వ్యాక్సిన్లను వేశారు. ఈ వ్యాక్సినేషన్ డ్రైవ్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య పర్యవేక్షకులు బాషా,రఊఫ్ బీ,గొల్లప్రోలు పీహెచ్సీ భోగాపురం ఏఎన్ఎం బేబీ,ఎంఎల్హెచ్పి జ్యోతి,ఆశా కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారు.పాఠశాల సిబ్బంది,వైద్య సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తమ పిల్లలకు టీకాలు వేయడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వాలి

**ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్**



**రంపచోడవరం, ఆగస్టు 5: ప్రభాతవార్త.** పోలవరం జిల్లాలో ప్రతి గ్రామంలో జన్మించిన ప్రతి శిశువుకు పుట్టిన గంటలోపే తల్లిపాలు అందేలా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా (ఆగస్టు 1 నుంచి 7 వరకు) నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సంబంధించిన వాల్ పోస్టర్ను జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్, ఓఎస్డీ జావలి, డీఎఫ్వో శివకుమార్ గంగల్, ఆర్డీవో కె. స్వాతి, ఎస్డీపీఓ అశ్రఫ్ అలీ, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ? ఉమాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శిశువు జన్మించిన వెంటనే తల్లి చేతులను శుభ్రంగా కడుక్కొని పాలివ్వాలని సూచించారు. పుట్టిన గంటలోపే తల్లిపాలు అందించడం ద్వారా శిశువుకు అవసరమైన రోగనిరోధక శక్తి లభిస్తుందని తెలిపారు. అలాగే జననం నుంచి తొలి ఆరు నెలల పాటు తల్లిపాలే శిశువుకు సంపూర్ణ ఆహారమని, ఈ కాలంలో ఇతర ఆహారం లేదా నీరు ఇవ్వకుండా పూర్తిగా తల్లిపాలే అందించాలని పేర్కొన్నారు. పోలవరం జిల్లాలోని ఎనిమిది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాధాన్యంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, పీడీ డ్వామా రాంప్రసాద్, డీడీఓ వెంకట్ నారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామమోహన్ రావు, డీపీఓ చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ సాంబశివరావు, డీఈవోలు జి. శ్రీరామ్ మూర్తి, వై. మల్లేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ రత్నాకరరావు, డీఎంహెచ్ఓ పి. సరిత, జీసీసీ డీఎం విజయలక్ష్మి, డీపీఓ రాజేష్ కుమార్, ఆర్టీసీ డీఎం మార్గరేట్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

## ఆదిత్య యూనివర్సిటీ విద్యార్థికి కరాటే లో సిల్వర్ మెడల్



**గండేపల్లి. ఆగస్టు 5. ప్రభాతవార్త** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ లో ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ ఏ.ఐ.ఎం.ఎల్. చదువుతున్న ఎమ్. ధనుష్ శ్రీ వెంకట సాయి ఈ నెల 1 మరియు 2 వ తేదీలలో విజయవాడ లో జరిగిన 23 వ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కరాటే ఛాంపియన్షిప్ లో సిల్వర్ మెడల్ సాధించడం జరిగింది అని ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సిలర్ డా. ఎన్ సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డా.ఎం.శ్రీనివాస రెడ్డి సిల్వర్ మెడల్ విజేత ఎమ్. ధనుష్ శ్రీ వెంకట సాయి ని అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అభినందనలు తెలియజేశారు.

## విద్యా రుణాలు విడుదల చేయాలి....

**యానాం, ఆగస్టు 5:(ప్రభాతవార్త)** పుదుచ్చేరి ఆదిద్రావిడ వెల్ఫేర్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్ ద్వారా గతంలో మంజూరైన లబ్ధిదారులకు విద్యా రుణాలను తక్షణమే విడుదల చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు గడుస్తున్నా నేటికీ విద్యా రుణాలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కళాశాలల్లో ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తక్షణమే విద్యా రుణాలను విడుదల చేసే విధంగా సంబంధిత శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## రవీంద్రచే విద్యార్థులకు సైకిల్స్ వితరణ.



**తాళ్లరేవు, ఆగస్టు 5(ప్రభాత వార్త):** కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పి. మల్లవరం పంచాయతీ పత్తిగొంది ప్రభుత్వ పాఠశాలలో చదువుచున్న సూదుర ప్రాంత నిరుపేద ముగ్గురు విద్యార్థినిలకు రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ వుంగరాల రవీంద్ర సైకిల్స్ అందజేశారు. అలాగే పి. మల్లవరం హైస్కూల్ కి చెందిన ఒక విద్యార్థికి సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి, పాఠశాలకు తిరిగి సహాయపడే విధంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో వుంగరాల వెంకటేశ్వరరావు, ధూళిపూడి సుబ్బారావు, స్కూల్ కమిటీ ఛైర్మెన్ పంపన నాగమణి ధూళిపూడి వెంకటరమణ (బాబీ ) ఉపాధ్యాయులు శ్రీనివాస్, పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## వసుధ ఫౌండేషన్ వారి చేయూత...



**సఖినేటిపల్లి/ మలికిపురం ఆగస్టు 5, ప్రభాత వార్త:** డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మలికిపురం మండలం మలికిపురం వసుధ ఫౌండేషన్ కన్వీనర్ జంపన బుజ్జిరాజు ఆద్వర్యంలో మొత్తం 70వేలు రూ.లు 7 మందికి మందపాటి నాగేశ్వరరావు లక్కవరం 10 వేలు, మన్నే చంద్రరావు ఇరుసుమండ 10 వేలు, ఏడిద శ్రీనివాసరావు పెదపట్నం లంక 10 వేలు, బెల్లంకొండ జ్యోషిత శ్రీ లక్కవరం 10 వేలు, కొల్లు సోమేశ్వరరావు తూర్పుపాలెం 10 వేలు, రావి బసవయ్య శృంగవరప్పాడు 10వేలు, బొరుసు శ్రీను బట్టేలంక 10 వేలు, వైద్య ఖర్చుల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనారోగ్య బాధితుల కుటుంబాలకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన రామరాజుకి వసుధ ఫౌండేషన్ కన్వీనర్ జంపన బుజ్జిరాజుకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బోనం రాజు, రాపాక చిన్ని, పాలపర్తి శేఖర్, పల్లపోతు జయదేవ్, వీరా కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## దాడుల సంస్కృతికి ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలి



**కొత్తపేట, ఆగస్టు 5,(ప్రభాతవార్త)** రాష్ట్ర ప్రభుత్వం ఏపీని దేశంలోనే అగ్ర భాగాన నిలపాలని ఆశయంతో అభివృద్ధితో ముందుకు వెళ్తుంటే ప్రతిపక్ష వైసిపి పార్టీ దాడులతో రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయాలని ప్రయత్నం చేస్తుందనీ జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ పల్లి ఏసు టిడిపి మండల శాఖ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్ టిడిపి మండల శాఖ ప్రధాన కార్యదర్శి కడలి భీమేశ్వరరావు ఆరోపించారు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న వైసిపి నేతలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే దాడులకు వైసిపి ప్రయత్నిస్తోందని విమర్శించారు రాష్ట్రంలో ఏ మూల చూసినా వైసిపి దాడులకుఅడ్డు అదుపు లేకుండా పోయిందన్నారు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే వైసిపి ఈ తరహా దాడులకు పాల్పడుతుందని గుర్తించాలన్నారు ప్రభుత్వం అరాచక వాదుల పట్ల కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నామన్నారు ఏపీ జెన్జీ వార్ పేరిట నియోజకవర్గాలలో వైసిపి సమావేశాలు నిర్వహిస్తూ అసత్యాలతో ప్రభుత్వంపైనా మంత్రి లోకేష్ పైనా బురద జల్లడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు

## నా భర్త ఆస్తిని అన్యాయంగా ఆక్రమించుకున్నారు

**బాధితురాలు ప్రియదర్శిని**



**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 5 లిప్రభావత వార్త)** తన భర్త మరణం తర్వాత తనకు న్యాయంగా రావాల్సిన ఆస్తిని తనకు అప్పగించాలని ఏడిద ప్రియదర్శిని కోరారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తనకు రావలసిన ఆస్తిని ఆడపడుచు అన్యాయంగా అనుభవిస్తుందని ఆవేదన చెందారు. రఘు దేవపురం గ్రామ సర్పంచ్ గా గతంలో పనిచేసిన తన ఆడపడుచు తన పట్ల చాలా దారుణంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఆడపడుచు ఆమె పిల్లలు వారి స్నేహితులు సైతం తనను దారుణంగా కొట్టారని హాస్పటల్లో వైద్యం చేయించుకున్నానని ప్రియదర్శిని వెల్లడించారు. అత్త మామ భర్త చనిపోవడంతో భర్తకు రావలసిన ఆస్తిని ఆడపడుచు తన పేరు నా రాయించుకుని అన్యాయంగా అనుభవిస్తున్నారని అడుగుతుంటే పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన చెందారు. తనకు న్యాయం జరగకపోతే మరణం తప్ప తనకే మార్గం కనిపించడం లేదని ఆమె ఆవేదన చెందాడు. ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు కోడే మోజేష్ బాబు మాట్లాడుతూ ప్రియదర్శనికి జరిగిన అన్యాయం చాలా దారుణంగా ఉందని ఆమెకు దక్కాల్సిన ఆస్తిని వెంటనే ఇవ్వాలని అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రస్తుతం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దృష్టికి కూడా ప్రియదర్శినికి జరిగిన అన్యాయం విషయం తీసుకెళ్ళమని చెప్పారు. ఎవరి మాట వినకుండా ప్రియదర్శిని ఆడపడుచు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. ప్రియదర్శిని కి న్యాయం జరగకపోతే నిరాహార దీక్ష చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో ప్రియదర్శిని తల్లి తాతపూడి సువార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శారదా దేవి అమ్మవారికి ఆషాడం సారె.

**ఊరేగింపుగా సారెని తీసుకువెళ్లిన భక్తులు.**

**భక్తులతో కటికటిలాడిన అమ్మవారి ఆలయం.**



**యానాం, ఆగస్టు 05: (ప్రభాతవార్త)** కేంద్రపాలిత ప్రాంతమైన యానాం గోపాల్ నగర్ లో కొలువై ఉన్న చదువుడు తల్లి శ్రీ శారదా దేవి అమ్మవారి ఆలయంలో ఆషాడ మాసం సందర్భంగా గ్రామ ఆడపడుచులు బుధవారం ఆషాడం సారెను అమ్మవారికి సమర్పించి పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే మహిళలు పసుపు, కుంకుమ, చీర, రవికె, గాజులు, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, చలివిడి, పానకం తదితర మంగళ ద్రవ్యాలతో సారెను సిద్ధం చేసి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. భక్తులు "జై శారదాదేవి" నినాదాలతో భక్తిశ్రద్ధలతో ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి తమ మొక్కులు సమర్పించారు.ఆలయంలో అర్చకులు ఎం ప్రభాకర్ శర్మ వేద మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, అష్టోత్తర శతనామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం ఆషాడం సారెను అమ్మవారికి సమర్పించి విశేష పూజలు చేశారు. పూలతో సుందరంగా అలంకరించిన అమ్మవారి దివ్యరూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.ఆషాడ మాసంలో అమ్మవారికి సారె సమర్పించడం వల్ల కుటుంబ సౌఖ్యం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలుగుతాయని విశ్వాసంతో మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమానికి గోపాల్ నగర్ పట్టణం పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.శ్రీ శారదా దేవి భక్త మహిళామండలి ఆధ్వర్యంలో లలితా సహస్రనామం పఠించి అమ్మవారి కీర్తనలు ఆలపించారు. పూజలు అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆషాడ మాసంలో సంప్రదాయబద్ధంగా ఈ సారె వేడుకలను నిర్వహిస్తున్నామని, భక్తుల సహకారంతో ఈసారి కూడా అత్యంత వైభవంగా కార్యక్రమం జరిగిందని తెలిపారు..ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వేగేశ్న గోపాలరాజు, వేగేశ్న భాస్కరరాజు, పొన్నాడ వెంక టేశ్వరరావు, కాపగంటి ఉమాశంకర్, అల్లూరి నరసింహారాజు, ముత్యాల ప్రసాద్, కాజులూరు రవిశంకర్ రెడ్డి, గోలుగుల రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15లోగా వరి పంటకు బీమా చేయించుకోండి

**ఏ.డీ.ఏ. జె. శశిబిందు పిలుపు**



**కడియం ఆగస్టు 5ం ప్రభాతవార్త)** తొలకరి వరి పంట సాగు చేసిన రైతులు ఆగస్టు 15వ తేదీలోపు తప్పనిసరిగా పంట బీమా చేయించుకోవాలని రాజమహేంద్రవరం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు (ఏ.డీ.ఏ.) జె. శశిబిందు సూచించారు. కడియం మండలం జేగురుపాడు గ్రామంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పంట బీమా, పంట నమోదు అంశాలపై అవగాహన కల్పించారు.తొలకరి వరి పంటకు ఎకరాకు బీమా మొత్తం రూ.38,000 కాగా, రైతులు 1.5 శాతం ప్రీమియంగా రూ.570 చెల్లించి ఆగస్టు 15లోపు బీమా నమోదు పూర్తి చేసుకోవాలని ఆమె తెలిపారు. పంట రుణం లేని కౌలు రైతులు మీ సేవ కేంద్రాలు లేదా రైతు సేవా కేంద్రాల్లో ప్రీమియం చెల్లించి బీమా పొందవచ్చని వివరించారు. మండల వ్యవసాయ అధికారి పి.వి. శ్రీనివాస్ మాట్లాడుతూ, తొలకరి సీజన్లో సాగు చేసిన అన్ని పంటలకు విధిగా పంట నమోదు చేయించు కోవాలని, వరి పంటకు ఈ-కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. పంట నమోదు ద్వారా ఎరువుల పంపిణీ, వ్యవసాయ యాంత్రీకరణ పథకాలు, ధాన్యం కొనుగోలు వంటి ప్రభుత్వ సేవలు సులభంగా అందుతాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రాజా రమేష్, భాగ్యశ్రీ, పలువురు రైతులు పాల్గొన్నారు

## కడియపులంకలో పీహెచ్సీ నిర్మాణ పనుల పరిశీలించిన బీజేపీ నేతలు




**కడియం, ఆగస్టు 5 (ప్రభాతవార్త)** కడియం మండలం కడియపులంక గ్రామంలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) భవన నిర్మాణ పనులను భారతీయ జనతా పార్టీ నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు కొటికలపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీహెచ్సీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశాయని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ఎలాంటి అవినీతికి తావు లేకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ను ఆదేశించారు. ప్రజారోగ్యానికి భారతీయ జనతా పార్టీ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న ఆయన, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొరుసు సుబ్రహ్మణ్యం, దాసరి ముత్యం, తాళాబత్తుల భవానీ భాస్కర్, పుల్లెపు వెంకటేశ్వరరావు, కొత్తపల్లి శివ తదితరులు పాల్గొన్నారు

## శ్రీ వెంకటేశ్వర స్వామి కరుణ, కటాక్షాలకు పాత్రులు కావాలి..



**అంబాజీపేట,ఆగస్టు 5, (ప్రభాతవార్త ):** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కరుణ, కటాక్షాలకు అందరూ పాత్రులు కావాలని ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యులు అన్నారు. తిరుమల-తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ తూర్పుగోదావరి జిల్లా శాఖ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలలో శ్రీవారి భక్తులు పాల్గోవాలన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెం శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఈ నెల నాలుగు నుండి ప్రారంభమైన ధార్మిక కార్యక్రమాలు 8వ తేదీ వరకు కొనసాగితాయని ఆయన తెలిపారు. ప్రతిరోజు సాయంకాలం ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులచే ఉపన్యాసము, స్థానిక శ్రీ శ్రీనివాస భజన మండలి గురువులు మట్టపర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 7న శుక్రవారం ఉదయం ఆలయం వద్ద స్థానిక మహిళా భక్తులచే కుంకుమ పూజ, గోపూజ నిర్వహిస్తామని, వీరుతోపాటు హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు పాల్గొంటారని అర్చకులు నరసింహాచార్యులు తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో ఉపన్యాసము, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా భక్తులు పాల్గొన్నారు.

## మండల బిజెపి పార్టీ అధ్యక్షులుగా వెంకన్న దొర



**శంఖవరం, ఆగస్టు 5, ప్రభాతవార్త** శంకవరం మండలం భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా అదెట్రా వెంకన్న దొరను నియమించారు. మండలంలోని నెల్లిపూడి లో బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదు మండలాలకు పార్టీ అధ్యక్షులు నియమిస్తూ జిల్లా పార్టీ అధ్యక్షులు బిక్కన విశ్వేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారని శంకవరం మండలం నుండి తనకు అవకాశం కల్పించడం ఎంతో ఆనందంగా ఉందని తనకి అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని నియోజకవర్గంలో గల నాయకులను కలుపుకుంటూ పార్టీ అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. అర్హులందరికీ కూటమి ప్రభుత్వం అందించే పథకాలను అందించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పాటుపడుతుందని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులుగా నియమించడంపై పలువురు అభినందనలు తెలియజేశారు

## మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులకు శాశ్వత పరిష్కారం.

**2 వ అదనపు జిల్లా జడ్జి చంద్రమౌళీశ్వరి.**




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు5, ప్రభాతవార్త.** మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలు పరిష్కారించుకోవటం వలన కక్షిదారులకు సమయం ఆదాకావట మేకాక సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్ మరియు 2వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్ర మౌళీశ్వరి అన్నారు.జాతీయ మధ్యవర్తిత్వ ప్రచారం 3.0 కార్యక్రమం కోర్టు ఆవణలోబుధవారం నిర్వహించారు. మధ్యవర్తిత్వం కక్షిదారులకు మేలైన మార్గమని ఆమె వివరించారు. ఈ సందర్భంగా 1కే రన్, మరియు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో 14వ అదనపు జిల్లా జడ్జి జి ప్రియదర్శిని స్పెషల్ మేజిస్ట్రేట్ పి వి ప్రసాదరావు, 2వ తరగతి మేజిస్ట్రేట్ సి.హెచ్ నాగేశ్వర రావు,బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాశి శేషారావు, న్యాయవాదులు సిహెచ్.అజయ్ కుమార్, బడుగు భాస్కర్ జోగేష్, నందెపు వెంకటేశ్వర రావు,ఎన్.వెంకన్న, ఎన్.శ్రీనివాస్, కె.శ్రీనివాస్ , ఎం.అచ్యుత్,డి.వెంకటేశ్వర రావు మధ్యవర్తులు, పీఎల్వీలు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యకరం



**కాట్రేనికోన, ఆగస్టు 05 (ప్రభాతవార్త)** పుట్టిన బిడ్డకు తల్లిపాలే ఎంతో ఆరోగ్యకరమని ఎంపీడీవో బి రాజేశ్వరరావు ముమ్మిడివరం ఐసిడిఎస్ సిడిపిఓ ముదునురి నిహారిక పేర్కొన్నారు.కాట్రేనికోన మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు, గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలను బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో, సిడిపిఓ మాట్లాడుతూ తల్లి పాలు అవశ్యకతపై మహిళా శిశు సంక్షేమ శాఖ అంగన్ వాడీ కేంద్రాల ద్వారా ప్రతి ఏటా తల్లి పాల వారోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. అంగన్ వాడీ కేంద్రాల పరిధిలో చిన్నారులకు, కౌమార బాలికలకు, గర్భవతులు, బాలింతలకు ఫౌష్టికాహారంను అందజేస్తున్నామన్నారు. తల్లి ముర్రు పాలును బిడ్డకు పట్టించడం ఆరోగ్య వంతమైన బిడ్డకు జన్మనిస్తుందన్నారు. బాలికలకు తెలిసీ తెలియని వయస్సులో బాల్యవివాహాలు చేయడంతో వస్తున్న టీనేజ్ ప్రెగ్నెన్సీతో తల్లి బిడ్డల ఆరోగ్యం ప్రమాదకరమన్నారు. పలువురు గర్భిణీలకు సామూహిక సీమంతాలు చేశారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ కృష్ణమోహన్ వైద్యురాలు దేవి శ్రీ రోజా, రమాశేషులు,తులసి, ఎల్వి రమణి, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెండు షాపులకు లీజుదారులు చెల్లించిన అడ్వాన్స్ ఎందుకు జమ కాలేదు

**పంచాయతీ అధికారులను ప్రశ్నిస్తున్న శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం**



**శంఖవరం ఆగస్టు5 ప్రభాతవార్త** మండల కేంద్రం శంఖవరంలో గల మార్కెట్ లో పంచాయతీకు చెందిన 22 షాపులకు లీజు దక్కించుకున్న లీజుదారులు చెల్లించిన అడ్వాన్సు రెండేళ్ళుగా ఎందుకు ప్రభుత్వ ఖాతాలో జమ చేయలేదని, తాము అడిగిన తర్వాతే చెల్లించడం ఏమిటని, ఇప్పటి వరకు ఆ సొమ్ము ఎవ్వరి వద్ద మూలిగిందో పంచాయతీ అధికారులు తేటతెల్లం చేయాలని శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం ప్రశ్నించింది. సంఘం అధ్యక్షుడు మేకల కృష్ణ నివాస గృహంలో సంఘం సభ్యులు పర్వత రామకృష్ణ, గునపర్తి అపురూప్, పగడాల బాబ్జి, బొమ్మిడి చిట్టిబాబు, రేలంగి సత్యనారాయణ పాల్గొని విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కృష్ణ మాట్లాడుతూ మార్కెట్ లో 22 షాపులను 15వ ఆర్థిక సంఘం నిధులతో 2023లో నిర్మించారన్నారు. వీటికి 1.7.2024 నుండి 30.6.2027 వరకు మూడేళ్ళ కాలానికి వేలం నిర్వహించారు. ఆయా షాపులకు వాటి డిమాండ్ ను బట్టి ఒక్కొ దానికి ఒక విధంగా డిపాజిట్ లను వసూలు చేసారు. ఆ వసూలు చేసిన సొమ్మును సమాచార హక్కు చట్టం ద్వారా డిసెంబర్ లో తాను అడిగిన తర్వాత ఫిబ్రవరి 2026 నుండి ఒక్కొక్క షాపుకు ఒక్కోక్క తేదీన ప్రభుత్వ ఖాతాకు జమ చేసినట్లుగా చలానాలు వెల్లడిస్తున్నాయి. ఇంకనూ 3 షాపులకు పూర్తిగానూ, కొన్ని షాపులకు డిపాజిట్లు బకాయిలు ఉన్నాయన్నారు. లీజుదారులు వేలం దక్కించుకున్న వెంటనే డిపాజిట్లు చెల్లించినప్పటికీ ప్రభుత్వ ఖాతాకు జమ చేయకపోవడం అధికారుల అలసత్వమా... లేక ఎవ్వరైనా వీటిని తమ సొంత ప్రయోజనాల కోసం రెండేళ్ళుగా వాడుకున్నారా... దీనిపై శంఖవరం గ్రామ ప్రజలకు అనుమానాలు ఉన్నాయని, వీటిని నివృత్తి చేయవలసిన బాధ్యత పంచాయతీ అధికారులకు ఉందని కృష్ణ అన్నారు. అనంతరం విలేకర్లకు తాను సమాచార హక్కు చట్టం ద్వారా పంచాయతీ అధికారులు డిపాజిట్లను ప్రభుత్వ ఖాతాకు జమ చేసిన చలానాల నకళ్ళను, ఇతర సమాచారాన్ని అందించారు. వీటిపై ఉన్నతాధికారులు పూర్తి దర్యాప్తు నిర్వహించి, ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం, డిపాజిట్లు జమ చేయడంలో నిర్లక్ష్యం చేసిన వారిపైన తగిన చర్యలు చేపట్టాలని శంఖవరం గ్రామ అభివృద్ధి సేవా సంఘం డిమాండ్ చేసింది.

## లబ్బర్తిలో మహిళా చట్టాలు, హైఫర్ కమిటీపై అవగాహన సదస్సు



**రాజవొమ్మంగి, ఆగస్టు 05, ప్రభాత వార్త** లబ్బర్తి గ్రామంలో బుధవారం రాజవొమ్మంగి ఎస్. ఐ. వెంకట్రావు ఆధ్వర్యంలో సి. ఐ. సన్యాసి నాయుడు అధ్యక్షతన మహిళా చట్టాలు, సైబర్ నేరాలు, హైఫర్ కమిటీపై అవగాహన సదస్సులో వివరించారు. ఈసందర్భంగా సి. ఐ. మాట్లాడుతూ శక్తి యాప్ వినియోగం, సైబర్ మోసాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. గిరిజన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హై పవర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు సి. ఐ. పేర్కొన్నారు. 1/70 చట్టం, జీవో నెం.3 అంశాలపై కమిటీ చర్చిస్తుందని తెలిపారు.

## కమిటీలో గ్రామ దేవతలకు ఘనంగా సారే కార్యక్రమం



**కె గంగవరం, ఆగస్టు 05,(ప్రభాతవార్త):** ఆషాడ మాసం సందర్భంగా కె గంగవరం మండలంలోని పామర్రు పుట్టాలమ్మ, ఊడిమూడి సోమలమ్మ గ్రామదేవతలకు గ్రామస్తులు ఘనంగా సారె కార్యక్రమం నిర్వహించినట్లు ఆయా ఆలయ కమిటీ వారు, అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో అమ్మవారిలకు ప్రత్యేక పూజలు నిర్వహించి రకరకాల పిండి వంటలతో పసుపు కుంకుమ చీర చలివిడి వడపప్పు పానకం మొదలైన వాటితో సారే కార్యక్రమాలు ఆయా గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు మహిళలు గ్రామస్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## జాతీయ రహదారి (ఏన్ హెచ్ 30 పై)

**ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు. ఒకరు మృతి మరొకరికి గాయాలు.**



**చింతూరు ఆగస్టు 5 ప్రభాత వార్త.** చింతూరు మండలం వీరాపురం- చిడుమూరు గ్రామాల మధ్య బుధవారం ఉదయం జాతీయ రహదారి ఎన్ హెచ్ 30 పై సి జి 21 ఎఫ్ 9900 నెంబర్ గల కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో అమలు విశ్వాస్ (40) మృతి చెందాగా, మరో మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. చింతూరు ఎస్సై సంతోష్ కథనం ప్రకారం భద్రాచలం నుండి జగదల్పూర్ వైపు వెళ్తున్న వశ్రీ హోండా గ్రాండ్ ఐటెం కారు అతివేగంతో ఎదురుగా వస్తున్న బైకును ఢీకొనడంతో బైక్ పై ప్రయాణిస్తున్న ఒరిస్సా రాష్ట్రం యం వి 79భార్యాభర్తలిద్దరికి తీవ్ర గాయాలైనాయి. చింతూరు ఏరియా ఆసుపత్రిలో ప్రాధమి క చికిత్స అనంతరం వారిని భద్రాచలం తరలించగా చికిత్స పొందుతూ అవిశ్వాస మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps